అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 20-3 -2018
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 81 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12 + 16 పేజీలు వెల : 5.00



మాది ఫెడరల్ ఫ్రంట్



ఇది రొటీన్ మోడల్ కాదు..

- మమతా బెనర్జీతో సీఎం కేసీఆర్ భేటీ
- పార్టీల కోసం కాదు.. ప్రజల కోసమే
- ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ, కాంగ్రెస్ విఫలం
- ప్రజల ఎజెండాతో త్వరలో కూటమి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తమది రొటీన్ మోడల్ ఫ్రంట్ కాదనీ, మాదో భిన్నమైన ఫెడరల్ ఫ్రంట్ అనీ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా తమ ఫ్రంట్ ఉంటుందని సీఎం కేసీఆర్ చెప్పారు. 70 ఏండ్ల కాంగ్రెస్, బీజేపీ పాలనలో ఏం అభివృద్ధి జరిగిందో అందరికీ తెలుసన్నారు. దేశంలో ఎన్నో సహజ వనరులున్నా ప్రజలకు లాభం చేకూరింది శూన్యమన్నారు. మూడో ఫ్రంట్ ఏర్పాటు విషయంపై చర్చించేందుకు సీఎం కేసీఆర్ సోమవారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కోల్‌కత్తాకు వెళ్లి అక్కడి ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో భేటీ అయ్యారు. సుమారు రెండు గంటల పాటు ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు అంశంపై వారు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఇద్దరు ముఖ్యమంత్రులు సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం బలమైన ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం ...9లో





మాట్లాడుతున్న గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని

బీఎల్ఎఫ్ దేశానికే ఆదర్శం

ఫాసిస్టు శక్తుల పీచమణిచేందుకు సువర్ణావకాశం

- వామపక్షాలు, సామాజిక శక్తుల కలయికతోనే ఇది సాధ్యం : సామాజిక ఉద్యమకారుడు, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని
- టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతో దోస్తీ నై: తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫాసిస్టు శక్తులు, మతోన్మాదుల పీచమణిచేందుకు ప్రస్తుతం దేశ ప్రజానీకానికి ఒక సువర్ణావకాశం లభించిందని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని చెప్పారు. వామ పక్షాలు, సామాజిక శక్తుల కలయిక వల్లే ఇది సాధ్యమవు తుందని వ్యాఖ్యానించారు. సీపీఐ (ఎం) ఆధ్వర్యాన గతేడాది నిర్వహించిన మహాజన పాదయాత్ర ముగింపు వార్షికోత్సవ సభ సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. జిగ్నేశ్ ప్రసంగిస్తూ.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకూ సాధ్యం కాని ఒక అద్భుతం ఇప్పుడు ఆవిష్కృతమైందని చెప్పారు. అది వామ పక్షాలు, సామాజిక శక్తుల ఐక్యతా రాగమని తెలిపారు. కారణాలేమైన ప్పటికీ ఈ రెండు శక్తులు ఇప్పటి వరకూ ఐక్యంగా ఉద్యమించక పోవటం వల్ల అణగారిన వర్గాలు తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చి లాల్, నీల్ జెండాలను ...10లో

టీఆర్ఎస్ పతనానికి నాంది కావాలి

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు


10లో

భూములను లాక్కునేందుకే భూ ప్రక్షాళన..

- పట్టా భూములు లాక్కుంటే కోర్టుకు వెళ్తాం: తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్‌రెడ్డి

కామారెడ్డి జిల్లాలో రైతుల రాస్తారోకో


వివరాలు 9లో

అధ్యక్షుడిగా మరో ఆరేండ్లు..

- రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ ఘన విజయం
- వ్లాదిమిర్ పుతిన్‌కు 76శాతం ఓట్లు


వివరాలు 7లో

టెన్త్ ఇంగ్లీష్ పేపర్ లీక్

- జిరాక్స్ తీసి సెంటర్లోకి పంపిన వైనం
- మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు ప్రయివేటు స్కూళ్ల నిర్వాహకులపై కేసు
- ఆదిలాబాద్ జిల్లాలో వాట్సాప్‌లో పేపర్ పంపిన ఇన్విజిలేటర్
- ఆర్డీఓ విచారణ.. నలుగురిపై చర్యలకు కలెక్టర్ ఆదేశం

వివరాలు 9లో

ఆరువారాలు ఆగండి..

- సభ్యత్వాల రద్దుపై నిర్ణయం వద్దు : హైకోర్టు మధ్యంతర ఆదేశాలు
- కోమటిరెడ్డి, సంపత్‌లకు ఊరట

వివరాలు 9లో

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయం రూ.1,00,116

- అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటన 9లో
- పేదరికం అనేక రకాలుగా వేదన కావొద్దు




ప్రాణం తీస్తున్న ఈత సరదా

మరో నలుగురు విద్యార్థులు మృతి
శోకసంద్రంలో తల్లిదండ్రులు

వివరాలు 9లో

జేఎన్‌యూలో టెన్షన్ టెన్షన్


వివరాలు 6లో



"తెలంగాణ ప్రజలకు "ఎలాంటి ఇబ్బందులుండవని పంచాంగ శ్రవణంలో లేనట్టుందిరా..!!

అవిశ్వాసానికి విపక్షాలే అడ్డు!

లోక్‌సభలో కేంద్ర వ్యవహార శైలి


- ఆందోళనల సాకుతో ఉభయసభలు వాయిదా
- రిజర్వేషన్ కోటా కోసం టీఆర్ఎస్ పట్టు



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా హామీని విస్మరించినందుకు నిరసనగా మోడీ సర్కారుపై టీడీపీ, వైసీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు వరుసగా రెండో రోజూ చర్చకు రాలేకపోయాయి. అవిశ్వాస తీర్మానాలు చేపట్టకపోవడానికి విపక్షాల ఆందోళనలే కారణమన్నట్టు కేంద్రం వ్యవహరిస్తోంది. వివిధ డిమాండ్లపై ప్రాంతీయ పార్టీలు చేపడుతున్న నిరసనలను సాకుగా చూపిన లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. హోదాతో పాటు రిజర్వేషన్లు, కావేరీ నదీ బోర్డు తదితర అంశాలపై వైసీపీ, టీడీపీ, టీఆర్ఎస్, అన్నాడీఎంకే, డీఎంకే ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఈ డిమాండ్లపై కేంద్రం సానుకూలంగానో లేదా వ్యతిరేకంగానో ఎలాంటి ప్రకటనా చేయలేదు. అయితే విపక్షాల ఆందోళనల నడుమ బిల్లులు ఆమోదించుకున్న కేంద్రం.. అవిశ్వాస తీర్మానాలు ఎందుకు చేపట్టలేకపోతోందని టీడీపీ ఎంపీలు నిలదీస్తున్నారు. ఇక రాజ్యసభ ఉదయం ప్రారంభమైన కొద్దిసేపటికే నేటికి వాయిదా పడింది.

ప్రత్యేక హోదా హామీని విస్మరించినందుకు నిరసనగా వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీలు తోట నరసింహం, గల్లా జయదేవ్‌కు కేంద్ర సర్కారుకు ...9లో



జవాన్ల ఆహారం అధ్వాన్నం

పార్లమెంటరీ కమిటీ ఆందోళన



న్యూఢిల్లీ : దేశ రక్షణ కోసం సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) జవాన్లకు అందించే ఆహారం అధ్వాన్నంగా ఉందంటూ పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్మీ, పారా మిలిటరీ బలగాలకు అందుతున్న ఆహారంపై బీజేపీ ఎంపీ మురళి మనోహర్ జోషి నేతృత్వంలోని పార్లమెంటరీ ప్యానెల్ అధ్యయనం చేసింది. కమిటీ తన నివేదికను లోక్‌సభకు సోమవారం అందజేసింది. కాగా.. జవాన్లకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత కొరవడిందని కమిటీ తన రిపోర్టులో అసంతృప్తి వ్యక్తం చేసింది. పారా మిలిటరీ బలగాలకు మంచి ఆహారం అందిస్తే ఆరోగ్యంగా, ధృడంగా ఉండటమే కాక, వారికి అదనపు ధైర్యాన్ని ఇచ్చినట్టవుతుందని అభిప్రాయపడింది. జవాన్ల ఆహారాన్ని పరీక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్రానికి సూచించింది. ఈ వ్యవస్థ ద్వారా.. ఆహారంలో అన్ని రకాల పోషక విలువలు సమృద్ధిగా ఉన్నాయా ? లేదా ? అన్నదానిపై నిత్యం పరీక్షలు జరపాలని పేర్కొన్నది. వంట చేయడానికి అనువుగా లేని ప్రాంతాల్లో ప్యాకింగ్ చేసిన ఆహార పదార్థాలను అందించాలని తెలిపింది. వీటన్నింటితో పాటు జవాన్లకు ఇస్తున్న రేషన్ భత్యాలకు పన్ను మినహాయింపు ఇవ్వాలని సూచించింది. ప్రస్తుతం ఈ భత్యాలకు పన్ను వసూలు చేస్తున్నారు. జవాన్లకు ఇస్తున్న ఆహారం బాగోలేదంటూ సోషల్ మీడియాలో కొంతకాలంగా వార్తలొస్తున్న సంగతి తెలిసిందే.

నలుగురు 'నాసా శాస్త్రవేత్తల'తో కర్నాటక మాజీ సీఎం..!



పది కోట్ల మంది రైతుల సంతకాల సేకరణ

ఆగస్టు 9న జైల్ భరో

- ఏప్రిల్ మొదటి వారం "త్రిపుర సంఘీభావం"
- సెప్టెంబర్‌లో రైతు, కార్మిక ఆందోళన
- ఏఐకేఎస్ కేంద్ర కమిటీ నిర్ణయాలను వెల్లడించిన హన్నన్ మొల్లా



న్యూఢిల్లీ : రైతు రుణమాఫీ, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధర కల్పించాలన్న ప్రధాన డిమాండ్లతో ఏప్రిల్ 15 నుంచి 23 వరకు పది కోట్ల మంది రైతుల సంతకాలు సేకరించి, 300 జిల్లాల కలెక్టర్లకు వినతులను అందజేస్తామని అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా చెప్పారు. ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సమావేశాలు ఆ సంఘ ప్రధాన కార్యాలయంలో రెండు రోజులపాటు జరిగాయి. కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు అశోక్ ధావలే, ఉపాధ్యక్షుడు అమ్రారామ్, సహాయ కార్యదర్శి విజూ కృష్ణన్, కోశాధికారి కృష్ణప్రసాద్‌లతో కలిసి కమిటీ నిర్ణయాలను హన్నన్ మొల్లా మీడియాకు సోమవారం వివరించారు. మహారాష్ట్ర రైతు ఉద్యమం జాతీయ స్థాయి చర్చకు దారితీసిందని, రైతు సమస్యలపై మాట్లాడని వారు కూడా ఇప్పుడు రైతాంగ సమస్యలపై మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ నిర్ణయాలను తెలిపారు. ఈ నెల 20, 21న భూమి అధికార్ ఆందోళన(బీఏఏ) నేతృత్వంలో వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక వ్యవస్థపై దాడి, దళిత, మైనార్టీల గోరక్షక్ హత్యలపై ఫోటో ఎగ్జిబిషన్, జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రుణమాఫీ, మద్దతు ధర ప్రధాన డిమాండ్లతో ఏప్రిల్ 15 నుంచి 23 వరకు దేశంలో పది కోట్ల మంది రైతుల సంతకాలను సేకరించి, దాదాపు 300 జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని, రైతాంగ సమస్యలపై ఆగస్టు 9న జైలోభరో కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. త్రిపురలో బీజేపీ ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత కిసాన్ సభ కార్యకర్తలపైన, సంఘం కార్యాలయాలపైన దాడులు జరుగుతున్నాయని, వందలాది కార్యాలయాలను బీజేపీ ఆరెస్సెస్ గూండాలు ధ్వంసం చేశారని అన్నారు. త్రిపురలో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఏప్రిల్ మొదటి వారం 'త్రిపుర సంఘీభావ వారం'గా ప్రకటించామని, ఈ వారం రోజుల్లో దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 11న సదస్సులు, ర్యాలీలు వంటి పలు కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. గో గూండాల దాడుల్లో పాల రైతు పెహ్లూఖాన్ హత్యకు గురై ఏప్రిల్ 3 నాటికి ఏడాది పూర్తవుతున్నదని, ఈ సందర్భంగా ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు.

తెలంగాణలో రైతులు నష్టపోతున్నారు: సారంపల్లి మల్లారెడ్డి

తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ 14 లక్షల మంది కౌలుదార్ల హక్కులను 1971 పాస్ పుస్తకాల చట్ట సవరణ ద్వారా తొలగించారని కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. ఎకరాకు రూ.4 వేలు సబ్సిడి ఇస్తున్న 14 లక్షల మందికి, దేవదాయ భూములను కౌలు చేస్తున్న 1.50 లక్షల మందికి, పోడు భూములను సాగుచేస్తున్న 1.20లక్షల మందికి, భూదాన యజ్ఞభూములు సాగు చేస్తున్న వారికి తొలగించారని తెలిపారు. ఈ విధంగా 76 లక్షల రైతుల్లో 26 లక్షల మందిని ఈ పథకం నుంచి తొలగించారని వివరించారు. గతేడాది తెలంగాణలో బీటీ-3 పేరుతో 18లక్షల ఎకరాల్లో వేసిన పంటలు పూర్తిగా నష్ట పోయారని తెలిపారు. భారత దేశంలో 1.3 మిలియన్ హెక్టర్లో ఈ పంట వేశారని, మాన్‌శాంటో కంపెనీకి భయపడి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికే ఏపి, తెలంగాణ, ఢిల్లీ నుంచి బిటి-3 విత్తనాలు సరాఫర చేసే వారిపై కేసులు రిజిస్టర్ చేయాలని ఒకవైపు చెప్పారని, మరోవైపున బిటి విత్తనాలకు ధర నిర్ణయించడం అత్యంత దుర్మర్గమని అన్నారు. వచ్చే ఏడాది తెలంగాణలో వ్యవసాయం మరింత సంక్షోభంలోకి నెట్టబడుతున్నదని, ఇలాంటి పరిస్థితిలో రాష్ట్రంలో సాగు అయ్యే 1.13 కోట్ల ఎకరాల వరి మినహా ఏ పంటల వేయాలో వ్యవసాయ శాఖ నిర్లిప్తంగా ఉందని అన్నారు. అందువల్ల ఆహారధాన్యాలు ఉత్పత్తులు దెబ్బతినే ప్రమాదముందని అన్నారు.

కాశ్మీర్ సమస్యను సైన్యం ద్వారా పరిష్కరించాలని చూస్తున్న కేంద్రం : ఏచూరి

కాశ్మీరీల అన్ని ద్వారాలను బీజేపీ ప్రభుత్వం మూసేసింది : తరిగామి

- సీపీఐ(ఎం) జమ్మూకాశ్మీర్ 11వ రాష్ట్ర మహాసభల్లో ఆ పార్టీ నేతలు



శ్రీనగర్: కాశ్మీర్ దేశానికి కిరీటంలాంటిదని,దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికీ ఉన్నదని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. కిరీటానికి సమస్య వస్తే అది దేశం మొత్తానికి సమస్యేనని ఏచూరి అన్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇదే విషయాన్ని తమ పార్టీ స్పష్టం చేసినట్టు ఏచూరి తెలిపారు. జమ్మూకాశ్మీర్‌లోని పీడీపీ-బీజేపీ ప్రభుత్వంలో పెద్ద వైరుధ్యమే ఉన్నదని ఏచూరి అన్నారు. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచీ కాశ్మీర్ సమస్యను మిలిటరీ ద్వారానే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తోందని ఏచూరి విమర్శించారు. పార్లమెంటరీ ప్రతినిధి బృందంలో తాను రెండుసార్లు కాశ్మీర్ వెళ్లిన విషయాన్ని ఏచూరి గుర్తు చేశారు. యూపీఏ-2 హయాంలో మొదటిసారి అక్కడికి వెళ్లినట్టు ఆయన తెలిపారు. తమ సిఫారసులను అమలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. రెండోసారి హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలోని బృందంలో వెళ్లినట్టు ఆయన తెలిపారు. తాము ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత కాశ్మీర్ సమస్యను కేవలం శాంతిభద్రతల సమస్యగా చూడొద్దని, రాజకీయ ప్రక్రియ ద్వారానే పరిష్కారం సాధిద్దామని చర్చల సందర్భంగా తీర్మానించామని..కానీ, ఒక్క ముందడుగు కూడా ఆ దిశగా పడలేదని ఏచూరి తెలిపారు. పెల్లెట్ గన్స్‌పై నిషేధం విధించాలని పార్లమెంట్‌లో డిమాండ్ చేసినపుడు సానుకూల ప్రకటన చేసిన రాజ్‌నాథ్‌సింగ్ ఆ తర్వాత వెనక్కి వెళ్లారని ఏచూరి గుర్తు చేశారు. భారత్, పాకిస్థాన్‌కు చెందిన జాతీయ భద్రతా సలహాదారులు మూడో దేశంలో సమావేశం అయ్యారు..కానీ, ప్రభుత్వం మాత్రం పాకిస్థాన్‌తో చర్చలు జరపబోమంటూ పార్లమెంట్‌లో చెబుతోందని ఏచూరి విమర్శించారు. కాశ్మీర్‌ను రాజకీయ సమస్యగా భావించి ఆ రాష్ట్రంలోని అన్ని భాగస్వామ్య పక్షాలతోపాటు పాకిస్థాన్‌తోనూ చర్చిండం ద్వారా పరిష్కారం సాధించాలని ఏచూరి స్పష్టం చేశారు. కాశ్మీర్ ప్రజల్లో విశ్వాసాన్ని పాదుకొల్పడం కోసం సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఉపసంహరించాలని ఏచూరి సూచించారు. కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కలిగించే 370 అధికరణంలోని అంశాలను అమలు చేయాలని ఏచూరి సూచించారు. త్రిపురలో బీజేపీ ఇటీవల సాధించిన విజయం అందుకు ఓ ఉదాహరణ అని ఏచూరి స్పష్టం చేశారు. మన్మోహన్‌సింగ్ హయాంలో ఒక్క శాతం కుబేరుల చేతుల్లో దేశ సంపదలో 49 శాతం ఉండగా, మోడీ హయాంలో అది 73 శాతానికి పెరిగిందని ఏచూరి అన్నారు. బహుళజాతి కంపెనీలకు లాభాలు ఆర్జించి పెట్టేలా, పేద ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా మోడీ విధానాలున్నాయని ఏచూరి అన్నారు. పెద్దనోట్ల రద్దు నిర్ణయం విదేశాలకు డబ్బు తరలించినవారికి, నల్ల డబ్బును తెలుపుగా మార్చుకునేవారికి ఉపయోగపడిందని ఏచూరి అన్నారు. అక్రమ సంపాదనాపరుల నుంచి నిధులు సేకరించి ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారని ఏచూరి విమర్శించారు. రాజ్యాంగంపై బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. సీపీఐ(ఎం) జమ్మూకాశ్మీర్ రాష్ట్ర 11వ మహాసభల సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రసంగించారు.

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడంలో తమ పార్టీ ప్రధాన పాత్ర పోషిస్తుందని ఏచూరి స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గోరక్షకులు, యాంటీ రోమియో స్క్వాడ్స్ పేరుతో ప్రయివేట్ సైన్యాలను ప్రోత్సహిస్తున్నారని ఏచూరి అన్నారు. గోరక్షణ, లవ్‌జిహాద్ పేరుతో దళితులు, ముస్లింలను చంపుతున్నారని ఆయన అన్నారు. వయోజనులు తమకు ఇష్టమైనవారిని వివాహమాడేందుకు భారత రాజ్యాంగం అనుమతిస్తుందని ఏచూరి తెలిపారు. కానీ, ఆర్ఎస్ఎస్-బీజేపీ, మోడీ సర్కార్ మాత్రం పౌరుల ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ, వివాహం, ఎవరు ఎవరితో స్నేహం చేయాలో నిర్ణయిస్తున్నాయని ఏచూరి విమర్శించారు.

కాశ్మీర్‌కు చెందిన సీపీఐ(ఎం) ఎమ్మెల్యే యూసుఫ్ తరిగామి మాట్లాడుతూ..కాశ్మీరీల అన్ని ద్వారాలను బీజేపీ ప్రభుత్వం మూసివేసిందని అన్నారు. కాశ్మీర్ యువకుడెవరైనా రాష్ట్రం బయట చదువుకునేందుకు వెళితే దాడులకు గురవుతున్నారని ఆయన అన్నారు. కాశ్మీర్ నుంచి బయటి రాష్ట్రాలకు వెళ్లేందుకు శ్రామికులు కూడా భయపడుతున్నారని ఆయన అన్నారు. దేశాన్ని ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ క్యాన్సర్‌లా పీడించినంతకాలం మైనారిటీలు, దళితులు, కాశ్మీరీల బతుకులు నరకప్రాయంగానే ఉంటాయని ఆయన అన్నారు. ఈ ఫాసిస్ట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడాలని సీపీఐ(ఎం)తోపాటు ప్రజాస్వామిక, లౌకిక శక్తులకు తరిగామి పిలుపునిచ్చారు. రెండురోజులపాటు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) జమ్మూకాశ్మీర్ రాష్ట్ర మహాసభలు మంగళవారం ముగియనున్నాయి.

కేంద్రమంత్రి కుమారుడి నేతృత్వంలో ర్యాలీ, రెచ్చగొట్టే నినాదాలు..

భాగల్పూర్‌లో మత ఘర్షణలు

కాల్పులు, రాళ్లు రువ్వుకున్న ఘటనలు

- ఇద్దరు పోలీసులు సహా ముగ్గురికి తీవ్ర గాయాలు

పాట్నా: హిందువుల నూతన సంవత్సర వేడుకల రోజు బీహార్‌లోని భాగల్పూర్‌లో నిర్వహించిన ర్యాలీ రెండు మతాలవారి మధ్య ఉద్రిక్తతలకు కారణమైంది. ఘర్షణల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిలో ఇద్దరు పోలీస్ సిబ్బంది. కేంద్రమంత్రి అశ్వినీకుమార్‌చౌబె కుమారుడు అరిజిత్ శషావత్ నేతృత్వంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగదళ్ కార్యకర్తలు శనివారం ఈ ర్యాలీ నిర్వహించారు. భాగల్పూర్‌లోని బుధానాథ్ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాల ద్వారా నాథ్‌నగర్‌కు చేరుకున్నది. ఈ క్రమంలో మేదినీచౌక్ ప్రాంతంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. ఇరువర్గాల మధ్య కాల్పులు సహా రాళ్లు రువ్వుకోవడంవంటి సంఘటనలు జరిగాయని సీనియర్ ఎస్పీ మనోజ్‌కుమార్ తెలిపారు. పలు షాపులు తగులబడినట్టు ఆయన తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, హింసాత్మక ఘటనలపై దర్యాప్తు జరుపుతున్నామని ఆయన తెలిపారు. ర్యాలీలో పాల్గొన్నవారు రెచ్చగొట్టే నినాదాలు ఇవ్వడంతో గొడవ ప్రారంభమైనట్టు మరో పోలీస్ అధికారి తెలిపారు. అయితే, రెచ్చగొట్టే నినాదాలేమీ ఇవ్వలేదని భాగల్పూర్ నుంచి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన శషావత్ అన్నారు. మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించామని, రాళ్లు రువ్వుకున్న ప్రాంతానికి తాను 3-4 కి.మీ. దూరంలో ఉండగా ఓ పోలీస్ జీపు తన ముందు నుంచి పోయిందని శషావత్ తెలిపారు. కేంద్రమంత్రి చౌబె కూడా తన కుమారుడిని సమర్థించారు. 'అరిజిత్ నా కుమారుడని చెప్పుకునేందుకు గర్వపడుతున్నాను. బీజేపీ కార్యకర్తలంతా నా కుమారుడివంటివారే. హిందువుల నూతన సంవత్సరం రోజున ర్యాలీ నిర్వహించడం తప్పా..?' అని చౌబె ప్రశ్నించారు. భారత్ మాత, వందేమాతరం నినాదాలు ఇవ్వడం తప్పెలా అవుతుందని చౌబె అన్నారు. శనివారం జరిగిన గొడవల నేపథ్యంలో ఆదివారం భారీగా పోలీసులు, పారామిలిటరీని ఉద్రిక్త ప్రాంతాల్లో మోహరించారు. నిషేధాజ్ఞలు విధించనప్పటికీ దుకాణాలు మూసి ఉంచారు.

హిందూ అతివాద సంస్థలు ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ర్యాలీలు తీయడం, ఆ సందర్భంగా రెచ్చగొట్టే నినాదాలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది జనవరిలో రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని కస్‌గంజ్‌లో తిరంగా యాత్ర పేరుతో నిర్వహించిన ర్యాలీ కూడా ఉద్రిక్తతలకు కారణమైంది. ఆ సంఘటనల్లో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై స్పందించిన బరేలీ జిల్లా కలెక్టర్ రాఘవేంద్ర విక్రమ్‌సింగ్.. ర్యాలీలు నిర్వహిస్తున్నతీరుపై ఫేస్‌బుక్‌లో విమర్శనాత్మక వ్యాఖ్యలు పెట్టారు. ఇటీవల ఓ కొత్త ట్రెండ్ మొదలైంది. ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ర్యాలీలు తీయడం, పాకిస్థాన్ వ్యతిరేక నినాదాలు ఇవ్వడం..ఎందుకు..? వీళ్లు పాకిస్థానీయులా..? అంటూ ఆయన ప్రశ్నించారు. ఆయనపై హిందూత్వవాదుల నుంచి ఒత్తిడి రావడంతో ఆ పోస్టుల్ని తొలగించారు. అయితే, ఆయన తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని చెప్పారు.

ఉన్నత విద్య ప్రయివేటీకరణ, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా

ఢిల్లీ వర్సిటీ అధ్యాపకులు ఐదు రోజుల సమ్మె



న్యూఢిల్లీ : దేశంలో అత్యధిక మంది విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే... కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయలోకం నిరసన గళం విప్పింది. విద్య ప్రయివేటీకరణ, వ్యాపారీకరణ చేసే ప్రభుత్వ ఎత్తుగడలను నిరసిస్తూ ఢిల్లీ యూనివర్సిటీ ఆందోళనను ముమ్మరం చేసింది. ఢిల్లీ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (డీయూటీఏ) ఐదు రోజుల సమ్మెను సోమవారం నుంచి ప్రారంభించింది. వెయ్యికిపైగా ఉపాధ్యాయులు విశ్వవిద్యాలయ నార్త్ క్యాంపస్‌లో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. విద్య ప్రజల హక్కు అంటూ నినాదాలు చేస్తూ వేలాది మంది ఉపాధ్యాయులు కదం తొక్కారు. ప్రయివేటీకరణ విధానాలలకు వ్యతిరేకంగా సెంట్రల్ యూనివర్సిటీల టీచర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఈడీసీయూటీఏ) కూడా ఈ నెల 28న మండీ హౌస్ నుంచి పార్లమెంటు స్ట్రీట్ వరకు ప్రదర్శనకు పిలుపునిచ్చింది. ఇతర వర్సిటీల ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. యూనివర్సిటీల ఆర్థిక భారం విద్యార్థులమీద వేసేలా హెచ్ఆర్‌డీ మంత్రిత్వ శాఖ తీసుకొస్తున్న విధానాలను ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ విధాన మార్పులలో 70 : 30 కొత్త నిధుల ఫార్ములాను హెచ్ఆర్‌డీ ఇటీవల ప్రకటించింది. 30 శాతం నిధులను వర్సిటీలే సమకూర్చుకోవాలని హెచ్ఆర్‌డీ కోరుతున్నది. కేంద్ర, ఇతర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులపై భారీగా ఫీజుల పెరుగుదలకు ఈ విధానం దారి తీస్తోందని వారు ఆరోపిస్తున్నారు.

విద్య, ఆరోగ్య రంగాల్లో గుజరాత్ వెనుకంజ

నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ: గత లోక్‌సభ ఎన్నికలకు ముందు 'గుజరాత్ మోడల్' అంటూ ఊదరగొట్టిన నరేంద్ర మోడీ.. తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో వాస్తవ పరిస్థితి ప్రచారానికి భిన్నంగా ఉంది. కీలక రంగాలైన విద్య, ఆరోగ్య రంగాల్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే గుజరాత్ వెనుకంజలో ఉన్నదని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ అన్నారు. రెండు రోజుల క్రితం ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాజీవ్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇతర రంగాలతో పోల్చితే విద్య, ఆరోగ్య రంగాల్లో గుజరాత్ పరిస్థితి బాగా లేదన్నారు. చిన్న పిల్లల మరణాలు, మాల్‌న్యూట్రిషన్ కేసులు తగ్గించాలన్నారు. దీనికోసం ఈ ఏడాది ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఈ రెండు రంగాల్లో గతంలో కేటాయించిన వాటికంటే అధికంగా నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

రాజా, కనిమొళిల నిర్దోషిత్వాన్ని సవాలుచేస్తూ ఢిల్లీ హైకోర్టుకు ఈడీ

న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రం కేసులో కేంద్ర మాజీ మంత్రి ఏ రాజా, డీఎంకే ఎంపీ కనిమొళిల నిర్దోషిత్వాన్ని సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఢిల్లీ హైకోర్టులో సోమవారం సవాలు చేసింది. రాజా, కనిమొళి సహా మొత్తం 19 మంది నిందితులను నిర్దోషులుగా పేర్కొంటూ గతేడాది డిసెంబర్‌లో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పును వెల్లడించింది. నిందితులపై ఆరోపణలను నిరూపించడంలో సీబీఐ వైఫల్యాన్ని తెలుపుతూ ప్రత్యేక న్యాయమూర్తి ఒ.పి సైని తీర్పునిచ్చారు. 2జీ లైసెన్సులు కేటాయించడంలో రూ.1.76 లక్షల కోట్ల మేర అవినీతి జరిగిందన్న కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) ఆరోపణల నేపథ్యంలో కేసును విచారించడానికి 2011లో ప్రత్యేక కోర్టు ఏర్పాటైంది. కాగా, కేసు విచారణను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని సీబీఐ, ఈడీలను సుప్రీం కోర్టు ఈ నెల12 ఆదేశించింది. అలాగే ఈ కేసుకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను రెండు వారాల్లోగా సమర్పించాలని కేంద్రానికి నివేదించింది.

జునైద్ తండ్రి పిటిషన్‌ను పునఃపరిశీలిస్తాం

సుప్రీం కోర్టు వెల్లడి

న్యూఢిల్లీ: జునైద్ హత్య కేసును సీబీఐతో విచారణ జరిపించాలని అతని తండ్రి దాఖలుచేసిన పిటిషన్‌ను పునఃపరిశీలిస్తామని సుప్రీం కోర్టు సోమవారం తెలిపింది. దీనికి సంబంధించిన సమాధానం ఇవ్వాల్సిందిగా హర్యానా ప్రభుత్వం, సీబీఐని ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పుకు వ్యతిరేకంగా పంజాబ్, హర్యానా హై కోర్టుల్లో జునైద్ తండ్రి వేసిన పిటిషన్‌ను కొట్టివేసిన రెండువారాల తర్వాత సుప్రీం కోర్టు దీనిని తీసుకున్నది. హర్యానా పోలీసుల నుంచి బదిలీ అయిన కేసు సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకనుగుణంగా లేనందున విచారణకు సీబీఐ గతేడాది తిరస్కరించింది.

రామ జన్మభూమిలో మసీదు లేదు

ద్వారకా పీఠాధిపతి వివాదాస్పద వ్యాఖ్యలు

భోపాల్: రామ జన్మభూమి అయిన అయోధ్యలో మసీదు ఎప్పుడూ లేదని ద్వారకా పీఠాధిపతి శంకరాచార్య స్వామి స్వరూపానంద సరస్వతి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 1992లో అయోధ్యలో సంఘ్ కార్యకర్తలు(కర్ సేవక్) కూల్చివేసింది మసీదు కాదని, అది ఒక ఆలయమని చెప్పారు. అయోధ్య వివాదంపై భారత సర్వోన్నత న్యాయస్థానం విధించిన స్టే ఎత్తివేస్తే అక్కడ రామ మందిరాన్ని పునర్ నిర్మించ వచ్చని తెలిపారు. సనాతన ధర్మాన్ని కాపాడటమే తన వృత్తి అని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. రామ జన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంపైప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే.

టార్చ్‌లైట్ల వెలుతురులో ఆ'పరేషాన్'

బీహార్‌లో దారుణం



పాట్నా: విద్యుత్ సదుపాయం లేక, జనరేటర్ సౌకర్యం కరువై టార్చ్‌లైట్ల వెలుతురులో ఆపరేషన్ చేసిన ఘటన బీహార్‌లో సోమవారం కలకలం సృష్టించింది. దీనికి సంబంధించిన ఓ వీడియో బయటకు వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... సహర్స జిల్లాలోని సదర్ ఆస్పత్రిలో ఓ బెడ్‌పై ఓ 'పేషెంట్' అపస్మారక స్థితిలో పడి ఉన్నది. ఆమె చుట్టూ ఐదారుగురు టార్చ్‌లైట్లు వెలిగించి పట్టుకుని నిల్చున్నారు. ఖాకీ దుస్తులు వేసుకున్న ఒక వ్యక్తి(వైద్యుడు) ఆమె చేతికి కుట్లు వేసినట్టు వీడియోలో ఉంది. ఘటనకు సంబంధించి ఆస్పత్రి వర్గాలను సంప్రదించగా స్పందించలేదు. [illegible] టార్చ్‌లైట్ల వెలుతురులో ఆపరేషన్ చేసిన ఘటన ఇటీవల వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో ఉత్తరప్రదేశ్ వైద్యులు టార్చ్‌లైట్ల వెలుతురులో 32 మందికి కంటి ఆపరేషన్ చేశారు.

నాలుగు రోజుల క్రితం తప్పిపోయి...

శవమై తేలిన బాలిక

- యూపీలో దారుణం

లక్నో: నాలుగు రోజుల క్రితం తప్పిపోయిన ఓ బాలిక (6) ఆదివారం రాత్రి చెట్టుకు ఉరి తీయబడి ఉండటం కలకలం రేపింది. ఈ దారుణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మడియాన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మడియాన్‌కు చెందిన బాలిక అదే ఊర్లోని ప్రయివేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతుంది. ఆమె ఈ నెల 15న స్కూల్‌కు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. ఇంటి పక్కనుండే దంపతులే తమ కూతురును అపహరించారని బాధితురాలి తండ్రి అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు ఆమెకోసం వెతుకుతుండగా.. పొరుగింటి వారి సొంత గ్రామంలోని ఇంటికి సమీపంలో ఉన్న చెట్టుకు ఆమె ఉరి తీయబడి ఉంది. ఆమె ఒంటిపై స్కూల్ డ్రెస్ ఉండగా, బెల్టుతో ఉరివేశారు. తమ కూతురును అపహరించిన రోజే ఆమెపై లైంగికదాడికి పాల్పడి ఉరివేశారని ఆమె తండ్రి ఆరోపించారు. నిందితులిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే వెంటనే వారిని వదిలేయడంతో నిందితులతో పోలీసులు కుమ్మక్కయ్యారని బాధితురాలి తండ్రి ఆరోపించారు.

పశుదాణా మరో స్కాములోనూ 'లాలు' దోషి

- తేల్చిన రాంచీ కోర్టు

రాంచీ: జార్ఖండ్ రాజధాని రాంచీలో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం.. ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్‌ను నాలుగో దాణా స్కాంలో దోషిగా తేల్చింది. ఈ కేసు నుంచి ఆ రాష్ట్ర మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రాకి మాత్రం విముక్తి లభించింది. ఈ కేసులో వీరిరువురు కాకుండా మరో 30మంది నిందితులున్నారు. మూడు రోజుల క్రితం ఆరోగ్య సమస్యతో ఆస్పత్రిలో చేరిన లాలు ప్రసాద్ యాదవ్ అక్కడి నుంచి నేరుగా న్యాయస్థానానికి హాజరయ్యారు. లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్ రాష్ట్ర సీఎంగా ఉన్న కాలంలో ఉమ్మడి బీహార్ రాష్ట్రంలోని దుంకా(ప్రస్తుతం జార్ఖండ్‌లో ఉన్నది) ట్రెజరీ నుంచి 3.13 కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగం(నాలుగో దాణా స్కాం) చోటుచేసుకుంది. మొదటి దాణా స్కాంలో 2013లో దోషిగా తేలి ఐదేండ్ల జైలు, రెండో దాణా స్కాంలో 2017 డిసెంబర్ తీర్పులో మూడున్నరేండ్ల జైలు, మూడో దాణా స్కాంలో ఐదేండ్ల జైలు శిక్షను కోర్టు లాలూకు విధించింది. ప్రస్తుతం రాంచీలోని బిర్సాముండా జైలులో 13ఏండ్ల శిక్షను అనుభవిస్తున్న లాలు తాజాగా నాలుగో దాణాస్కాంలోనూ దోషిగా తేలారు.

మోడీ ముక్త్ భారత్‌కు కలిసిరండి

- ప్రతిపక్షాలకు రాజ్‌థాకరే పిలుపు
- మోడీతో ప్రజలు విసిగి పోయారని వ్యాఖ్య

ముంబయి : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఆయన నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన తప్పుడు హామీలతో దేశ ప్రజలు విసుగుచెందారని మహారాష్ట్ర నవ నిర్మాణసేన (ఎంఎన్ఎస్)వ్యవస్థాపకుడు రాజ్ థాకరే వ్యాఖ్యానించారు. ముంబయిలోని శివాజీ పార్కు వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఒక ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని ఓడించి 'మోడి ముక్త్ భారత్(మోడీ లేని భారత్)ను నిర్మించేందుకు ప్రతిపక్షాలన్ని కలిసి రావాలని పిలుపు నిచ్చారు. దాదాపు 75 నిముషాలపాటు సాగిన ఆయన ప్రసంగంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కన్నా మోడీని విమర్శించడానికే ఎక్కువ సమయం తీసుకున్నారు. తన రాష్ట్ర పురోగతిపై దృష్టిపెట్టిన మోడీ వంటి నాయకుడ్ని కలిగి ఉన్న గుజరాత్ ప్రజలు ఎంతో అదృష్టవంతులని వ్యాఖ్యానించారు. ఇప్పుడు నాలుగు సంవత్సరాలు గడిచిపోయిన తరువాత తన తప్పును గ్రహించిన రాజ్ థాకరే మోడీని, బీజేపీని ఓడించేందుకు జరిపే పోరాటంలో ప్రతిపక్షాల ఐక్యతకు పిలుపునిస్తున్నారు.

నిజం మాట్లాడటం తిరుగుబాటే అయితే...

తాను చేస్తున్నది అదే

- ఏడాదిలో చేసింది శూన్యం : యోగి పాలనపై రాజ్‌భర్

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినప్పటికీ, ఉత్సవాలను గొప్పగా జరుపుకోవడానికి, చేసింది చెప్పుకోవడానికి ఏమీ లేదని రాష్ట్రమంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఒక రూపు తీసుకోకపోతే ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని హెచ్చరించారు. మధుర, కాశీలలో ఆలయాలు నిర్మించామని మాట్లాడుకుంటూ ఉత్సవాలు జరపుకోవడం వల్ల ఫలితం లేదన్నారు. నిజం మాట్లాడటం తిరుగుబాటే అయితే, తాను చేస్తున్నది కూడా తిరుగుబాటేనని ఆయన చెప్పారు. రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. సుహల్దేవ్ భారతీయ సమాజ పార్టీ (ఎస్‌బిఎస్‌పి)కి రాజ్‌భర్ నేతృత్వం వహిస్తున్నారు. ప్రభుత్వంలో ఎస్‌బీఎస్‌పీ రెండో భాగస్వామిగా ఉన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో భాగస్వామిగా ఉన్న బీజేపీని బాహాటంగానే విమర్శిస్తున్నారు. రాజ్‌భర్ బీజేపీ కూటమి నుంచి బయటకు రాకపోయినప్పటికీ వార్షికోత్సవ కార్యక్రమానికి మాత్రం హాజరు కాలేదు. ప్రస్తుతం ఈ ప్రభుత్వంలో తాము భాగస్వాములుగా ఉన్నామని, భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చూడాలని అన్నారు.



మంత్రి పీఏనంటూ మోసం

- ఉద్యోగమిప్పిస్తానంటూ రూ.4.5 లక్షలకు టోకరా
- కలెక్టర్‌కు బాధితుడి ఫిర్యాదు

నవతెలంగాణ-సిరిసిల్ల

'నేను మంత్రి పీఏను. రాజన్న ఆలయంలో ఉద్యోగమిప్పిస్తా' అంటూ ఓ వ్యక్తి దగ్గర రూ. 4 లక్షల 50 వేలకు టోకరా వేశాడో ఘనుడు. తీరా డబ్బులు ముట్టాక 'ఉద్యోగం లేదు.. గిద్యోగం లేదు. ఏం చేసుకుంటారో చేసుకో' అంటూ బుకాయించాడు. దిక్కుతోచని స్థితిలో బాధితుడు సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన దూస సత్తయ్య మరమగ్గాల కార్మికుడు. అతని కొడుకు దూస మహేందర్‌కు రాజన్న ఆలయంలో ఉద్యోగమిప్పిస్తానంటూ పట్టణానికి చెందిన మంచికట్ల నవీన్ నమ్మబలికాడు. కొడుకు జీవితం బాగుంటుందని ఆశపడిన సత్తయ్య రూ.4 లక్షల 50 వేలను రెండు దఫాలుగా నవీన్‌కు ఇచ్చాడు. డబ్బులు తీసుకున్న అనంతరం నవీన్ కాలయాపన చేశాడు. దీంతో సత్తయ్య తమ డబ్బులైనా ఇవ్వాలని, ఉద్యోగమైనా ఇప్పించాలని నిలదీశాడు. 'డబ్బుల్లేవ్.. ఏం చేసుకుంటారో చేసుకో' అంటూ బెదిరింపులకు దిగిన నవీన్ తదనంతరం పరారయ్యాడు. మోసపోయానని గ్రహించిన సత్తయ్య సోమవారం 'ప్రజావాణి'ని ఆశ్రయించాడు. నవీన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరాడు.

నేడు ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో కార్టూన్ ఎగ్జిబిషన్

- నవతెలంగాణ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా..

హైదరాబాద్: నవతెలంగాణ తెలుగు దినపత్రిక తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞానకేంద్రం ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో నవతెలంగాణ కార్టూన్ ఎడిటర్ నర్సిం, కార్టూనిస్టు జె వెంకటేష్ ల కార్టూన్ ఎగ్జిబిషన్ ఈ నెల 20వ తేదీ(మంగళవారం) ఉదయం 11.30 కు ప్రముఖ సినీ దర్శకులు శ్రీ బి నరసింగరావు ప్రారంభిస్తారు. సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై తమ వ్యంగ్య చిత్రాలతో పాఠకులను ఆకట్టుకుంటున్న ఈ కార్టూన్ల ప్రదర్శన ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా,అందరినీ ఆహ్వానిస్తున్నట్టు ఎడిటర్ ఎస్.వీరయ్య,చీఫ్ జనరల్ మేనేజర్ పివీ శ్రీనివాస్‌లు తెలిపారు. ప్రదర్శన ఈ నెల 22 వరకు కొనసాగుతుంది. ప్రదర్శన వేళలు మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.

24న బస్సు జాతా షురూ

- సీపీఐ(ఎం) అఖిల భారత 22వ మహాసభలను విజయవంతం చేయండి: జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వచ్చే నెల 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలను పురస్కరించుకుని ఏప్రిల్ 22న జరగనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మహాసభల ప్రచార కమిటీ కన్వీనర్ జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మహాసభల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 24 నుండి రెండు ప్రాంతాల నుంచి బస్సు జాతాలు బయలుదేరి వివిధ జిల్లాల్లో పర్యటించనున్నట్టు తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో మార్చి 24న మొదటి జాతాను పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ జాతా రంగారెడ్డి, నాగర్‌కర్నూలు, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాలను పర్యటిస్తుందన్నారు. ఈ జాతాకు రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్, స్కైలాబ్‌బాబు నాయకత్వం వహిస్తారని తెలిపారు. భువనగిరిలో మార్చి 24న రెండో జాతాను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ జాతా భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జనగాం జిల్లాల్లో పర్యటిస్తోందన్నారు. ఈ జాతాకు రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ, సాంబశివ నాయకత్వం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా జరిగే సభల్లో పార్టీ కేంద్ర నాయకులతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర నాయకులు సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభల ప్రాధాన్యతను వివరిస్తూనే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజలపై మోపుతున్న విపరీతమైన భారాలు, అవినీతి, అవకాశవాద నిరంకుశ ధోరణులను' విస్తృతంగా ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. బస్సు జాతాల్లో పార్టీ కార్యకర్తలు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జూలకంటి విజ్ఞప్తి చేశారు.

దేశానికే ఆదర్శవంతంగా పీపీల నియామకం : కేసీఆర్



నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

దేశానికే ఆదర్శవంతంగా నిలిచేలా రాష్ట్రంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ల నియామకాలు చేపడుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. నేర ప్రవృత్తి ఉన్న వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తుండటంతో నేర ప్రవృత్తిలో పాక్షిక విజయం సాధించామన్నారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ల కొరత ఉన్నది వాస్తవమేననీ, త్వరలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా పారదర్శకంగా పీపీల నియామకం చెపడుతామన్నారు.

భద్రాచలం పట్టణాన్ని మిషన్ భగీరథలో చేర్చాలి - సున్నం రాజయ్య

భద్రాచలం పట్టణంలో తీవ్ర మంచి నీటి ఎద్దడి ఏర్పడిందని సీపీఐ (ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య తెలిపారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నీటి సమస్యను అధికమించడానికి భద్రాచలం పట్టణాన్ని మిషన్ భగీరథలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. జీరో హవర్‌లో మాట్లాడుతూ భూపలపల్లి జిల్లాల్లో మంచి నీటి సమస్య పరిష్కరించేందుకు ట్యాంకర్లద్వారా మంచి నీటిని సరఫరా చేయాలని కోరారు.

కేసీఆర్ కిట్లు విజయవంతం - మంత్రి లక్ష్మారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం విజయవంతమైందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా కేసీఆర్ కిట్‌ల పంపిణీపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేసీఆర్ కిట్ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు గణనీయంగా పెరిగియాని చెప్పారు. ఇప్పటి వరకు 4లక్షలకు పైగా గర్భిణీలకు కిట్‌లు అందజేశామన్నారు. కేసీఆర్ కిట్‌ల పంపిణీకి పూర్తి స్థాయిలో ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ నిధులను వినియోగించామన్నారు. దీనికి కేంద్ర నిధులు ఉపయోగించలేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో రెగ్యులర్ ప్రాతిపదికన సుమారు 10వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామన్నారు.

23 నుంచి ఏఐఎఫ్‌డివై మహాసభలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ నెల 23నుంచి 25 వరకు పంజాబ్‌లోని సంగ్రూర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ఏఐఎఫ్‌డివై) ద్వితీయ మహాసభలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరుకానన్నట్టు తెలిపారు. విప్లవ వీరులు షహీద్ భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల 87వ వర్ధంతి రోజైన మార్చి 23న దేశ నలుమూల నుంచి వచ్చే యువజనులతో భారీ ప్రదర్శన, అనంతరం గొప్ప బహిరంగసభ నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఎస్‌ఐ వాహనానికి సైడ్ ఇవ్వలేదని కొట్టారు

- మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు : ఎస్‌ఐ

నవతెలంగాణ-శాయంపేట

ఎస్‌ఐ ప్రయాణిస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వలేదంటూ యువకుడిని పట్టుకుని లాఠీతో తీవ్రంగా కొట్టినట్టు బాధితుడు సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, సదరు యువకుడు మద్యం మత్తులో వీరంగం సృష్టించి దెబ్బలు తగిలించుకున్నాడని, తామేమీ కొట్టలేదని ఎస్‌ఐ వివరణ ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి... వరంగల్‌రూరల్ జిల్లా శాయంపేట మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన పెంబర్తి భరత్ రాత్రి ద్విచక్రవాహనంపై శాయంపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక వస్తున్న ఎస్‌ఐ వాహనం ముందుకు వెళ్లడానికి హారన్ కొట్టినా భరత్ సైడ్ ఇవ్వలేదు. దాంతో మందారిపేట స్టేజీ వద్ద భరత్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు సమీప గుట్టల్లోకి తీసుకెళ్లి లాఠీలతో కొట్టినట్టు బాధితుడు సోషల్ మీడియాలో బాధను వెల్లగక్కాడు. అయితే, అతను ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. ఈ విషయమై ఎస్‌ఐ రాజబాబును వివరణ కోరగా, అతిగా మద్యం తాగి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై అతి వేగంగా వెళ్లడాన్ని గమనించి మందారిపేట వద్ద అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. తర్వాత పరకాలకు తీసుకెళ్లి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయిస్తుండగా వీరంగం చేశాడని తెలిపారు. ఆ సమయంలోనే అతనికి దెబ్బలు తగిలాయి కానీ, తాము లాఠీలతో కొట్టలేదని చెప్పారు.

సంపాదకీయం

పశ్చాత్తాపం లేని ప్లీనరీ

దేశ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తున్న వేళ ఢిల్లీలో మూడు రోజులపాటు జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలు దేశానికే కాదు ఆ పార్టీకి కూడా దిశానిర్దేశం చేయడంలో విఫలమైనాయి. రాహుల్ గాంధీ కాంగ్రెస్‌కు అధ్యక్షుడయ్యాక ఇది తొలి ప్లీనరీ కావడంవల్లా, వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు, అంతకుముందే రాజస్థాన్, మధ్యప్రదేశ్, తదితర రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ ప్లీనరీకి ప్రాధాన్యత ఏర్పడింది. 2019 సార్వత్రిక ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేయడానికే మార్గ దర్శనం చేసేందుకు, ఉద్దేశించిన భేటీలని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసినందున కూడా దీనికి ప్రాధాన్యత మరింత పెరిగింది.

> **అధికార మార్పిడి తప్ప ఈ రెండింటి వలనా ప్రజలకు ఒనగూరేదేమీ లేదన్నదన్నది స్పష్టం. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా తాము పని చేయనందున ఓడిపోయామంటున్న రాహుల్ సరళీకరణ విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్న నిజాన్ని ఎందుకు స్వీకరించలేకపోతున్నారు?**

ప్లీనరీ వేదికపై సోనియా, రాహుల్ సహా పలువురు సీనియర్ నాయకుల ప్రసంగాల్లో, తీర్మానాల్లో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ తీరాలు దాటాలన్న అభిలాష వ్యక్తమైంది. వివిధ వర్గాల ప్రజలకు పలు హామీలిస్తూ పార్టీ ఎన్నికల ప్రణాళికను ముందస్తుగా ప్లీనరీలో వెల్లడించారు. ఎన్నికల పొత్తులపై సంకేతాలిచ్చారు. కేంద్రంలో బీజేపీ ఏలుబడిలో తిష్టవేసిన పలు వైఫల్యాలను, నిరంకుశ, దురహంకార పోడలను, ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసే ఆర్‌ఎస్‌ఎస్- హిందూత్వ శక్తుల జాతి విచ్ఛిన్నర చర్యలను కాంగ్రెస్ ఖండించింది. ఎన్నికలనాటి హామీలను విస్మరించడమే కాకుండా జీఎస్‌టీ, పెద్దనోట్ల వంటి విధానాలతో ప్రజలకు బీజేపీ మరింత అన్యాయం చేసిందని ఎత్తి చూపింది. అధికార మదం, అధికార మత్తుతో బీజేపీ సర్కారు వ్యవహరిస్తోందని, అధికారం కోసం ఎందాకైనా వెళ తోందని విమర్శించింది. వ్యవస్థలపై దాడి చేస్తోందని, రాజ్యాంగ విలువలను కాలరాస్తోందని కాంగ్రెస్ ఆవేదన చెందింది. ఎన్‌డీఏ ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి, స్కాంలపై నిప్పులు చెరిగింది. దేశంలో యువత ఉద్యోగాల కోసం అలమటిస్తున్నారని, రైతులు గిట్టుబాటు ధరల కోసం నిరీక్షిస్తున్నారని ఆందోళన చెందింది. మోడీ పాలనతో విసుగెత్తిన దేశం ఇప్పుడు ఆ పాలన నుంచి విముక్తి చెందే మార్గం కోసం ఎదురు చూస్తోందని చెప్పింది.



కానీ యావత్ కాంగ్రెస్ ప్లీనరీలో ఎక్కడా పదేండ్ల యూపీఏ పాలనలో అనుసరించిన సరళీకరణ, నయా-ఉదారవాద ఆర్థిక విధానాలపై కించిత్తు ఆత్మవిమర్శకానీ, పశ్చాత్తాపం కానీ కానరాలేదు. పైగా తాము అమలు చేసిన ఆ ప్రజా కంటక, వినాశకర విధానాలను ఇంకా 'మంచి'గా అమలు చేయాలని కోరుతోంది. మన దేశంలో సరళీకరణ విధానాలకు ఆద్యుడు మన్మోహన్‌సింగ్. పీవీ హయాంలో ఆర్థిక మంత్రిగా సరళీకరణ విధానాలను తీసుకొచ్చారు. వాటి వలన ప్రజలకు జరిగిన దుష్పరిణామాలపై ప్రతిపక్ష హోదాలో గొంతు చించుకున్న బీజేపీ, వాజ్‌పేయి ప్రభుత్వంలో ఆ విధానాలనే అమలు చేసింది. వాజ్‌పేయి విధానాలపై నానాయాగీ చేసిన కాంగ్రెస్ తాను అధికారంలోకి వచ్చి పదేండ్లపాటు వాటినే పరుగులు పెట్టించింది. కాంగ్రెస్ విధానాలను తూలనాడిన మోడీ, తాను గద్దెనెక్కగానే కాంగ్రెస్‌కంటే దూకుడుగా అవే విధానాలను పదును పెడుతున్నారు. రెండున్నర దశాబ్దాల రాజకీయాలను పరిశీలిస్తే కాంగ్రెస్, బీజేపీ రెండూ పాలకవర్గాల తరపున ప్రజలను కాల్చుకుతినే విధానాలను అమలు పరిచాయని, వాటితో తెగతెంపులు చేసుకోడానికి అవి ఎంతమాత్రం సిద్ధపడట్లేదన్న నిజం బోధ పడుతుంది. అధికార మార్పిడి తప్ప ఈ రెండింటి వలనా ప్రజలకు ఒనగూరేదేమీ లేదన్నదన్నది స్పష్టం. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా తాము పని చేయనందున ఓడిపోయామంటున్న రాహుల్ సరళీకరణ విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్న నిజాన్ని ఎందుకు స్వీకరించలేకపోతున్నారు?

దేశంలో మతతత్వానికి కొమ్ములు రావడానికి కాంగ్రెస్ విధానాలే కారణం. కాంగ్రెస్ అనుసరించిన సరళీకరణ విధానాలతో ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తిని ఉపయోగిం చుకుని బీజేపీ అధికారంలోకి వచ్చింది. పదేండ్ల యూపీఏ ప్రభుత్వం అనుసరించిన సరళీకరణ, ఆశ్రిత పెట్టుబడిదారీ, అవినీతికర విధానాలు ప్రజలను కాల్చుకుతిన్నాయి. ప్రజల్లోని ఈ అసంతృప్తిని మోడీ నాయకత్వంలోని బీజేపీ బాగా ఉపయోగించుకుని అధికార పగ్గాలు చేపట్టింది. అయితే ప్రస్తుతం పెనం మీదనుంచి పొయ్యిలో పడ్డట్టు తయారైంది జనం పరిస్థితి. 150 ఏండ్ల చరిత్ర కలిగిన తమ పార్టీకి దాని విధానాలే కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశాయన్న సత్యాన్ని కాంగ్రెస్ అంగీకరించడానికి సిద్ధపడట్లేదు. తాము అధికారంలోకొస్తే రైతులకు రుణమాఫీ, ఆహారశుద్ధి సముదాయాలు యువతకు ఉద్యోగాలంటూ గతంలో బీజేపీ చెప్పినట్టే కాంగ్రెస్ హామీలిచ్చింది. ఎన్నికల్లో ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ల పునరుద్ధరణ, లోక్‌పాల్ నియామకం, ఏక ఎన్నికలపై వ్యతిరేకత, న్యాయవ్యవస్థకు సంస్కరణలు, ఏపీకి ప్రత్యేక హోదా వంటి తీర్మానాలు మంచివే. కాగా మోడీది క్రూర పాలన అంటున్న రాహుల్, ఆ విధానాలను మార్చుకోకుండా పైపై విమర్శలు, ఆరోపణల ఆధారంగా ఈ దేశానికి కాంగ్రెసే ప్రత్యామ్నాయం అనడం హాస్యాస్పదం.

సాంకేతిక పరివర్తన- దారిద్రీకరణ



ప్రభాత్ పట్నాయక్


సాంకేతిక పరివర్తన సామాజిక ఆర్థిక ప్రభావం ఆస్తి సంబంధాలపై ఆధారపడి ఉంటుంది. ఈ సంబంధాల చట్రంలోనే అటువంటి మార్పు జరుగుతుందనేది స్పష్టం అయినప్పటికీ ఈ అంశాన్ని చాలామంది గుర్తించరు. ఒక చిన్న ఉదాహరణ తీసుకుందాం. ఒకానొక ప్రాంతంలో వందమంది కార్మికులు రూ5,000కు పంట కోస్తున్నారని అనుకుందాం. అలా కార్మికులతో పంట కోయించటానికి బదులుగా పెట్టుబడి దారైన భూస్వామి కోత మిషన్ని ఉపయోగించాలని నిర్ణయించాడు. దీనివల్ల సదరు వ్యవసాయ కార్మికుల ఆదాయంలో 5,000 తగ్గిపోతుంది. భూస్వామి చెల్లించాల్సిన వేతనం రూ.5000 తగ్గుతుంది. అది అతని లాభానికి అదనంగా చేరుతుంది. అలా కాకుండా కార్మికులంతా సమిష్టిగా కోత మిషన్‌కు యజమానులుగా ఉన్నారని కొద్దిసేపు అనుకుందాం. అటువంటి స్థితిలో కూడా కార్మికుల ఆదాయం 5000గానే ఉంటుంది. అయితే వారి హోదా కార్మికులుగా కాక కోత మిషన్ సమిష్టి యజమానులుగా ఉంటుంది. వారు ఏ వేతన ఆదాయాన్నైతే కోల్పోతారో అదే ఆదాయాన్ని కోత మిషన్‌పై వచ్చే లాభం రూపంలో తిరిగి పొందుతారు. వారి మొత్తం ఆదాయం మారనప్పటికీ వారి విరామ సమయం పెరుగుతుంది. వారి పనిభారం తగ్గుతుంది.

> **ఈ పరిమితులన్నింటినీ తొలగించి పెట్టుబడిదారీ వ్యవస్థలోని సాంకేతిక పరివర్తనకు చెందిన విషయం సహా 'యాధృచ్ఛికత'ను పునఃప్రతిష్ట చేసింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో జరిగే సాంకేతిక పరివర్తన కారణంగా నిరుద్యోగ సైన్యం పరిమాణం పెరగటంతో పాటు దారిద్ర్యం కూడా పెరుగుతుంది.**

ఈ రెండు ఉదాహరణలలోను సజీవ శ్రమ(లివింగ్ లేబర్)ను కోత మిషన్ స్థానభ్రంశం చేస్తుంది. అయితే కోత మిషన్ యజమాని ఎవరనే దానిపై దానిని ఉపయోగించటంలో గల సామాజిక-ఆర్థిక అంతఃస్సూచికలుంటాయి. అటువంటి సాంకేతిక పరివర్తన కారణంగా సజీవ శ్రమ స్థానాన్ని మృతశ్రమ (డెడ్ లేబర్) ఆక్రమిస్తుంది. ఇది పెట్టుబడిదారీ భూస్వామి నేతృత్వంలో జరిగినప్పుడు కార్మికులలో దారిద్ర్యం పెరుగుతుంది. అయితే 'పనిని పంచుకోవటం, ఉత్పత్తిని పంచుకోవటం' అనే నీతి ఆధారంగా కార్మికుల సమిష్టి యాజమాన్యంలో కోతమిషన్ ఉన్నట్టయితే వారి ఆదాయంలో మార్పులేకుండా కార్మికులకు గొడ్డుచాకిరీ చేయవలసిన అవసరం నుంచి విముక్తి లభిస్తుంది. ఈ ఉదాహరణ సూక్ష్మ ఆర్థిక శాస్త్రానికి సంబంధించినది. దీనిని స్థూల ఆర్థిక శాస్త్రానికి అన్వయించినప్పుడు పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో జరిగే సాంకేతిక పరివర్తనను 'పనిని పంచుకోవటం, ఉత్పత్తిని పంచుకోవటం' అనే నియమం ఆధారంగా వుండే సోషలిస్టు వ్యవస్థలో జరిగే సాంకేతిక పరివర్తనను పోల్చినప్పుడు ఈ రెండింటి మధ్య తేడా తీవ్రంగా ఉంటుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒకానొక సాంకేతిక పరివర్తన కారణంగా శ్రామిక ఉత్పాదకత రెండు రెట్లు పెరిగిందని అనుకుందాం. వంద యూనిట్ల వస్తువులను ఉత్పత్తి చేయటానికి వంద మంది కార్మికులను నియమించారు. వీటిలో యాభై యూనిట్లు కార్మికులకు వేతనంగాను, మిగిలిన యాభై యూనిట్లు పెట్టుబడిదారులకు లాభాలుగా మారతాయి. ఇప్పుడు అవే వంద యూనిట్ల వస్తువులు ఉత్పత్తి చేయటానికి యాభై మంది కార్మికులు మాత్రమే అవసరమవుతారు. మిగిలిన యాభైమంది కార్మికులు నిరుద్యోగులవుతారు. ఈ నిరుద్యోగం కారణంగా ఉత్పాదకత పెరిగినప్పటికీ ఉద్యోగులుగా కొనసాగుతున్న కార్మికుల వాస్తవ వేతనం పెరిగే అవకాశం లేకపోవచ్చు. నిజానికి ఏదైనా జరిగితే వేతనం పడిపోవటమే అవుతుంది. విషయాన్ని తేలికగా ఉంచటం కోసం వేతనంలో ఎటువంటి మార్పూ లేదని అనుకుందాం. కాబట్టి శ్రామిక ఉత్పాదకత రెండు రెట్లయినప్పుడు పెట్టుబడి దారుకు లభించే మిగులు రూ.50 నుంచి 75కి పెరిగితే గతంలో 50గా వున్న వేతన వ్యయం 25కు తగ్గింది. ఈ 'వేతనాల నుంచి లాభాలకు మారటం'వల్ల సమిష్టి డిమాండ్ సమస్య సృష్టించబడుతుంది (ఎందుకంటే లాభాలకంటే వేతనాల వాటా ఖర్చుకావటమే యిందుకు కారణం). దానితో మిగులు ఉత్పత్తి అయిన 75 అంతా చేతికి రాకపోవచ్చు. అలాంటి పరిస్థితిలో 'అధిక ఉత్పత్తి' సంక్షోభం ఏర్పడుతుంది. ఇక ఏ మాత్రం వంద వస్తువులు కూడా ఉత్పత్తి కాకపోవచ్చు. కాబట్టి దానితో నిరుద్యోగం మరింతగా పెరుగుతుంది. సాంకేతిక పరివర్తన కారణంగా యాభై కంటే అదనంగా నిరుద్యోగం ఏర్పడుతుంది.

ఇందుకు భిన్నంగా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో వ్యక్తులు నిరుద్యోగులుగా ఉండే ప్రశ్నే తలెత్తదు. శ్రామిక ఉత్పాదకత రెండు రెట్లయినప్పుడు ఉద్యోగిత అంతకు ముందటి వంద కొనసాగుతుండగా వస్తూత్పత్తి రెండొందలు అవుతుంది. దానితో ప్రతి కార్మికుడి ఆదాయం రెండు రెట్లవుతుంది(ఇలా జరగటానికి కొంత కాలం పడుతుంది. ఆ కాలంలో యంత్ర పరికరాలు రెండు రెట్లు కావలసి ఉంటుంది). అలాకాకుండా ఒక్కో కార్మికుడి శ్రమను సగానికి తగ్గించి ఉత్పత్తిని వందకే పరిమితం చేయొచ్చు. అలా జరిగినప్పుడు అదే ఆదాయంతో కార్మికుడికి విరామ సమయం పెరుగుతుంది. అలా కాకుండా ఈ రెండింటినీ సమన్వయం చేయొచ్చు. అంటే కార్మికులకు ఎక్కువ ఆదాయం, ఎక్కువ విరామ సమయం అందేలా చేయొచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థలో సాంకేతిక పరివర్తన కారణంగా నిరపేక్ష దారిద్ర్యం ఏర్పడుతుంది. దీనికి కారణం కార్మికుల ఆదాయం మొత్తంమీద 50నుంచి 25కి, అంతకు పైగా తగ్గిపోవటమే. అదే సోషలిస్టు వ్యవస్థలో సాంకేతిక పరి వర్తన ఏర్పడినప్పుడు కార్మికుల పరిస్థితి మెరుగుపడుతుంది. రెండు వ్యవస్థలు పనిచేసే తర్కంవల్లనే ఇలా జరుగుతుంది. అంతేగానీ ఒక వ్యవస్థకు వ్యతిరేకంగా మరొక వ్యవస్థకు గల ద్వేషంవల్ల కాదు. ఉత్పత్తి ప్రక్రియలలో ప్రవేశిస్తున్న ఆటోమేషన్ కారణంగా నిరుద్యోగం ప్రబలుతున్నదని ఈ మధ్యకాలంలో చాలామంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ చట్రంలో అలా ఆందోళన చెందటం న్యాయమే. కానీ సోషలిస్టు వ్యవస్థలో అలాంటి ఆందోళన అవసరం లేదు. నిజానికి మానవాళి సోషలిజాన్ని ఆశ్రయించాల్సిన ప్రధాన అవసరాలలో ఆటోమేషన్ కూడా ఒకటి. ఒకవేళ ఆటోమేషన్‌తో ఏర్పడే దుష్ప్రభావాలను అధిగ మించాలంటే సోషలిజాన్ని ఆశ్రయించటం తప్ప మరో మార్గం లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ తర్కంలోనే శ్రమను స్థాన భ్రంశం చేసే సాంకేతిక పరివర్తన ఉన్నది. ఈ వ్యవస్థ నిరుద్యోగాన్ని పెంచటమే కాకుండా కార్మికులలో దారిద్ర్యాన్ని పెంపొందిస్తుంది. అంతేకాకుండా అటువంటి సాంకేతిక పరివర్తన వేగాన్ని నియం త్రించటం సాధ్యపడదు. మార్కెట్‌లో పెట్టుబడుల మధ్యగల పోటీ దానిని నిర్దేశిస్తుంది. మన ఆర్థిక వ్యవస్థకు దీనితో చాలా ముఖ్యమైన అంతఃస్సూచిక లున్నాయి. ప్రపంచ మార్కెట్‌లో పోటీ తట్టుకోవటానికి దేశంలో శ్రామిక ఉత్పాదకత పెరగాలని రాజకీయ నాయకులు సూచించటాన్ని మనం వింటూవుంటాం.



నయా వుదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ విదేశీ పోటీకి ఆలవాలంగా ఉంటుంది. పోటీ తట్టుకోలేకపోతే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. కాబట్టి ఆ మేరకు వారు చెప్పేది నిజమే. అయితే వారు చెప్పని విషయం ఏమంటే ఒక ఉత్పత్తి పెరుగుదల రేటులో శ్రామిక ఉత్పాదకత రేటు ఎంత వేగంగా ఉంటే అంతగా ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగం, దారిద్ర్యం పెరుగుతాయి. ఒకవేళ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 8శాతం ఉందని అనుకుంటే అప్పుడు శ్రామిక ఉత్పాదకత పెరుగుదల రేటు 7శాతం ఉంటే దానితో ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగిత వార్షికంగా 1శాతం పెరుగుతుంది. అదే శ్రామిక ఉత్పాదకత పెరుగుదల రేటు 5శాతం ఉంటే ఉపాధి వార్షికంగా 3శాతం పెరుగుతుంది. ఒకవేళ శ్రామిక ఉత్పాదకత వేగంగా పెరిగితే దానితోపాటు ఉత్పత్తి పెరుగుదల రేటు పెరుగుతుంది కాబట్టి ఉపాధి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అనుకుంటారు. అయితే ఉత్పత్తి పెరుగుదల రేటుకు పరిమితులున్నాయి. ముఖ్యంగా ఒక స్వేచ్ఛా ఆర్థిక వ్యవస్థ గతిశీలత(డైనమిజం) నికర ఎగుమతులపై ఆధారపడి ఉంటుంది. అలా జరగటానికి కారణం ఏమంటే మిగిలిన దేశాలు తమ మార్కెట్లను వేగంగా పెరుగుతున్న ఒక ఆర్థిక వ్యవస్థ ఆక్రమించుకుంటుంటే చేతులు ముడుచుకుని కూర్చోవు. అలాంటి దేశం ఎగుమతులను పరిమితం చేసేందుకు ఇతర దేశాలు అనేకవిధాల ప్రయత్నిస్తాయి. కాబట్టి అలా పరిమితమైన ఎగుమతుల వల్ల మొత్తం మీద వృద్ధి మందగిస్తుంది. ఒకవేళ ఉత్పత్తి వృద్ధి రేటు అలా ఎక్కువగా ఉన్నప్పటికీ ఈ వృద్ధి రేటు నిర్ణీత పరిమితులలో ఉండాల్సిన అవసరముంటుంది. నయావుదారవాద ప్రపంచ మార్కెట్‌లో పోటీ వల్ల శ్రామిక ఉత్పాదకత చాలా ఎక్కువగా వృద్ధి చెందుతుంది. నిరుద్యోగం, దారిద్ర్యం పెరగటాన్ని అరికట్టజాలనంతగా శ్రామిక ఉత్పాదకత పెరుగుదల వల్ల ఏర్పడే ఉద్యోగిత వృద్ధిరేటు ఉంటుంది.

ఈ సందర్భంగా నయావుదారవాద కాలంలోని భారత ఆర్థిక వ్యవస్థను అంతకుముందున్న సంక్షేమ రాజ్యకాలంతో పోల్చటం చాలా ఉపయోగం. ఈ కాలంలో వృద్ధిరేటు వార్షికంగా స్థూల జాతీయోత్పత్తి 7శాతం పెరుగుతుండగా ఉపాధి కేవలం 1శాతం మాత్రమే పెరుగుతున్నది. అదే సంక్షేమరాజ్య పాలనాకాలంలో స్థూల జాతీయోత్పత్తి వార్షిక పెరుగుదల రేటు నయావుదారవాద పాలనలో కంటే సగమే అంటే 3.5శాతం మాత్రమే ఉంది. అయితే ఉపాధి పెరుగుదల రేటు వార్షికంగా రెండురెట్లు అంటే 2శాతం ఉన్నది.

నయావుదారవాద పాలనలో ఉపాధి వృద్ధి రేటు కార్మికుల సహజ వృద్ధిరేటు కంటే కూడా తక్కువ. మనం నయావుదారవాద పాలన 'ఆదిమ మూలధన సంచయ' ప్రక్రియను వేగవంతం చేయటం వల్ల నిస్పృహతో గ్రామీణ ప్రాంతం నుంచి స్థానభ్రంశం చెంది సంప్రదాయేతర రంగాలలో పనిపాటలను వెతుక్కునే రైతులను, చిన్న ఉత్పత్తిదారులను కలిపినప్పుడు ఉపాధి వృద్ధిరేటు కార్మికుల సహజ వృద్ధిరేటు కంటే నిస్సందేహంగా చాలా తక్కువగా ఉంటుంది. నయావుదారవాద పాలనలో లేబర్ మార్కెట్‌లో శ్రామికుల కొరత ఏర్పడక పోగా అందుకు పూర్తిగా వ్యతిరేక పరిస్థితి ఏర్పడటం ఆశ్చర్యం కలిగించదు. శ్రామిక రిజర్వ్ సైన్యం పరిమాణం సాపేక్షంగా బాగా విస్తృతమవటంతో నిరుద్యోగులుగా ఉన్నవారి జీవితాలు దుర్భరంగా తయారయ్యాయి. ఈ నిరుద్యోగ సైన్యం తీవ్రంగా ఉండటంతో ఉద్యోగులుగా ఉన్నవారికి బేరమాడే శక్తి బలహీనపడి వారి జీవితాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. నయావుదారవాద శకంలో అనుసరించిన విధానాల ఫలితంగా ఆదాయ, సంపద అసమానతలు విపరీతంగా పెరిగాయనేది కాదనలేని వాస్తవం. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని అంగీకరించక పోయినప్పటికీ దీనితో దారిద్ర్యం నిరపేక్షంగా పెరుగుతున్నది. పోషకాహార వినిమయం ఆధారంగా పేదరికానికి ప్రభుత్వమిస్తున్న నిర్వచనం ఆధారంగా చూసినా దారిద్ర్యం నిరపేక్షంగా పెరుగుతున్నదనటంలో ఏమాత్రం సందేహం లేదు.

నయావుదారవాద కాలానికి, సంక్షేమ రాజ్య కాలానికి మధ్య తేడాకు కారణం ఏమంటే సంక్షేమ రాజ్య కాలంలో సాంకేతికతతో కూడిన నిర్మాణ సంబంధిత పరివర్తనపై కొన్ని పరిమితులుండేవి. అలాగే రైతులు నష్టపోయే ధరల పతనం పరిమాణంపై కూడా పరిమితులుండేవి. అలాంటి పరిమితులు లేనందునే నేటి రైతాంగం అప్పులపాలై పేదరికంలో మగ్గుతున్నది. ఇందుకు ఉదాహరణగా చేనేతను రిజర్వ్ చేయటాన్ని చెప్పుకోవచ్చు. అలానే దిగుమతులపై పన్నులను విధించటం ద్వారా, వాణిజ్యంపై పరిమాణాత్మక పరిమితులు విధించటం ద్వారా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాచే ఆహార ధాన్యాలను సేకరించటం ద్వారా, వాణిజ్య పంటలకు సంబంధి అనేక బోర్డులు జోక్యం చేసుకోవటం వల్ల ప్రపంచ మార్కెట్‌లో సంభవించే ఒడిదుడుకులకు దేశీయ వ్యవసాయోత్పత్తుల ధరలు లోనుకాకుండా చూసేది. నయావుదారవాదం ఈ పరిమితులన్నింటినీ తొలగించి పెట్టుబడిదారీ వ్యవస్థలోని సాంకేతిక పరివర్తనకు చెందిన విషయం సహా 'యాధృచ్ఛికత'ను పునఃప్రతిష్ట చేసింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో జరిగే సాంకేతిక పరివర్తన కారణంగా నిరుద్యోగ సైన్యం పరిమాణం పెరగటంతో పాటు దారిద్ర్యం కూడా పెరుగుతుంది.

గిరిజనులకు పోరాట స్ఫూర్తి థానూ




ఎం. ధర్మనాయక్

భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన, యావత్తు భారతదేశానికే ఆదర్శంగా నిలిచిన మహత్తర వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నేలకొరిగిన లంబాడీ ముద్దుబిడ్డ థానూనాయక్. ఆంధ్ర రాష్ట్రంలో, తెలంగాణ ప్రాంతం, జమీందారు, దేశ్‌ముఖ్‌ల ప్రజావ్యతిరేక భూస్వామ్య పాలన కొనసాగుతున్న రోజులవి. వెట్టిచాకిరీ, దోపిడీ, నిర్బంధాలకు ప్రజలు బిక్కుబిక్కుమంటున్న కాలం. నైజాం పాలన కొనసాగుతున్నది. ఏ ఫర్మానాలు జారీ చేసినా సబ్బండ ప్రజలు వణికిపోయేవారు. దాడి చేయడం, ప్రజల ఆస్తులను దోచుకోవడం, వెట్టి చేయించడం అప్పుడు సర్వసాధారణం. 1940 - 51 సంవత్సరం వరకు భూస్వాముల ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర మహాసభలను ఏర్పాటు చేసి కార్యకర్తలను చైతన్యం చేస్తూ ఆందోళన కొనసాగించింది. గుత్ప, వడిసేల సంఘాలు ఏర్పడ్డాయి. తెలంగాణ ప్రాంతమంతా పోరు రాజుకుంది. నాలుగు వేల మంది కార్యకర్తలు అమరులయ్యారు. ఈ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ ఆయా గ్రామాల్లో ప్రజలకు 10 వేల ఎకరాల భూమి పంచింది. ప్రజలకు ప్రాథమికంగా కొంత చదువు నేర్పించారు. నీతి, నియమాలతో కట్టుబడి సంఘం తరపున ప్రజలు నిలబడ్డారు.

పల్లె పల్లెలో ప్రజలకు ఎదురుతిరిగి పోరు చేయడం నేర్పింది సంఘం. జోనల్ దళ సభ్యులుగా పనిచేస్తున్న మల్కాపురం గ్రామం, హుజూర్‌నగర్ లంబాడీ బాషా, భూక్యా బాల్య, జానపాడు తండా దేవుల, సోమ్యా గౌరెల్లి గ్రామంలో ఇబ్రహీంపట్నం దళంలో ఉన్నారనీ, కరపత్రాలు పోలీస్ స్టేషన్‌లో వేశారనీ 1950 మార్చి 2న చంపేశారు. వీరి పోరాట స్ఫూర్తితో జటోత్ హామూ మంగ్లీ కుమారులు ఆరుగురు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కార్యకర్తలుగా పనిచేయడం ప్రారంభించారు. ఝాటోత్ జోద్యను 1947 భువనగిరి తాలుకా పల్లెర్లలో పట్టుకొని చిత్రహింసలు పెట్టి జైలు పాలు చేశారు. భార్య పూలీబాయి అదే స్ఫూర్తితో మహిళా సంఘం బాధ్యతలు తీసుకుంది. ఆ పోరులో మల్లు స్వరాజ్యం కూడా నెలరోజులపాటు ధర్మాపురం తండాలోనే ఉన్నారు. పూలీబాయి ఎక్కడ అన్యాయం జరిగినా కొంగు నడుముకు చుట్టి వాలిపోయేది. ఝాటోత్ సోమ్లను నైజాం రజాకార్లు పట్టుకొని సజీవంగా కాల్చి చంపారు. ఎనిమిది మందిని ఒకేసారి ఆ చితిలో కాల్చేశారు. అప్పుడు దళ కమాండర్‌గా ఉన్న థానూనాయక్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. తిరిగి వచ్చి మళ్లీ దళంలో చేరాడు. సొంత భూమి 40 ఎకరాలను ఆక్రమించుకునేందుకు భూస్వాములు ఇబ్బందులు పెట్టారు. నైజాం మూకలూ, బాబుదొర అతి క్రూరంగా గ్రామాలను తగలపెట్టారు. దీనితో రగిలిపోయిన థానూనాయక్ బాబుదొరను మట్టుపెట్టాడు. ఈ ప్రతిఘటనతో గ్రామగ్రామాల్లో ప్రజలు చైతన్యమయ్యారు. ఝాటోత్ దర్యా నాయక్ సారా, కల్లు బందు పెట్టాలని పిలుపు ఇచ్చినవారిలో ఉన్నాడు. 15 ఏండ్ల వయస్సులోనే దళంలో చేరాడు. ఎనిమిదేండ్లు జైలు జీవితం అనుభవించాడు. అప్పుడు భార్య ధానీ పంటపొలం చూసుకుంటూ కుటుంబాన్ని పోషించేది. తండాపై ఎవరు దాడి చేసినా నిలదీసిన వనిత ధానీబాయి. సంఘంలో పనిచేశారు. జాటోత్ హాము కుటుంబం గొప్ప చరిత్ర కలిగినది. మొత్తం ఈ పోరాటంలో ఆ కుటుంబం ఎక్కడా అదరలేదు, బెదరలేదు. జగన్మోహన్‌రెడ్డి గుండెల్లో నిద్రపోయింది ఆ లంబాడీ కుటుంబం. దాంతో వేలాది మంది ప్రజలు థానూ నాయక్ కుటుంబానికి మద్దతు పలికారు.

> **థానూనాయక్ ధైర్యశాలి. దృఢ దీక్ష కలవాడు. ప్రజలంటే అమితమైన ప్రేమ ఉండేది. భూస్వాముల దుర్మార్గాలను సహించేవాడు కాదు. థానూ నాయక్ చిరస్మరనీయుడు.**

అప్పటి నల్లగొండ జిల్లా జనగామ తాలుకా దేవురుప్పుల మండలం ధర్మపురం గ్రామం జమీందారు పుసుకురు రాఘవరావు 80 ఎకరాల మెట్టభూమి 25 ఎకరాల మాగాణి భూమిని లంబాడీలు సాగుచేసుకొని జీవిస్తున్నారు. ఆ భూమిని ఆక్రమించుకోవాలని దొరలు పంట ధ్వంసం చేశారు. నిజాం నవాబు గూండాలను పంపించి ధాన్యం దోచుకుపోయారు. లంబాడీ గిరిజనులు భూముల్లో ఎర్రజెండాలు పాతి వడిసేలను చేతపట్టి సంఘం అండతో ఆ గూండాలను తరిమి కొట్టారు. తిరిగి తమ పొలం దున్నుకున్నారు. గ్రామాల మీద భూస్వాములకు పెత్తనం ఉండేది. వారు తండాలను భయభ్రాంతులకు గురిచేసి దాడి చేశారు. ఈ క్రమంలో ముంద్రాయి గ్రామంలో లంబాడీలు ఏకమై బంజరు భూములను సాగు చేసుకున్నారు.



కాడారి నర్సింహారావు అనే భూస్వామి ఆ భూమిని తనపేర పట్టా చేయించుకున్నాడు. లంబాడీలు తమ భూమి తమకే దక్కాలని పోరాటం చేయగా, వారికి మద్దతుగా బయటి 10 గ్రామాలు రావాలని సంఘం పిలుపునిచ్చింది. మూడు వేల మంది ప్రజలు వడిసేలు, కట్టెలతో తరలివచ్చారు. ధర్మపురం పోరాట స్ఫూర్తితో భూస్వాములు తెలివి ప్రదర్శించి 75 మంది సాయుధ రిజర్వ్ పోలీసులను తీసుకొచ్చారు. అక్కడ మకాం పెట్టారు. పరిసర గ్రామాల భూస్వాములంతా పోగయ్యారు. వారితోపాటు కడారి నర్సింహారావు రైఫిల్ చేతబూని గుర్రంపై సవారీ చేసుకుంటూ రంగంలోకి దిగాడు. భూస్వాములూ సాయుధ పోలీసులూ ఒక వైపు, కర్రలూ జెండాలూ పట్టుకొని ప్రజలు మరోవైపు కవాతు చేశారు. ప్రజా సమూహం ఎదురు నిలిచేసరికి భూస్వాములు దడిసి పారిపోయారు. రైతువారి మెట్ట ప్రాంతం భూమి, బంజరు భూమి, నీళ్ళు ఉన్న భూమి, ముఠావారి అడవుల్లో ఉన్న భూమి, మిగులు భూములు ఉండేవి. పేదలు ఎక్కడ భూములు సాగుచేసినా స్వాధీనం చేసుకునేవారు భూస్వాములు. పంట పొలంలోనే రూపాయికి నాలుగు బస్తాల ధాన్యాన్ని దౌర్జన్యంగా లాక్కుపోయేవారు. వెట్టి చేయించి చిత్రహింసలు పెట్టేవారు. నగదు ఇచ్చే వారు కాదు. కోదాడ నుంచి నైజాం బలగాలు బయలుదేరినవంటే ఆ ప్రాంతమంతా గజగజా వణికిపోయేది. 30 వేలమంది రజాకార్ల సైన్యం ఉండేది. దీనికి కాశీంరజ్వీ నాయకత్వం వహించేవాడు. భూస్వాములు వంత పాడేవారు. పోలీసు అధికారి గురుదాయత్ సింగ్ల రైఫిళ్ళను ప్రజలపైకి ఎక్కుపెట్టాల్సిందిగా పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. అప్పుడే 20 మంది సంఘం నాయకుల్ని అరెస్టు చేశారు. వాళ్లలో లంబాడీలూ ఉన్నారు. చేతులకు బేడీలు వేసి గ్రామాల్లోంచి గ్రామాలకు వారిని ప్రదర్శించేవాళ్లు. సంఘం మాట వింటే మీకు ఇదే గతి పడుతుందని హెచ్చరించేవాళ్లు భూస్వాములు. 1944లో రాఘవరావు, విసునూరు దేశ్‌ముఖ్‌లను రాంచంద్రారెడ్డి సహాయంతో లంబాడీలు భారీసంఖ్యలో పోగై భూస్వామ్య గూండాలను తరిమికొట్టి విజయం సాధించారు.

థానూనాయక్ ధైర్యశాలి. దృఢ దీక్ష కలవాడు. ప్రజలంటే అమితమైన ప్రేమ ఉండేది. భూస్వాముల దుర్మార్గాలను సహించేవాడు కాదు. నైజాం సైన్యం దేశ్‌ముఖ్‌ల భూస్వాములు వలవేసి థానూనాయక్‌ను పట్టుకొన్నారు. అతన్ని ఎడ్లబండి చక్రాలకు కట్టి నడిపిస్తూ 1950 మార్చి 20న ముంద్రాయి గ్రామ సమీపంలో చిత్రహింసలు పెట్టారు. తనను కాల్చేస్తుంటే ఎర్రజెండా అజేయం.. అంటూ నెత్తుటి నేలపై ఒరిగిన వీరుడు థానూనాయక్ చిరస్మరణీయుడు.

సెల్ : 9490098685

మూఢనమ్మకాలకు జవాబు న్యూటన్

ఏవీకే

"పైకి విసిరింది కిందపడును అని తెలిపే గ్రావిటేషన్ పైన కింద తలకిందులవుతది ఇన్‌ఫాచ్యుయేషన్" అని గేయ రచయిత చంద్రబోస్ పాటలాగా ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ వ్యాఖ్యలు. వారంతా మత ఇన్‌ఫాచ్యుయేషన్‌లో పడినట్టు అర్థమవుతోంది. సైన్స్‌కు విరుద్ధమైన వారి మాటలు వింటుంటే. అయితే కాషాయంబరులది ఆకర్షణ కాదు, కుట్రే. అటువంటి ఆకర్షణలోకి జనాన్ని నెట్టి మత విద్వేషం నింపడమే వారి ఎజెండా. యువత ఆకర్షణలో పడితే ఏదైనా సాధించేందుకు కృషి చేస్తారు. కానీ బీజేపీ మంత్రులు ఇందుకు పూర్తి విరుద్ధం. వారు దేశ పురోభివృద్ధికి ఉపయోగపడే సైన్స్, శాస్త్రవేత్తలను, వారి సూత్రాలను సర్వనాశనం చేసే పనిలో పడ్డారు.

ఈ మధ్య కేంద్ర మానవ వనరుల సహాయ మంత్రి సత్యపాల్‌సింగ్ "డార్విన్ సిద్ధాంతం తప్పని, కోతి నుంచి మానవుడు వచ్చినట్టు తమ పూర్వీకులు చెప్పలేదని, పాఠశాల లు, కాలేజీ పాఠ్యాంశాలను తొలగించాలని" వ్యాఖ్యానించారు. ఆయనే మళ్లీ న్యూటన్ "చలన సిద్ధాంతాన్ని" కనిపెట్టకముందే మన దేశ మంత్రాల్లో అవి ఉన్నాయని, సాంప్రదాయ జ్ఞానాన్ని పాఠ్యాంశాల్లో తప్పనిసరిగా చేర్చాలని "సెంట్రల్ అడ్వైజరీ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్" సమావేశంలో వ్యాఖ్యానించారు. మరో బీజేపీ నాయకుడు, కేంద్ర శాస్త్ర సాంకేతిక సహాయ మంత్రి హర్షవర్ధన్ ఐన్‌స్టిన్ సిద్ధాంతం వేదాల్లో ఉందన్నాడు. అంతకుముందు సైన్స్ కాంగ్రెస్‌లో సాక్షాత్తు ప్రధాని మోడీనే వేదాల్లోనే ప్లాస్టిక్ సర్జరీ చేశారని ప్రకటించారు. ప్రజల సెన్స్ పరిజ్ఞానాన్ని మార్చాలనే దురుద్దేశ్యంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నట్టు అర్థమవుతోంది. న్యూటన్ చలన సూత్రాలను మేధావులు ప్రపంచవ్యాప్తంగా ఆమోదించారు. ప్రకృతి సిద్ధమైన తత్వశాస్త్రం సైన్స్‌గా ఎలా పరిణామం చెందిందో న్యూటన్ విపులీకరించారు. ఆధునిక ప్రపంచం ఆయనను సైన్స్ పితామహుడిగా గౌరవిస్తున్నది. న్యూటన్ జీవిత పరిణామమే మత నమ్మకాలను, విశ్వాసాలను తోసిరాజంది. న్యూటన్ 1643 జనవరి 4న ఇంగ్లాండ్‌లోని లింకన్ షైర్ ప్రాంతంలోని ఉల్ఫ్ థూర్స్ బస్తీలో జన్మించారు. తన బాధలు, కష్టాల్లోంచి మనస్సుతో ఘర్షణ పడటం ఆరంభించాడు. నిత్యం ప్రకృతిని పరిశీలించేవాడు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో చేరి చరిత్ర గతినే మార్చాడు. గణితంలో ప్రొఫెసర్లకే సులభ సూత్రాలు, సూచనలు చేసి అక్కడే ప్రొఫెసర్‌గా మారాడు. తర్వాత కాంతి మీద ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్నో ప్రయోగాలు చేశాడు. స్వేత వర్ణం రంగు కాదని, అది సప్తవర్ణ సమ్మిశ్రమమని నిరూపించారు. దీని వలనే నక్షత్రాలు, సూర్యుడు, గ్రహాల కాంతి దూరం వాటి నుండి వెలువడే కాంతివేగాలను కనుగొనే సిద్ధాంతంగా అది ప్రచారం పొందింది. తన పరిశోధనల నిరూపణ కోసం "రిఫ్లెక్టింగ్ టెలిస్కోప్"ను కనుగొన్నాడు. గ్రహాలు నక్షత్రాల అంతర్ మర్మాన్ని ఛేదించాడు. భౌతిక శాస్త్రం మీద పరిశోధన చేసి విశ్వజనీన న్యూటన్ గమన సూత్రాలు ప్రతిపాదించారు. అప్పుడే చెట్టు కింద కూర్చుంటే ఆపిల్ కింద పడటం చూసి పైకెందుకు పోవడం లేదనే ఆలోచన వచ్చిందని చెప్పే అంశం చర్చనీయాంశమైంది. గురుత్వాకర్షణ శక్తి వల్ల గ్రహాలు ఒక క్రమ పద్ధతిలో తిరుగుతున్నాయనీ ఇది ఒక్క భూమికే కాదు, మొత్తం విశ్వానికే వర్తిస్తుందని న్యూటన్ సూత్రీకరించారు.

విశ్వంలో నక్షత్రాలకు గానీ గ్రహాలకు గానీ వస్తువులకు గానీ స్థిరంగా ఉండటం సహజ లక్షణమనీ, వాటిని చలనంలో పెట్టడానికి ఏదో శక్తి కావాలనీ ఆ శక్తే దైవమని వైదికులు, సాంప్రదాయవాదుల భావం. కానీ న్యూటన్ చలన సిద్ధాంతం ద్వారా వస్తువులకు చలనం సహజ లక్షణమని నిరూపించారు. చలనం కల్పించడానికి శక్తి అవసరం లేదు. చలనంలో ఉన్న వస్తువు స్థితిని మరో స్థితికి మార్చడానికి శక్తి కావాలని చెప్పాడు. ఆ విధంగా ప్రపంచానికి సంబంధించిన పాత తాత్విక భావన స్థానంలో నూతన తాత్విక భావన - చలనశీలనమైన భావన ప్రవేశపెట్టడానికి ఆయన సిద్ధాంతం దారితీసింది. న్యూటన్ భావాల ప్రభావం ఆనాటి ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై తీవ్రంగా పడింది. న్యూటన్ నూతన భావన ఆర్థిక రంగంలో స్వేచ్ఛా, వాణిజ్యానికి, రాజకీయ రంగంలో లిబరలిజానికి తావిచ్చింది. దాని ఫలితమే తర్వాత జరిగిన ఫ్రెంచ్ విప్లవం. ఆయన ప్రతిపాదించిన మూడు చలన సిద్ధాంతాలు రుజువయ్యాయి. మూడో నియమంపైనే శక్తిని తయారు చేయడం, దాని ద్వారా రాకెట్ వంటి ప్రయోగాలు చేయడం చూస్తూనే ఉన్నాం. మూడో నియమం నేటి పరిస్థితు ల్లో కూడా సాపేక్షతను కలిగి ఉంటుంది. కానీ నేడు పాత భావాలను ప్రభుత్వాలు మరింత ముందుకు తీసుకొస్తున్నవి. సైన్స్‌ను వెనక్కి నెట్టాలని చూస్తున్నాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఇది మరింత విచ్చలవిడిగా సాగుతున్నది. మత విశ్వాసాల ఆధారంగా చరిత్రను తిరగరాయాలని చూస్తున్నారు. యువతను తప్పుదారి పట్టించే కుట్రలు చేస్తున్నారు. చరిత్ర మొత్తంగా సైన్స్ మీద మూఢ నమ్మకాలతో వత్తిడి పెంచాలని చూసినప్పుడల్లా సైన్స్ పురోగమిస్తూనే ఉంది. న్యూటన్ మూడవ సూత్రం దానినే నిరూపించింది. ఈ సత్యం పాలకులు గమనించాలి. యువత సైన్స్ ఇన్‌ఫాచ్యుయేషన్ పెంచుకోవడం ద్వారా పాలకుల కుట్రను తిప్పికొట్టాలి.

హాఫ్ అండ్ హాఫ్...

రెండు రంగుల కలయికతో ముచ్చటగొలిపే విధంగా ఉంటుంది హాఫ్ సారీ. పార్టీ, అకేషన్ ఏదైనా సరే హాఫ్ సారీ ప్రత్యేకతే వేరు. చీర సగం వరకు ఎంబ్రాయిడరీ వర్క్‌తో ఉండి మిగతా సగం ప్లేన్‌గా ఉంటుంది. ముదురు గులాబీ రంగుకు పింక్ కలర్ మిక్స్ అయితే చాలా అందంగా, డిఫరెంట్‌గా కనిపిస్తుంది, అలాగే ఎరుపు రంగు చీర మీద బంగారు వర్ణపు ఎంబ్రాయిడరీ వర్క్ మగువల మనసు దోచేస్తుంది. పసుపు రంగు ప్లేన్ పట్టు చీరకు గులాబీ రంగు కలగలిస్తే ఆ చీర అందమే వేరు. ఇక హాఫ్ సారీ మీదకు ఆపోజిట్‌గా ఉండే ఎంబ్రాయిడరీ వర్క్ బ్లౌజు చీరకే మరింత అందాన్ని కేచ్చొ డుతుంది. ఇది హుందాగా, ప్రత్యేకంగా కనిపిస్తుంది. అందుకే ఈ సారి పార్టీకి ఓ సారి ప్రయత్నించి చూడండి!





ప్రతి మహిళా తనకు ఏదైనా జరుగుతుందేమో పసిగట్టగలిగే పరిజ్ఞానం కలిగి ఉండాలి. తనకు నచ్చనిదానికి నో చెప్పే ధైర్యం ఉండాలి. అంతమాత్రాన అవకాశాలు పోవు. నీ నైపుణ్యానికి, నీకు దక్కాల్సింది కచ్చితంగా దక్కి తీరుతుంది. ఫలితం కూడా వస్తుంది.

–రాధికా ఆప్టే, నటి

'ఏక్.. దో.. తీన్.. అంటూ.. ఊర్రూతలూగించిన గాయని

"ఏక్.. దో.. తీన్.."అంటూ ఆమె గళంలో కౌంటింగ్ స్టార్ట్ కాగానే..శ్రోతలు మనసు ఉరకలు వేస్తుంది. ప్రతివారిని ఉర్రూతలూగించిన ఈ పాట 'తేజాబ్ చిత్రంలోనిది. మరి పాడిన గాయనీమణి పేరు తెలుసా! మూడు దశాబ్దాలుగా నేపథ్యగాయనిగా శ్రోతలను ఉర్రూతలూగిస్తున్న అల్కా యాగ్నిక్. హిందీ సినిమాల ద్వారా గుర్తింపు పొందినప్పటికీ అనేక ప్రాంతీయభాషల్లో తన గానమాధుర్యాన్ని పరిచయం చేశారు. బెస్ట్ ఫిమేల్ ప్లేబ్యాక్ సింగర్‌గా జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకున్నారు. రికార్డు స్థాయిలో 36సార్లు ఆమె పేరు ఫిలిమ్‌ఫేర్ అవార్డు కోసం నామినేట్ చేయబడింది. అనేక సంగీత పురస్కారాలు అందుకున్న ఆమె తెలుగులోనూ పాటలు పాడారు.



అల్కా యాగ్నిక్ (20 మార్చి 1966)

కోల్‌కతాలో స్థిరబడిన గుజరాతీ కుటుంబంలో అల్కాయాగ్నిక్ జన్మించారు. ఆమె తల్లి శుభా యాగ్నిక్ భారత శాస్త్రీయ సంగీతం గాయని. 1972 లో ఆరేండ్ల వయసులో, ఆమె కలకత్తాలోని ఆకాశ్వనీ (ఆల్ ఇండియా రేడియో) కోసం పాడటం ప్రారంభించారు. చిన్నారి ఆల్కా గళంలోని మాధుర్యాన్ని గుర్తించిన ఆమె తల్లి ముంబాయికి వచ్చారు. అలా పదేండ్ల వయసులోనే బాల గాయనిగా ఆమెను పరిశ్రమకు పరిచయం చేయాలనుకున్నారు. అయితే గాయనిగా ఆమెకు అవకాశాలు రాలేదు. మరీ చిన్నపిల్లచేత పాటలు పాడించే ధైర్యం సంగీతదర్శకులు చేయలేకపోయారు. ఆమెను గాయనిగా పరిశ్రమకు పరిచయం చేయడానికి మరికొంత సమయం కావాలని అప్పటి వరకు వెయిట్ చేయమని శుభా యాగ్నిక్‌కు సలహా ఇచ్చారు. కానీ అల్కా గళంలోని చురుకుదనం గుర్తించిన శుభా కోల్‌కత్తాలోని డిస్టిబ్యూటర్ రాజ్ కపూర్‌ను కలిసి అల్కా పాటలు వినిపించారు. కపూర్ ఆ అమ్మాయిని ప్రముఖ సంగీత దర్శకుడు లక్ష్మీకాంత్‌కు రెఫర్ చేశారు. ఆమె గళం విని అబ్బురపడిన లక్ష్మీకాంత్ ఆమెకు డబ్బింగ్ ఆర్టిస్టుగా, గాయనిగా రెండు అవకాశాలు ఇచ్చారు. శుభా తమ బిడ్డ గాయనిగానే పరిశ్రమలో ఉండాలని కోరుకున్నారు.

1980లో విడుదలైన 'పాయల్ కీ ఝూన్కర్' సినిమా కోసం మొదటిసారి ఆల్కా పాట పాడారు. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో పాడినా పెద్దగా గుర్తింపు రాలేదు. 1988లో వచ్చిన తెజాబ్ సినిమాలో ఆమె పాడిన 'ఏక్..దో..తీన్..' పాట మంచి గుర్తింపుతో పాటు అనేక అవకాశాలను కల్పించింది. ఈ పాట బెస్ట్ ఫిమేల్ ప్లేబ్యాక్ సింగర్‌గా ఏడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను అందుకునేలా చేసింది.

కేవలం హిందిలోనే కాకుండా గుజరాతీ, ఒడియ, అస్సామీ, రాజస్థానీ, బెంగాలీ, భోజ్‌పురి, పంజాబీ, మరాఠి, తెలుగు, తమిళం, ఇంగ్లీష్, మళయాళం తదితర భాషలలో కూడా ఆల్కా పాటలు పాడారు. ప్రముఖ సంగీత దర్శకులు కళ్యాణ్‌జీ– ఆనంద్‌జీ, రావుల్ దేవ్ బర్మన్, లక్ష్మీకాంత్–ప్యారేలాల్, రాజేష్ రోషన్, నదీమ్–శ్రావణ్, జతిన్–లలిత్, అను మాలిక్, ఎ.ఆర్.రహమ్మన్, ఆనంద్–మిలింద్, ఎంఎం కీరవాణి, సాజిద్–వాజిద్, బప్పి లహిరి, సందేష్ శాండిల్య వంటి అనేక మంది దర్శకత్వంలో ఆమె పాటలు పాడారు. మూడు దశాబ్దాలుగా వందలాది డ్యూయెట్లు ఆమె గళం నుంచి వెలువడ్డాయి. అంతేకాదు.. అనేక భక్తిగీతాల ఆల్బమ్స్‌ను కూడా ఆమె విడుదల చేశారు. ❄

డ్రై ఫ్రూట్స్‌తో హెల్దీగా

గుండె జబ్బులు వయసుతో సంబంధం లేకుండా వస్తున్నాయి. వీటిని నిరోధించేందుకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి! జీడిపప్పు, బాదం, ఎండు ద్రాక్ష, వాల్ నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల గుండెకు ఎంతో మేలు జరుగుతుందని న్యూట్రీషియన్స్ చెబుతున్నారు.



జీడిపప్పు: గుండె ఆరోగ్యానికి మంచిదైన ఒలేయిక్ ఆమ్లం జీడిపప్పులో లభిస్తుంది. ఇంకా రాగి, మెగ్నీషియం, జింక్, ఇనుము ఇలా శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు జీడిపప్పులో ఉంటాయి. కాబట్టి క్రమం తప్పకుండా రెండు లేదా మూడు తీసుకున్న గుండె సంబంధిత సమస్యల నుంచి కాపాడుకోవచ్చు.

బాదం: బాదం పప్పులో మెగ్నీషియం, పొటాషియం, మాంగనీసు, క్యాల్షియం, రాగి వంటి ఖనిజ లవణాలు, విటమిన్ 'ఇ' పుష్కలంగా ఉంటాయి. రోజూ బాదం పప్పులు తింటే శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. గుండెను ఆరోగ్యంగా ఉంచే ఫోలేట్, విటమిన్ 'బి' లోపంతో బాధపడేవారు బాదం తింటే మంచిది.

వాల్‌నట్స్ : ఒమెగా–3 ఎసెన్షియల్ ఫ్యాటీ ఆమ్లాలు గుండె ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. అధిక రక్తపోటును హానికర కొలెస్ట్రాల్ స్థాయిల్ని నియంత్రిస్తుంది. వీటికుండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఒత్తిడి, ఆందోళన వంటివాటి నుంచి ఉపశమనం కలిగిస్తాయి. వాల్‌నట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

ఎండుద్రాక్ష: వీటిలో కూడా యాంటీ ఆక్సిడెంట్ గుణాలు అధికంగా ఉంటాయి. మెనోపాజ్ దశలో ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోవడం వల్ల ఎముకలపై దుష్ప్రభావం చూపి ఆస్టియోపోరోసిస్ వ్యాధికి దారితీస్తుంది. అలాకాకుండా ఎముకల ఆరోగ్యాన్ని రక్షించే బోరాన్ అనే ఖనిజలవణం ఎండు ద్రాక్షలో పుష్కలంగా ఉంటుందని న్యూట్రీషన్లు చెబుతున్నారు. ❄

మహిళలకు మార్గదర్శకంగా...

మహిళలు పురుషులతో పోటీ పడి అన్ని రంగాల్లోనూ వారికి సమానంగా దూసుకెళ్తున్నారు. కానీ ఒకప్పు, పురుషాధిక్య సమాజంలో కొన్ని వృత్తుల్లోకి ఆడవారికి ప్రవేశమే ఉండేది కాదు. మరీ ముఖ్యంగా ఆటోమొబైల్‌రంగం. ఆటోడ్రైవర్లు అంటే మగవారే... కానీ.. ఆ సమయంలోనే ఓ మహిళ స్టీరియోటైప్స్‌ను బద్ధలు కొట్టింది. ఛాలెంజింగ్‌గా ఆటోడ్రైవర్ వ త్తిని స్వీకరించింది. అందులో విజయవంతంగా దూసుకెళ్లింది. తనలాంటి ఎంతో మంది మహిళలకు ఆమె ప్రేరణగా నిలిచింది. ఆమే.. పుణేకి చెందిన షీలా దావ్రే.

షీలా దావ్రేది మహారాష్ట్రలోని పర్బని. అక్కడే పుట్టి పెరిగింది. 18 ఏళ్లు వచ్చే వరకు అక్కడే ఉంది. అయితే ఆమెది చాలా పేద కుటుంబం. రెక్కాడితే గానీ డొక్కాడేది కాదు. దీంతో తల్లిదండ్రులకు భారంగా ఉండొద్దని 1988లో ఊరుని వదిలి పుణేకు చేరుకుంది. అక్కడే మహిళా సంఘాల సహాయంతో స్వయం ఉపాధి కోసం అవకాశాలను వెతికింది.



దీంతో ఆటో డ్రైవింగ్ నేర్చుకుంది. అయితే మొదట్లో ఆమె ప్రతిపాదనను కుటుంబ సభ్యులు కూడా వ్యతిరేకించారు. కానీ చివరకు ఒప్పుకున్నారు. దీంతో పుణేలో తన ఇంటి వద్ద ఉండే ఆటో డ్రైవర్లు సెలవులో ఆటో ఇంటి వద్ద వదిలి వెళితే అలాంటి ఆటోలను షీలా నడిపేది. ఈ క్రమంలో అలా తాను సంపాదించే ఒక్కో రూపాయిని పోగు చేసింది. తానే సొంతంగా ఆటో కొనుక్కుంది. దీంతో ఆమెకు కష్టాలు తీరిపోయాయనే చెప్పవచ్చు. ఆ సమయంలోనే మరో ఆటోడ్రైవర్‌తో ఆమె వివాహం అయింది. అయితే షీలా ఆటో నడిపే మొదట్లో చాలా మంది ఆమె ఆటోలో ఎక్కేందుకు విముఖత ప్రదర్శించేవారు. లేడీ ఆటోడ్రైవర్ ఏంటీ.. ఆమె ఆటో బాగా నడుపుతుందా.. సేఫ్‌గా తమను తీసుకెళ్తుందా.. అని చాలా మంది ఆలోచించే వారు. దీంతో ఆమెకు ప్రయాణికులు లభించే వారు కాదు. కానీ ఆమె పట్టు కోల్పోలేదు. నెమ్మదిగా పనిచేయడం ప్రారంభించింది. చివరకు సొంత ఆటోకు ఓనర్ అయింది. అలా షీలా 1988లో ఆటోడ్రైవర్ అవగా, మన దేశంలో ఆటోడ్రైవర్ అయిన మొదటి మహిళగా గుర్తింపు పొందింది. దీంతో ఆమె పేరు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి చేరింది. అయితే కేవలం ఆటోమాత్రమే కాదు, స్కూల్ పిల్లల వ్యాన్లు, బస్సులను కూడా షీలా నడిపేది. అలా 1988 నుంచి 2001 వరకు ఆమె డ్రైవింగ్ చేసింది. తరువాత అనారోగ్య కారణాల వల్ల ఆమె ఆ పని మానేసింది. అయినప్పటికీ ఆమె ఎంతో మంది మహిళలకు ప్రేరణగా నిలిచింది. చాలా మంది మహిళలు ఆటోడ్రైవర్లు అయ్యేందుకు తన వంతు సహాయం చేసింది! ❄

మృతకణాలను తొలగిద్దాం




టాన్ నుంచి చర్మాన్ని శనగపిండి కాపాడుతుంది. చర్మంలోని మృతకణాలను తొలగిస్తుంది. అంతేకాదు చర్మాన్ని మృదువుగా మెరిసేలా చేస్తుంది.

- నిమ్మ రసంలో శనగపిండి లేదా తేనె కలిపి ఎండబారిన పడిన చర్మం మీద రాసుకుని పావుగంట తర్వాత నీటితో కడిగేయాలి.
- కప్పు పాలల్లో చిటికెడు పసుపు వేసి బాగా కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని ఆరాక నీటితో కడిగేయాలి. ఇలా రోజూ చేస్తే చర్మం మెరుస్తుంది.
- అరకప్పు బొప్పాయి గుజ్జులో ఒక టేబుల్ స్పూను తేనె కలిపి పేస్టులా చేసి ముఖానికి రాసుకోవాలి. అరగంట తర్వాత నీటితో బాగా కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా తయారవుతుంది. ❄

ఇలా చేసి చూడండి!



- సాధ్యమైనంత వరకూ హెయిర్ స్టయిలింగ్ చికిత్సలు, ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. వాటిలో గాఢత ఎక్కువగా ఉండే రసాయనాలు జుట్టును తాత్కాలికంగా మెరిపించినా దీర్ఘకాలికంగా సమస్యలను తెచ్చిపెడతాయి. కాబట్టి వాటిని వాడక పోవడమే మంచిది.
- జుట్టు మరీ పొడిగా కనిపిస్తుంటే కలబంద గుజ్జు లేదా పెరుగును ఉపయోగించాలి. ఇవి మంచి కండీషనర్లుగా పని చేస్తాయి. రెండు చెంచాల పెరుగులో నాలుగు చుక్కల నిమ్మరసం కలిపి తలకు పట్టించాలి. అర గంట తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగితే మంచి జుట్టు మెత్తగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది. అలాగే కలబంద గుజ్జును పట్టించి అరగంట తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగితే మంచి ఫలితం ఉంటుంది.
- తలను సాధ్యమైనంత పరిశుభ్రంగా, నూనె లేకుండా ఉంచుకోవాలి. అందుకోసం తరచూ తలస్నానం చేస్తుండాలి. దాని వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. అలాగని రోజూ తల స్నానం చేస్తే తలలోని సహజ నూనెలు పోతాయి. దాంతో జుట్టు ఎదుగుదల తగ్గుతుంది. వారంలో రెండుసార్లు తలస్నానం చేస్తే సరిపోతుంది.
- తలస్నానం కోసం గోరువెచ్చటి లేదా చల్లని నీటిని మాత్రమే వాడాలి. అప్పుడప్పుడూ కొబ్బరి నూనెను వేడి చేసి, గోరు వెచ్చగా ఉన్నప్పుడు తలకు రాసుకుని అరగంటయ్యాక కడిగేసుకుంటే సరిపోతుంది. ❄



కేటాయింపులే...ఖర్చేదీ?

- బడ్జెట్‌పై చర్చలో టీడీపీ సభ్యులు సండ్ర

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు బడ్జెట్లలో నిధుల కేటాయింపులే తప్ప, దానికి తగినట్టు ఖర్చులు లేవని తెలుగుదేశంపార్టీ సభ్యులు సండ్ర వెంకట వీరయ్య అన్నారు. సోమవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పుల మీదే ఆధారపడుతోందని, ఆశించిన ప్రగతి మాత్రం లేదని చెప్పారు. రకరకాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారని విమర్శించారు. 2015-16లో ప్రగతి పద్దు క్రింద రూ.52వేల కోట్లు చూపి, రూ.32 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఇదే పరంపర ఇప్పుడూ కొనసాగుతోందన్నారు. ప్రభుత్వం తాత్కాలిక హామీల అమలుకే ఎక్కువ ఖర్చు చేస్తున్నదని చెప్పారు. 3 లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మాణం చేస్తామని ప్రకటించి నాలుగేండ్లలో కేవలం 9వేల ఇండ్లు మాత్రమే కట్టారని, వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రూ.2,600 కోట్లు కేటాయించారని, ఈ సొమ్ముతో 40 వేల ఇండ్లు మాత్రమే కట్టగలరని వివరించారు. దళితులకు మూడెకరాల భూమి ఏమైందని ప్రశ్నించారు. సమగ్ర కుటుంబసర్వేను ఇప్పటి వరకు ప్రభుత్వం బయటపెట్టలేదని, ఏ ఉద్దేశ్యం, లక్ష్యంతో ఆ సర్వే చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఫలితాలు వారికి అందట్లేదని, బీసీ సబ్‌ప్లాన్ ఏమైందని అడిగారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ఖాళీలు భర్తీ చేయండి : డీజీపీ

నవ తెలంగాణ : ప్రత్యేక ప్రతినిధి

కోర్టుల్లో నేరస్తులకు సంబంధించిన విచారణ త్వరిత గతిన సాగడానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఈజీపీ ఎం.మహేందర్‌రెడ్డి న్యాయశాఖ అధికారులను కోరారు. సోమవారం సచివాలయంలో న్యాయశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో దాదాపు 300 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ఆవశ్యకత ఉందని ఖాళీలు పోను మిగతా వారి పోస్టుల మంజూరు కోసం వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు సవ్యంగా ఉండాలంటే వివిద సంధర్భాలలో పోలీసు శాఖ అరెస్టు చేసిన నేరగాళ్లకు కోర్టులో శిక్షలు పడేలా చేయడంలో పబ్లిక ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకమైందని డీజీపీ వివరించారు. నేరం చేసిన వారికి వీలైనంత త్వరగా శిక్ష పడేలా చేయడం వలన కొత్త వారు ఎవరైనా నేరం చేయడానికి భయపడే పరిస్తితి ఏర్పడుతుందని , అలాంటి వాతావరణాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కొరత కారణంగా కోర్టులలో పేరుకు పోతున్న తమ శాఖ నమోదు చేసిన కేసుల గురించి కూడా ఆయన న్యాయశాఖ అధికారుల దృష్టికి తీసుకు వచ్చారని తెలిసింది. పీపీల ఖాళీల భర్తీ ప్రక్రియను వీలైనంత త్వరగా న్యాయశాఖ చేపట్టాని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐడీ డీజీ గోవింద్‌సింగ్, డీఐజీ రవివర్మ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వేసవిలో విధులు నిర్వహించినందుకు ఈఎల్స్ ఇవ్వాలి: యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

2016లో మధ్యాహ్న భోజనం విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రోజుకు రూ.25 మరియు ఎస్‌జీటీలకు రూ.18.75 చొప్పున గౌరవ వేతనాన్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాములు, చావ రవి ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనల ప్రకారం 24 ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 25,109 మంది ఉపాధ్యాయులకు 49 రోజులకు గాను రూ.2.755 కోట్లు మంజూరు చేశారని, ఈ లెక్కన రోజుకు సగటున రూ.22.40లు పడుతున్నదని తెలిపారు. ఈ నామమాత్రపు వేతనాన్ని ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ఉపాధ్యాయులను తీవ్రంగా అవమానించిందని, ప్రభుత్వ మెమో, డైరెక్టర్ ఉత్తర్వులను తిరస్కరిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. కాగా సర్కారు నిర్ణయాన్ని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండల్‌రెడ్డి, ఎం శ్రీనివాస్, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, సదానందంగౌడ్, టీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్, పీఆర్‌టీయూటీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం అంజిరెడ్డి, చెన్నయ్య తదితరులు వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా తప్పుపట్టారు.

జర్నలిస్టుల ఇండ్లస్థలాలపై మంత్రులకు జేహెచ్‌సీసీ నేతల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు కేటాయించాలని మంత్రులను జర్నలిస్ట్స్ హౌసింగ్ కోఆర్డినేషన్ కమిటీ(జేహెచ్‌సీసీ) విజ్ఞప్తి చేసింది. సోమవారం అసెంబ్లీలో జేహెచ్‌సీసీ నాయకులు మంత్రులు టి.హరీశ్‌రావు, కె.తారకరామారావు, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. ఈసందర్భంగా దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను వారితో చర్చించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా వారికి గుర్తు చేశారు. నాలుగేండ్లుగా స్థలాల కోసం జర్నలిస్టులు ఎదురుచూస్తున్నారని తెలియజేశారు. జేహెచ్‌సీసీ కన్వీనర్, సాక్షి పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ దిలీప్‌రెడ్డి, కోకన్వీనర్లు, ఆయా జర్నలిస్టు సంఘాలు, హౌసింగ్ సొసైటీల ప్రతినిధులు వెంకట్‌చారి, విరాహత్‌అలీ, బి.బసవపున్నయ్య, రాజమౌళిచారి, నాయకులు ఎంఎ హాష్మీ, రాములు మంత్రులను కలిసినవారిలో ఉన్నారు.

ఏప్రిల్ 13నుంచి 22వరకు హైదరాబాద్ ఫెస్ట్

- ప్రజల్లోని ఒత్తిడి తగ్గించేందుకే ఈ పండగ : చుక్కా రామయ్య


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చుక్కా రామయ్య,నంద్యాల నర్సింహారెడ్డి, వేణుగోపాల్ తదితరులు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

వచ్చేనెల 13నుంచి 22వరకు హైదరాబాద్ నగరంలోని తెలంగాణ కళాభారతి(ఎన్‌టీఆర్ స్టేడియం)లో హైదరాబాద్ ఫెస్ట్-2018 నిర్వహిస్తున్నట్టు ప్రముఖ విద్యావేత్త, హైదరాబాద్ ఫెస్ట్ ఆర్గనైజింగ్ కమిటీ గౌరవ చైర్మెన్ చుక్కా రామయ్య తెలిపారు. ప్రజల్లోని ఒత్తిడిని తగ్గించేందుకు స్ఫూర్తి ప్రొగ్రెసివ్ సొసైటీ ఈ ఫెస్ట్‌ను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నగరంలోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఫెస్ట్‌కు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు వివరించారు. ప్రతియుగంలో సమాజంపై కొన్ని భావాలు డామినేట్ చేస్తాయనీ, ఈకాలంలో సాంస్కృతిక భావాల ప్రభావం ఉందని చెప్పారు. ప్రతి వ్యక్తి ఆర్థిక అంశాలతో పాటు కల్చరర్‌కు సంబంధించిన వాటి గురించి కూడా ఆలోచించాల్సిన అవసరముందని తెలిపారు. హైదరాబాద్ నగరం సెక్యులర్ కల్చర్‌తో కూడుకున్నదన్నారు. నగరంలోని సాలార్‌జంగ్ మ్యూజియం చూస్తే పాతకాలం జ్ఞాపకాలు, గచ్చిబౌలి ప్రాంతం చూస్తే భవిష్యత్‌కాలం కనిపిస్తుందని చెప్పారు. ఈరెండింటి మిలితం ఫెస్ట్‌లో కనిపిస్తుందని తెలిపారు. టెక్నికల్‌యుగంలో గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వలసలు పెరిగిపోయాయనీ, వారికి ఇక్కడి పరిస్థితులు అర్థం కావడం లేదని చెప్పారు. ఈనేపథ్యంలో భిన్న సంస్కృతులతో కూడిన ఫెస్ట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ ఫెస్ట్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ...బహుముఖ కార్యక్రమాలు హైదరాబాద్ ఫెస్ట్‌లో ఉంటాయన్నారు. కల్చరర్, సైన్స్, టెక్నాలజీ, సాహిత్యం, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, పబ్లిక్ సెక్టార్, బాలోత్సవ్, పుస్తక ప్రదర్శన, ఆర్ట్స్ ఎగ్జిబిషన్, షార్ట్స్ ఫిల్మ్ ఎగ్జిబిషన్ ఇలా 22రకాల ప్రత్యేక విభాగాలు ఈఫెస్ట్‌లో ఉంటాయని చెప్పారు. ప్రజల్లో ఒత్తిడి తగ్గించడంతో పాటు వైజ్ఞానిక ఆలోచనలను పెంపొందించేందుకు దీన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఏటా హైదరాబాద్ ఫెస్ట్‌ను నిర్వహిస్తామన్నారు. కమిటీ కార్యదర్శి కె చంద్రమోహన్, కమిటీ సభ్యులు కె వేణుగోపాల్ మాట్లాడుతూ...మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 9గంటల వరకు, సెలవు దినాల్లో మధ్యాహ్నం 12గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. దీనికి ఉచిత ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఫెస్ట్‌కు సినీనటులు ప్రకాశ్‌రాజ్, కమల్‌హాసన్‌తో పాటు ప్రభుత్వాధినేతలను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. దీనికి ఐదులక్షల మంది హాజరవుతారనే అంచనా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ కోశాధికారి నాగేశ్వర్‌రావు, సభ్యులు జగదీశ్, శాంతారావు, ఖయ్యూం తదితరులున్నారు.

జేఎన్‌యూలో టెన్షన్..టెన్షన్

లైంగికవేధింపులకు పాల్పడిన ప్రొఫెసర్‌ను అరెస్టు చేయాలి

ఢిల్లీ వసంత్‌కుంజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైటాయింపు

పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట

న్యూఢిల్లీ: లైంగిక వేధింపులకు పాల్పడిన జేఎన్‌యూ ప్రొఫెసర్ అతుల్ జోహ్రిని తక్షణం అరెస్టు చేయాలని కోరుతూ జేఎన్‌యూ విద్యార్థులు చేసిన నిరసన ప్రదర్శన ఉద్రిక్తతకు దారితీసింది. ఢిల్లీ వసంత్‌కుంజ్ పోలీస్‌స్టేషన్ వద్దకు భారీ సంఖ్యలో విద్యార్థులు తరలి రావటంతో..వారిని అడ్డుకోవటానికి పోలీసులు నానా పాట్లు పడకతప్పలేదు. బ్యారికేడ్లు పెట్టి విద్యార్థులను నిలువరించటానికి పోలీసులు చేసిన ప్రయత్నంతో వారి మధ్య తోపులాట జరిగింది. అమాంతంగా ఘర్షణ వాతావరణం నెలకొనటంతో..పోలీసులు వెనక్కితగ్గి..అతుల్ జోహ్రిమీద లైంగిక వేధింపుల కేసులను నమోదు చేసినట్టు తెలిపారు.



ఏం జరిగింది..?


జేఎన్‌యూ ప్రొఫెసర్ అతుల్ జోహ్రిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ.. తొమ్మిదిమంది విద్యార్థులు ఆరోపిస్తూ శుక్రవారం ఆందోళనకు దిగారు..అదే రోజు కోర్టులోనూ ఫిర్యాదు చేశారు.సోమవారం బాధిత విద్యార్థినులిద్దరూ తమపై జరిగిన దారుణాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు.సీసీ కెమెరాల మధ్య విచారణ అనగానే జోహ్రి గైర్హాజరయ్యారు.దీంతో విద్యార్థులంతా భారీ ప్రదర్శనగా తరలివచ్చి పోలీసు స్టేషన్ ముందు బైటాయించటంతో జేఎన్‌యూ పరిసరాల్లో టెన్షన్..వాతావరణం నెలకొంది. ఎట్టకేలకు పోలీసులు కేసులు నమోదు చేస్తామ నటంతో పాటు..సీఆర్‌పీసీ 164 సెక్షన్ కింద బాధిత విద్యార్థినుల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకోవటానికి అంగీకరించారు. అవసరమైతే మరిన్ని సెక్షన్లు కూడా చేరుస్తామని . ప్రొఫెసర్ జోహ్రికి నోటీసు జారీ చేశామని, మంగళవారం ఇన్వెస్టిగేషన్ ముందు ఆయన హాజరవుతారని అధికారులు చెబుతున్నారు.దీంతో జేఎన్‌యూ విద్యార్థులు శాంతించారు.పోలీసులు కనుక కేసును నిర్లక్ష్యం చేస్తే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని విద్యార్థిసంఘాలు హెచ్చరించాయి.



బీకాంలో పాలిటిక్స్

- అర్థశాస్త్ర ప్రశ్నాపత్రంలో బీజేపీ పథకాలు
- లక్నో యూనివర్సిటీ నిర్వాకం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఇటీవలే ప్రారంభమైన బీకాం పరీక్షల్లో.. అర్థశాస్త్ర పరీక్ష ప్రశ్నాపత్రంలో బీజేపీ పథకాల గురించి ప్రశ్నలు అడగడం వివాదాస్పదమైంది. వివరాల్లోకి వెళ్తే... బీకాం విద్యార్థులకు నిర్వహించిన అర్థశాస్త్రం ప్రశ్నాపత్రంలో.. డిజిటల్ ఇండియా, బేటీ బచావో బేటీ పడావో, ప్రధాన్‌మంత్రి జన్‌ధన్ యోజన, స్టార్టప్ ఇండియాల గురించి ప్రశ్నలు అడిగారు. మరో ప్రశ్నలో దేశంలో నిరుద్యోగాన్ని రూపుమాపడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి రాయండంటూ 15 మార్కులకు ప్రశ్న వచ్చింది. దీనిపై యూనివర్సిటీ అధికారులు స్పందిస్తూ.. విద్యార్థులకు సమస్త రంగాల మీద అవగాహన ఉండటం కోసమే ప్రశ్నాపత్రాన్ని ఈ విధంగా తయారుచేశామన్నారు. ఇదిలావుండగా దీనిపై విద్యార్థి సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. విద్యార్థుల్లో హిందూత్వ బావజాలాన్ని నింపడానికే బీజేపీ ఈ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించాయి. ఉత్తరప్రదేశ్‌లోని యూనివర్సిటీలు ఈ విధంగా చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ బనారస్ విద్యాలయంలో చరిత్ర విద్యార్థులకు పద్మావతి దేవీ చరిత్ర రాయాలని అడిగారు. అలాగే కౌటిల్యుడి అర్థశాస్త్రంలో జీఎస్టీ స్వభావం.. మనువు గురించి ప్రశ్నలడిగి వివాదాస్పదమైన సంగతి తెలిసిందే.



మే 8న దోస్త్ నోటిఫికేషన్

- 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జులై 2న డిగ్రీ తరగతులు ప్రారంభం
- వీసీల సమావేశంలో ఉన్నత విద్యామండలి నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రవేశాల ప్రక్రియలో భాగంగా 2018-19 విద్యాసంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్ మే 8న విడుదల చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. అదేనెల 10 నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తాత్కాలిక షెడ్యూల్‌ను రూపొందించింది. అపరాధ రుసుం రూ.400లతో మే 27 నుంచి 29వ తేదీ వరకు అవకాశముంది. తొలివిడత సీట్ల కేటాయింపు జూన్ 4న ఉంటుందని నిర్ణయించింది. జూన్ 5 నుంచి 12వ తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో విద్యార్థులు రిపోర్టు చేయాలని పొందుపర్చింది. రెండో విడత దోస్త్ ప్రవేశాల ప్రక్రియ జూన్ 13, 14 తేదీల్లో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. జూన్ 19న రెండో విడత సీట్లను కేటాయించనున్నారు. జూన్ 20 నుంచి 25వ తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. జూన్ 26, 27 తేదీల్లో దోస్త్ తుదివిడత ప్రవేశాల ప్రక్రియ జరగనుంది. ఆయా తేదీల్లో విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి. జూన్ 30న తుదివిడత సీట్లను కేటాయిస్తారు. జులై 2 నుంచి 4వ తేదీ వరకు చివరి విడతలో కేటాయించిన విద్యార్థులు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. జులై 2వ తేదీ నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతుల ప్రక్రియ ప్రారంభమవుతుంది. సోమవారం ఉన్నత విద్యామండలిలో దోస్త్ ప్రవేశాలపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఉన్నత మండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మెన్లు ఆర్ లింబాద్రి, వి వెంకటరమణ, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్‌తోపాటు ఆరు విశ్వవిద్యాలయాల వీసీలు, రిజిస్ట్రార్లు హాజరయ్యారు. 2016-17 విద్యాసంవత్సరం నుంచి తెలంగాణలో డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ చివరి నాటికి డిగ్రీ కాలేజీల వివరాలను దోస్త్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని నిర్ణయించామని తెలిపారు. ఈ లోపు డిగ్రీ కాలేజీల అనుబంధ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని వీసీలను కోరారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా దోస్త్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని విశ్వవిద్యాలయాలకూ వర్తించే విధంగా కామన్ ప్రవేశాల షెడ్యూల్ ఉన్నట్టుగానే కామన్ అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందించాలని నిర్ణయించామని తెలిపారు. 2016-17, 2017-18 విద్యాసంవత్సరాల్లో విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కాంట్రాక్టర్ కుమారుడిని చంపిన మావోయిస్టులు

- ఆరు వాహనాలు దగ్ధం
- రోడ్డు నిర్మాణం ఆపకపోవడంతోనే
- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఘటన

నవతెలంగాణ-భద్రాచలం

రోడ్డు నిర్మాణ పనులు నిలిపేయాలని హెచ్చరించినప్పటికీ ఆపకపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో కాంట్రాక్టర్ కుమారుడిని మావోయిస్టులు చంపేశారు. రోడ్డు నిర్మాణంలో ఉపయోగిస్తున్న ఆరు వాహనాలను తగులబెట్టారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం..తుంనార్-కోయిట్‌పల్లి మధ్య రోడ్డు వేస్తున్నారు. ఆ రోడ్డు పనుల్లో ఎవరూ పాల్గొ నవద్దని పలుమార్లు మావోయిస్టులు హెచ్చరికలు జారీ చేశారు. కార్మికులను బెదిరించి పంపేశారు. కాంట్రాక్టర్‌నూ హెచ్చరించారు. గత నెలలో సుకుమా జిల్లా ఎర్రబోరు పరిధిలోని ఎన్‌హెచ్ 30 వద్ద రోడ్డు నిర్మాణంలో ఉన్న టిప్పర్ వాహనాన్ని తీసుకెళ్లి తగలబెట్టారు. అయినా, కాంట్రాక్టర్ పట్టించుకోకుండా పనులను కొనసాగిస్తుండటంతో అతని కుమారుడు విశాల్(40)ను హత్య చేసి అదే రోడ్డుపై పడేశారు. అక్కడ ఉన్న ఆరు వాహనాలను తగలబెట్టారు. గతనెలలో బస్తర్ జిల్లా మారుడూమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన మంత్రి సడక్ నిర్మాణ్ యోజనలో భాగంగా రోడ్డు నిర్మాణంలో వున్న 10 ట్రాక్టర్లను, ఇతర వాహనాలను తగలబెట్టారు. మొదకాపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భట్టుపల్లి, సంకనపల్లి రహదారి మధ్యలో జరుగుతున్న రోడ్డు నిర్మాణంలో పని చేస్తున్న ఒక మిక్సర్, 9 ట్రాక్టర్‌లనూ తగలబెట్టారు. ఇలా నెల వ్యవధిలో 20కి పైగా వాహనాలను తగలబెట్టారు.



ఆంధ్రప్రదేశ్

'బాబు' ప్రభుత్వ అవినీతిపై విచారణ

పవన్ కల్యాణ్ డిమాండ్



అమరావతి : చంద్రబాబు ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఒక ఆంగ్ల టీవీ ఛానల్‌తో సోమవారం మాట్లాడిన ఆయన ఆ పార్టీకి చెందిన 40 మంది ఎంఎల్‌ఏలు, మరికొందరు నేతలు ఈ అవినీతి విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని ఆయన అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ అవినీతి గురించి తాను కొత్తగా మాట్లాడడటం లేదని, గతంలోనే ఆయన దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. అయితే, ఆయన సీరియస్‌గా స్పందించలేదని అన్నారు. ఎన్నికల పొత్తు విషయమై ఇప్పుడు ఆలోచించడం లేదని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. ఎన్నికల సమయంలో ఆ విషయమై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కాంట్రాక్టర్‌ను మార్చడం వెనుక ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీతో తనకు కొంత పరిచయం ఉందని. అయినా, తన పరిధి స్వల్పమేనని చెప్పారు. . రాష్ట్రంలో టీడీపీ, బీజేపీల మధ్య సంబంధాలు ఎప్పుడూ సరిగా లేవని అన్నారు. రాష్ట్ర ప్రజానీకం బీజేపీపై ఆగ్రహంగా ఉన్నారని, ఆ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదని తెలిపారు. తాను ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేయగానే తన వెనుక బీజేపీ ఉందంటూ టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని, గతంలో తన వెనుక చంద్రబాబు ఉన్నారని జగన్ ఆరోపించారని పేర్కొన్నారు.


ఐసీడీఎస్ బడ్జెట్, అంగన్‌వాడీ వేతనాలు పెంచాలని, బయోమెట్రిక్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

అంగన్‌వాడీల చలో విజయవాడ విజయవంతం

విజయవాడ: ఐసీడీఎస్ బడ్జెట్ , అంగన్‌వాడీ వేతనాలు పెంచాలని, బయోమెట్రిక్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవరం అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతమయింది. మండుటెండను లెక్కచేయకుండా తరలివచ్చిన అంగన్‌వాడీలు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరకు ఐసీడీఎస్ ప్రాజెక్టు జాయింట్ డైరెక్టర్ ధర్నా చౌక్ వద్దకు వచ్చి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఆందోళనకు రాకుండా అంగన్‌వాడీ వర్కర్లను పోలీసులు అడ్డుకొని ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. అయినప్పటికీ అన్ని జిల్లాల నుంచి తరలివచ్చిన వేలాది మంది అంగన్‌వాడీలు రైల్వేస్టేషన్ నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకులు అంగన్‌వాడీ వర్కర్ల ఆందోళనకు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో ఆందోళన మరింత ఉధృతం చేస్తామనన్నారు. అవసరమైతే వివిధ రాజకీయ పార్టీల మద్దతుతో బంద్‌కు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వాతావరణ పరిస్థితుల మార్పుల్లో... అత్యంత హానికరమైన స్థితిలో భారత్

- అభివృద్ధి చెందుతున్న 67 దేశాల్లో సర్వే
- హెచ్‌ఎస్‌బీసీ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: వాతావరణ పరిస్థితుల్లో జరిగే మార్పుల కారణంగా సంభవించే పరిణామాల్లో భారత్ అత్యంత హానికరమైన స్థితిలో ఉన్నదని హెచ్‌ఎస్‌బీసీ నివేదిక వెల్లడించింది. పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్‌ల కంటే భారత్ పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నదని తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న 67 దేశాల్లో సర్వే నిర్వహించారు. ఈ దేశాల్లో శీతోష్ణస్థితుల్లో మార్పులు, దేశ సరిహద్దుల్లో భౌతిక ప్రభావాలు వంటి పలు అంశాలు పరిగణనలోకి తీసుకున్నారు. ఈ నివేదికలో మరీ ప్రమాదకరంగా ఉన్న నాలుగు దేశాల జాబితాలో భారత్ ఉండటం కలవరపరిచే అంశమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల దేశంలో ఉష్ణోగ్రతలు పెరగడం, వ్యవసాయాధారిత పంటలు పండకపోవడం, తీవ్ర కరువు పరిస్థితులేర్పడటం వంటి ప్రమాదాలు ఎదురవుతున్నాయని నివేదిక పేర్కొంది. ఓమన్, శ్రీలంక, కెన్యా, మెక్సికో, కొలంబియా, ధక్షిణాఫ్రికా వంటి దేశాల్లో ఇవే పరిస్థితులున్నాయని తెలిపింది. ఈ జాబితాలో న్యూజీలాండ్, ఫిన్లాండ్, నార్వే, స్వీడన్ దేశాలు అతి తక్కువ ప్రమాద స్థాయిలో ఉన్నాయి.

కలుషిత నీరు తాగి 60 మందికి అస్వస్థత

- నలుగురి పరిస్థితి విషమం
- నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం వివేక్‌నగర్ తండాలో ఘటన
- కారణం నల్లా నీరా? భగీరథ నీరా? తేల్చాలని కలెక్టర్ ఆదేశం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కలుషిత నీటిని తాగి 60 మంది అస్వస్థతకు గురయ్యారు. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం వివేక్ తండాలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ ఘటన నల్లా నీళ్లను తాగటం వల్ల జరిగాందా? లేక మిషన్ భగీరథ పైపులైన్ల నుంచి వచ్చిన నీటి వల్ల జరిగిందా? నిర్ధారించాలని డీఎంఅండ్‌హెచ్‌వో వెంకట్‌ను కలెక్టర్ ఎం. రామ్మోహన్‌రావు ఆదేశించారు. బాధితుల వివరాల ప్రకారం...వివేక్‌నగర్ తండాలో ఆదివారం సాయంత్రం సేవాలాల్ ఆలయం వద్ద తండావాసులు సత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా భోజనం చేసి ఇటీవలే బిగించిన మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా సరఫరా అయిన నీటితో పాటు నల్లా నీరును స్థానికులు తాగారు. కొద్దిసేపటికే ఒక్కొక్కరుగా వాంతులు, విరేచనాలు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో విషయం తెలియడంతో సోమవారం ఉదయం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందించింది. మరికొందరికి ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తున్నారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. వైద్య శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో వెంకట్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఎవరికీ అపాయమూ లేదని, రెండ్రోజుల పాటు వైద్య శిబిరం కొనసాగించి సేవలందిస్తామని చెప్పారు. మిషన్ భగీరథ, నల్లా నీటి శాంపిళ్లను సేకరించి హైదరాబాద్‌కు పంపించనున్నట్టు వైద్యులు తెలిపారు. బాధితులను టీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా యువ నాయకులు జగన్ పరామర్శించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3వ వార్షికోత్సవం
మార్చి 18-21

అధ్యక్షుడిగా మరో ఆరేండ్లు..

• రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ ఘన విజయం • పుతిన్‌కు 76శాతం ఓట్లు

మాస్కో : రష్యా రాజకీయాల్లో తిరుగులేనినేతగా పుతిన్ మరోమారు నిరూపించుకున్నారు. ఆదివారం నాటి అధ్యక్ష ఎన్నికల ఓటింగ్‌లో ఆయనకు 5.6కోట్ల మంది (76శాతం) మద్దతుగా ఓటేశారు. దీంతో రష్యా అధ్యక్షుడిగా వరుసగా నాలుగోసారి వ్లాదిమిర్ పుతిన్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించారు.

గత 18 ఏండ్లుగా అధ్యక్ష పీఠంపై ఉన్న ఆయన్నే మళ్లీ ప్రజలు ఎన్నుకోవటం బ్రిటన్, అమెరికా మిత్ర దేశాలకు మింగుడుపడని అంశం. ఇప్పటివరకు 70 శాతం ఓట్లు లెక్కించగా, ఇందులో పుతిన్ 76 శాతం ఓట్లు సాధించినట్టు సెంట్రల్ ఎన్నికల కమిషన్ సోమవారం తెలిపింది. దీంతో వరుసగా ఆయన నాలుగోసారి గెలిచి, అధ్యక్ష పీఠాన్ని అధిరోహించనున్నారు. ఈ విజయంతో మరో ఆరేండ్లపాటు..అంటే 2024 వరకు రష్యా అధ్యక్షుడిగా పుతిన్ కొనసాగనున్నారు.

గతంలో సోవియట్ యూనియన్ నాయకుడు జోసెఫ్ స్టాలిన్ మాత్రమే అత్యధిక కాలం అధ్యక్షుడిగా కొనసాగారు. ఈ ఎన్నికల విజయంతో స్టాలిన్ తర్వాత దేశ రాజకీయాల్ని ప్రభావితం చేసిన నాయకుడిగా



పుతిన్ గుర్తింపు అందుకున్నాడు. మొత్తం 10.70 కోట్ల మంది ఓటర్లలో మెజార్టీ ప్రజలు మళ్లీ ఆయన్నే కోరుకున్నట్టుగా ఎన్నికల ఫలితాలు తెలుపుతున్నాయి. అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్‌తోపాటు ఏడుగురు పోటీపడగా, న్యాయపరమైన కారణాలతో ప్రధాన ప్రత్యర్థి అలెక్సీ నావెల్నీ ముందే తప్పుకున్న విషయం తెలిసిందే.

జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యం : పుతిన్

పశ్చిమ దేశాలకు దీటుగా రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తామని, ప్రజల జీవనప్రమాణాలను పెంచడానికి కృషిచేస్తానని ఎన్నికల ప్రచారంలో పుతిన్ వాగ్దానం చేశారు. ఈ విజయంపై పుతిన్ మాట్లాడుతూ.. క్లిష్ట సమయంలో తనపై విశ్వాసం ఉంచి ఓట్లేసి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఐక్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యమని, దేశ భవిష్యత్తు కోసం ఆలోచించాలని పిలుపునిచ్చారు. క్లిష్టసమయంలో తనకు మద్దతుగా నిలిచారని, రష్యా పురోగతి సాధించడానికి పనిచేసే మరో అవకాశం దక్కిందని పుతిన్ వ్యాఖ్యానించారు. తుది సమాచారం మేరకు ఈ ఎన్నికల్లో పుతిన్ 76 శాతం ఓట్లు సాధించగా, సమీప ప్రత్యర్థి కమ్యూనిస్ట్ పార్టీ నేత పావెల్ గ్రుడినిన్ 13 శాతం ఓట్లు దక్కించుకున్నారు. ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులూ అందలేదని 'సెంట్రల్ ఎన్నికల కమిషన్' సోమవారం ఒక ప్రకటన జారీ చేసింది.

చైనా భాషలో జిన్‌పింగ్‌కు శుభాకాంక్షలు



(ఫైల్)

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోడీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ని వినూత్న రీతిలో అభినందించారు. ఇటీవలే ఎన్నికల్లో మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికైన జిన్‌పింగ్‌కు చైనా ట్విట్టర్‌గా పేరుగాంచిన 'సినా విబో' ద్వారా చైనా భాషలో శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల మధ్య బంధాలు మరింత పటిష్టం చేయడానికి ఇరువురం కలిసి పని చేయాలని మోడీ పిలుపునిచ్చారు. జిన్‌పింగ్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగానే పలు సెంట్రల్ బ్యాంకుకు సంబంధించిన పాలసీలను మార్చారు. చైనా పార్లమెంట్ జిన్‌పింగ్‌ను దేశ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

జిన్‌పింగ్ కొత్త మంత్రివర్గం ఏర్పాటు

బీజింగ్ : చైనా దేశ అధ్యక్ష పదవిని రెండోసారి చేపట్టిన జీ జిన్‌పింగ్ కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. వీరిలో చైనా మిస్సైల్ మేన్‌గా పిలిచే లెఫ్టినెంట్ జనరల్ వెరు ఫెంగీ రక్షణ మంత్రిగా నియమితులయ్యారు. జనరల్ వెరు చైనా సత్వర సైనిక ఆధునీకరణ, పునర్వ్యవస్థీకరణలో కీలక పాత్ర పోషించారు. నూతన మంత్రిమండలికి నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి) ఆమోద ముద్ర వేసింది. జిన్‌పింగ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన పాలనాయంత్రాంగంలో భాగంగా ప్రధానిగా లీ క్వెకియాంగ్ తిరిగి నియమితులయ్యారు. ఆయన ప్రతిపాదించిన నలుగురు ఉప ప్రధానులను ఎన్‌సిపి డిప్యూటీలు ఆమోద ముద్ర వేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు కాల పరిమితి వుండరాదని తీసుకువచ్చిన రాజ్యాంగ సవరణకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో జిన్‌పింగ్ తన సన్నిహితుడు, మాజీ అవినీతి నిరోధక చీఫ్ వాంగ్ క్విషన్ ఉపాధ్యక్షుడుగా నియమితులైన సంగతి తెలిసిందే. ఉప ప్రధాని లియూ హీ ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తారని భావిస్తున్నారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి స్టేట్ కౌన్సిలర్‌గా పదోన్నతి కల్పించారు. సంస్కరణవాది యీ గాంగ్‌ను సెంట్రల్ బ్యాంక్ కొత్త గవర్నర్‌గా నియమించారు. చెన్ వెన్‌కింగ్‌ను అంతర్గత భద్రత శాఖలో నియమించారు.

అక్కను కాల్చి చంపిన 9 ఏండ్ల బాలుడు

- **ఘటనకు దారితీసిన పరిణామాలపై అనుమానం : పోలీసులు**

వాషింగ్టన్: అమెరికాలోని మిసిసిపి రాష్ట్రంలో.. వీడియో గేమ్ సందర్భంగా జరిగినట్టుగా భావిస్తున్న గొడవలో తొమ్మిదేండ్ల బాలుడు తుపాకీ కాల్పుల్లో 13ఏండ్ల బాలిక మృతి చెందిందని పోలీసులు తెలిపారు. తన అక్క వీడియో గేమ్ కంట్రోలర్ ఇవ్వటం లేదని ఆగ్రహించిన బాలుడు తుపాకీని తీసుకుని, ఆమె వెనుకవైపు నుంచి కాల్చాడని.. బాలిక తలలోంచి బుల్లెట్ దూసుకెళ్లిందని పోలీసులు చెప్పారు. శనివారం సాయంత్రం ఈ ఘటన జరగ్గా, బాలికను మెంఫిస్ నగరంలోని ఒక ఆస్పత్రిలో చేర్చారు. తీవ్రంగా గాయపడిన బాలిక ఆదివారం మృతి చెందింది. అయితే, 9ఏండ్ల బాలుడు ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందనేది స్పష్టం కాలేదు. "ఆ బాలుడి వయసు తొమ్మిదేండ్లే బహుశా ఏదైనా వీడియో గేమ్‌లోనో సినిమాలోనో (తుపాకీ కాల్పడాన్ని) చూసి ఉండొచ్చని నేను అనుకుంటున్నాను. అసలు దాంతో ఏం జరుగుతుందనేది కూడా అతడికి తెలిసి ఉండకపోవచ్చు. నేను ఏదీ స్పష్టంగా చెప్పలేను. కానీ, జరిగింది మాత్రం విషాదం" అని మొన్రో కౌంటీ షరీఫ్ (పోలీసు అధికారి) సెసిల్ కంట్రెల్ చెప్పారు. ఈ సంఘటన జరిగినప్పుడు వాళ్ల అమ్మ వేరే గదిలో మిగతా పిల్లలకు భోజనం తినిపిస్తోంది. కాగా, ఈ కాల్పులకు దారితీసిన పరిణామాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. అసలు బాలుడికి .తుపాకీ ఎలా అందింది? అన్న అంశంపైనా దృష్టి సారించారు. "ఇది మాకు కొత్త. ఒక చిన్నారి మరొక చిన్నారిపై కాల్పులు జరిపిన కేసును ఇంతకు ముందెన్నడూ మేం చూడలేదు" అని షరీఫ్ కంట్రెల్ వివరించారు.



డెన్మార్కును వణికిస్తోన్న చలి

కోపెన్‌హెగెన్ : డెన్మార్క్ తీర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎన్నడూలేనంతగా కనిష్టస్థాయికి పడిపోయాయి. దీంతో ప్రజలు చలి దెబ్బకు వణికిపోతున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న మంచు వాన, మరోవైపు చలిగాలుల... కారణంగా అనేక ప్రాంతాలు గడ్డకట్టుకుపోతున్నాయి. ఇండ్లును సైతం మంచు ఎలా కప్పేస్తుందో పై ఫొటోలో చూడొచ్చు. తీర ప్రాంత నగరాల్లో ఇలా గడ్డకట్టుకుపోయిన ఇండ్లెన్నో ఉన్నాయి.

బంగ్లా మాజీ ప్రధాని బెయిల్‌పై స్టే



ఢాకా: అవినీతి కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాబేగం బెయిల్‌పై బంగ్లా సర్వోన్నత న్యాయస్థానం నేడు స్టే విధించింది. ఈ కేసులో ఆమెకు ఐదు సంవత్సరాల జైలుశిక్ష విధిం చారు. బెయిల్‌పై విడుదలై ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆమె ఆకాంక్షకు ఎదురుదెబ్బ తగిలింది. జియా ఆనాథ ట్రస్టుకు ఉద్దేశించిన 21మిలియన్ టాకాలు (సుమారుగా రూ.16 లక్షలు) స్వాహా చేసిన కేసులో ఫిబ్రవరి 8న జియాకు శిక్ష పడింది. ఇదే కేసులో ఆమె కుమారుడు తారిక్ రహమాన్, మరో నలుగురికి కూడా 10ఏండ్ల జైలు శిక్ష విధించారు. జియాకు నాలుగు నెలల పాటు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తూ, మార్చి 12వ తేదీన హైకోర్టుకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రధాన న్యాయమూర్తి సయ్యద్ మహమూద్ హుస్సేన్ నేతృత్వంలో అప్పిలేట్ బెంచ్ సోమవారం ఈ బెయిల్‌పై స్టే విధించింది.

ఉపాధ్యాయుడి ప్రయత్నానికి అనూహ్య స్పందన

- **కంప్యూటర్లు లేకుండా నల్లబల్లపై సాఫ్ట్‌వేర్ బోధన**
- **కంప్యూటర్లను పంపి సాయమందించిన భారతీయ కంపెనీ**

అక్రా(ఘనా): కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ గురించి పాఠశాల పిల్లలకు బోధించడానికి ఘనా దేశపు ఉపాధ్యాయుడు పడిన తపనకు తగిన గుర్తింపు దక్కింది. పాఠశాలలో కంప్యూటర్ లేకపోయినా... నల్లబల్లపై కంప్యూటర్, అది పనిచేసే విధానం, దానివెనుకున్న సాఫ్ట్‌వేర్ గురించి ఆ ఉపాధ్యాయుడు చెబుతున్న తీరును అందరూ ప్రశంసించారు. ఆఫ్రికా అనగానే మనకు చీకటి ఖండం అన్న మాటే గుర్తుకు వస్తుంది. ఆ మాటకు తగ్గట్టే అక్కడి దేశాలు చాలా విషయాల్లో వెనకబడే ఉంటాయి. అయితే ఘనాలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడు మాత్రం తమకు సౌకర్యాలు అందుబాటులో లేవని ఆగిపోకుండా తన విద్యార్థులకు సాధ్యమైనంత ఎక్కువ జ్ఞానాన్ని అందించాలని భావించాడు. అందుకు తగ్గట్టే పాఠశాలలో కంప్యూటర్లు లేకపోయినా పిల్లలకు నల్లబల్ల మీదే కంప్యూటర్‌ను ఎలా వాడాలి ? అనే విషయాలు నేర్పించసాగాడు.

పాఠాలు చెప్పే సమయంలో మైక్రోసాఫ్ట్ వర్డ్ విండో బొమ్మను గీశాడు. దాన్ని ఆయన ఫేస్‌బుక్‌లో పోస్ట్





చేశాడు. ఆయన దాన్ని మామూలుగానే పోస్ట్ చేసినా...అది రెండువారాలుగా సామాజిక మాధ్యమాల్లో అందర్నీ ఆకట్టుకుంటోంది. ఉపాధ్యాయుడి ప్రయత్నం భారత్‌కు చెందిన ఓ కంపెనీకి ఎంతో నచ్చింది. వెంటనే ఆ కంపెనీ వారందరూ మాట్లాడుకొని ఏదైనా సాయం చేయాలని భావించారు. "ఆ ఉపాధ్యాయుడి అంకిత భావం మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఒక ఐటీ శిక్షణా కేంద్రాన్ని నడుపుతున్న మేము వారికి ఉపయోగపడేలా ఏదైనా చేయాలనుకున్నాం. అందుకు తగ్గట్టుగా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వారికి ఐదు కంప్యూటర్లు, ఉపాధ్యాయుడికి ఒక ల్యాప్‌ట్యాప్, వాటికి సంబంధించిన పుస్తకాలు అందించాం" అని ఆ భారత కంపెనీ వెల్లడించింది. మన భారత కంపెనీతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మరికొంతమంది కూడా ఆ పాఠశాలకు కంప్యూటర్లు అందించారు. అంతేకాకుండా మైక్రోసాఫ్ట్ ఆఫ్రికా అయితే ఏకంగా సింగపూర్‌లో జరిగే వార్షిక మైక్రోసాఫ్ట్ ఎడ్యుకేటర్స్ ఎక్స్ఛేంజ్ సమావేశానికి ఆహ్వానించింది.

రాష్ట్ర నిర్మాణానికి ఉపయోగపడే బడ్జెట్ కాదు

జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలి

- ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి
- చేనేత, జౌళి ప్రత్యేక బడ్జెట్ పెట్టాలి
- అటవీహక్కుల చట్టం అమలు చేయాలి: బడ్జెట్ ప్రసంగంలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏమాత్రం ఉపయోగపడదని సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య స్పష్టం చేశారు. 2018-19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై శాసనసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన బీసీలు, ఎస్సీ, ఎస్టీ ప్రజల ప్రయోజనాలు ప్రతిఫలించట్లేదని విమర్శించారు.ఉద్యోగ, ఉపాధి రంగాల్ని విస్మరించారని, గిరిజన హక్కుల అమలును మరిచారని చెప్పారు. రాష్ట్రంలో 25వేల బ్యాక్‌లాగ్‌పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాలేదన్నారు. కేరళ రాష్ట్రం 96 శాతం అక్షరాస్యతను సాధిస్తే, తెలంగాణలో 65 శాతం దాటలేదని, అందులోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు మరీ తక్కువగా ఉన్నారని వివరించారు. ప్రయివేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారికి ప్రభుత్వమే భూమి, ఇతర లైసెన్సులన్నీ ఉచితంగా ఇస్తున్నదని గుర్తుచేశారు. రాష్ట్రంలో 52 శాతం జనాభా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం రూ.5,900 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది ఏమాత్రం సరిపోదని చెప్పారు. ఎమ్‌బీసీలకు 2017-18 బడ్జెట్‌లో రూ. వెయ్యి కోట్లు కేటాయించి, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. తిరిగి 2018-19లో వారికి మళ్లీ రూ.వెయ్యి కోట్లు కేటాయించారని, అయితే గత బడ్జెట్‌లో ఖర్చు చేయని నిధులను కూడా కలిపి వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.రెండువేల కోట్లు ఖర్చు చేయాలని సూచించారు. చేతివృత్తుల ఆధునీకరణ జరగలేదని, చేనేత, జౌళికి సంబంధించి



ప్రత్యేక బడ్జెట్ పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 10 శాతం గిరిజనులు ఉన్నారని, అనేక త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న అటవీహక్కుల చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయట్లేదని విమర్శించారు. భద్రాచలం, ఉట్నూరు ఐటీడీఏల్లో ఐఏఎస్‌లు లేరని, వాటిని జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించలేకపోతున్నారని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

గత శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఐటీడీఏల్లో ఐఏఎస్‌లను నియమిస్తామని స్వయానా సీఎం కేసీఆర్ శాసనసభలో ప్రకటించారని, ఆరునెలలు దాటినా ఇప్పటికీ ఆచరణలోకి రాలేదన్నారు. గవర్నర్ ప్రసంగం, ప్రభుత్వ బడ్జెట్‌లో ఎక్కడా అటవీ హక్కుల చట్టం ఊసేలేదని, గిరిజనులపై ఫారెస్టు అధికారుల వేధింపులు అధికమయ్యాయని చెప్పారు. ఈ వేధింపుల భరించలేకే ఇటీవల వెంకన్న అనే గిరిజనుడు ఆత్మహత్య కూడా చేసుకున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎకరాకు రూ.4వేల పథకాన్ని గిరిజనులకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా భూమిని సాగుచేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన దళితులకు మూడెకరాల భూమి అమల్లో వైఫల్యం చెందిందని, నాలుగేండ్లలో కేవలం 4,900 కుటుంబాలకు 12,700 ఎకరాలు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నదని, రైతులకు గిట్టుబాటు ధర లభించట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్, జయతీఘోష్ నివేదికలను అమలు చేయాలని కోరారు. ఉపాధిహామీ చట్టంలో పనిదినాలు పెంచి, వారి వేతనాలను రూ.300కు పెంచాలని డిమాండ్ చేశారు. మేట్లను తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని, ప్రస్తుత విధానాన్నే అమలు చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఉండబోవని ప్రభుత్వం ప్రకటించిందని, అమల్లో మాత్రం ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. గ్రామపంచాయతీ వర్కర్లకు కేవలం రూ.వెయ్యి-రూ.1,500 వేతనాలు ఇస్తున్నారని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనాన్ని వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని కోరారు. వికలాంగులకు 3 శాతం రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, ప్రభుత్వం చెప్తున్న 'షీ టీమ్స్' హైదరాబాద్‌కే పరిమితమయ్యాయని అన్నారు. మిషన్ భగీరథ గ్రామ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉన్నదని, అది పూర్తి కావడానికి మరో ఆరునెలల సమయం పడుతుందని, తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని అప్పటి వరకు ప్రస్తుత పథకాలను అమలు చేయాలని సూచించారు. మిషన్ కాకతీయ క్రింద చెరువుల్లో పూడిక తీశారని, అదే సమయంలో స్వల్ప వ్యయంతో పూర్తయ్యే ప్రాజెక్టుల్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. బోడిగుంట, గుండ్లవాగు, దుమ్ముగూడెం ఎత్తిపోతలు సహా చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. బహుళజాతి పురుగుమందుల కంపెనీల సంఖ్య విపరీతంగా పెరిగిందని, తక్షణం విత్తన చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పథకాన్ని 14 లక్షల మంది కౌలు రైతులకు కూడా వర్తింప చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నీరాను ప్రవేశపెట్టండి

- ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


కల్లుగీత కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నీరాను ప్రవేశపెట్టాలని టీఆర్ఎస్ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. నీరా ఆరోగ్యకరమైన పానీయమా? కాదా? అని ప్రశ్నించారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా నీరా పరిశ్రమ ఏర్పాటుపై ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇంతకు నీరా పరిశ్రమ ఏమైనట్టు అని ప్రశ్నించారు. నీరాలో ఔషధ గుణాలు ఉన్నా దానిని ప్రవేశపెట్టడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. శీతలపానియాల్లో విష మూలికలు ఉన్నా వాటి గురించి జోరుగా ప్రచారం జరుగుతున్నదనీ, నీరాలో ఎలాంటి విష మూలికలు లేకున్నా ఎందుకు ప్రచారం చేపట్టకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 15 లక్షల మంది తాటి, ఈత చెట్లపై ఆధారపడి బతుకుతున్నారని చెప్పారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా చెట్లను విచ్చలవిడిగా నరుకుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చెట్ల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో సొసైటీకి 5 ఎకరాల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

అసెంబ్లీ తర్వాత అధ్యయనం - మంత్రి పద్మారావు

రాష్ట్రంలో నీరా పరిశ్రమను ప్రవేశపెట్టడానికి అసెంబ్లీ సమావేశాల అనంతరం అధ్యయనం చేపట్టనున్నట్టు ఆబ్కారీ శాఖ మంత్రి పద్మారావు సమాధానం ఇచ్చారు. నీరా పరిశ్రమ ఏర్పాటుపై ఇప్పటికే దృష్టి సారించామని, నీరా ఉత్పత్తి, వినియోగంపై శ్రీలంక, కాంబోడియాలో పర్యటించి పరిశీలిస్తామన్నారు. తాటి చెట్లను నరికి వేస్తే శిక్ష పెంచే అంశంపై పరిశీలిస్తున్నామన్నారు.

కొత్త మండలాల్లోనూ గోడౌన్ల నిర్మాణం


- మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన మండలాల్లో అవసరాన్ని బట్టి గోడౌన్లను నిర్మిస్తామని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కొత్త గోడౌన్ల నిర్మాణాలకు సంబంధించి నాబార్డు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.1024 కోట్లతో 364 గోడౌన్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. త్వరలోనే రూ.818 కోట్లతో 18.30 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్లను ఒక సంవత్సరంలో పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అన్ని మండల కేంద్రాల్లో గోదాముల నిర్మాణాలు చేపడుతామని తెలిపారు.


స్కూల్ అసిస్టెంట్‌ల సమస్యలు పరిష్కరిస్తాం : ఉప ముఖ్యమంత్రి కడియం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్కూల్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి శాసన మండలిలో తెలిపారు. సోమవారం సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా అన్నారు. స్కూల్ అసిస్టెంట్ల పదోన్నల విషయం కోర్టు పరిధిలో ఉందని తెలిపారు. ఈ విషయమై పలువురు ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.


కొత్త చట్టంతో గ్రామపంచాయతీలు పటిష్టం : మంత్రి జూపల్లి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంచాయతీరాజ్ కొత్త చట్టం వచ్చిన తరువాత గ్రామ పంచాయతీలను మరింత బలోపేతం చేస్తామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. గ్రామ పంచాయతీలకు కేంద్రం నిధులను మంజూరు చేయకపో వడంతో రాష్ట్రమే భరిస్తున్నద న్నారు. బీఆర్‌జీఎఫ్ నిధులు నిలిచిపోవడంతో ముఖ్యమంత్రి చొరవ తీసుకొని పంచాయతీ రాజ్‌కు బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించారని తెలిపారు.

పాస్ పుస్తకాల ఆధారంగా రైతులకు చెక్కులు : మంత్రి పోచారం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులకు పెట్టుబడి సహాయ పథకంలో భాగంగా పాస్ పుస్తకాల ఆధారంగా చెక్కులు పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి మే చివరి నాటికి ఏడాదికి రెండు పంటల చొప్పున మొత్తం రూ.8 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. పాత అప్పులు ఉంటే బ్యాంకుల నుండి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బేరర్ చెక్కులను అందజేస్తామని అన్నారు. హార్టికల్చర్ క్రాప్ రైతులకు కూడా ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. బ్యాంకుల్లో కరెన్సీ కొరత లేకుండా చూడాలని ఇప్పటికే కేంద్రాన్ని సంప్రదించామని తెలిపారు. సోమవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. భూ ప్రక్షాళనలో పార్ట్-ఏ కింద 96 శాతం రైతులను, పార్ట్-బీ కింద 4 శాతం రైతులను గుర్తించామన్నారు. పార్ట్ ఏలో 72 లక్షల 13 వేల 111 మంది రైతులు ఉన్నారని స్పష్టం చేశారు.

అప్పుల కుప్పలో ధనిక రాష్ట్రం : ఎమ్మెల్సీ రాంచందర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధనిక రాష్ట్రమైన తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.1.74 లక్షల కోట్లు ఎన్నికల బడ్జెట్‌గా అభివర్ణించారు. శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితులకు మూడెకరాలు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం 9 వేల కుటుంబాలకు మాత్రమే ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది దళితులు ఉన్నారని వీరందరికీ ఎప్పుడు భూ పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే నాలుగేండ్లు గడిచిపోయాయని, ఒక్క ఏడాదిలో అందరికీ మూడెకరాలు ఇవ్వడం ఎలా సాధ్యమో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో 30 శాతం మంది దళితులు వ్యవసాయంపై ఆధారపడ్డారని గుర్తుచేశారు. ఇక డబుల్ బెడ్ రూం పథకంలో భాగంగా ప్రభుత్వం 2.75 లక్షల ఇండ్లు కట్టిస్తామని ప్రకటించిందని, ఇప్పటి వరకు కేవలం 9 వేలలోపే నిర్మించిందన్నారు. బడ్జెట్‌లోనూ ఇండ్లకు నిర్మాణాలకు అనుగుణంగా నిధులు కేటాయించలేదని కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే ఇస్తామని ప్రకటించిందని ఎంతవరకు సమంజసమని అన్నారు. ఈ నిధులతో ఇండ్ల నిర్మాణం ఎలా సాధ్యమో ప్రశ్నించారు. యూనివర్సిటీల్లో చదువుతున్న విద్యార్థుల వల్లే తెలంగాణ వచ్చిందని.. అలాంటి యూనివర్సిటీలకు బడ్జెట్‌లో నిధులు అరకొర కేటాయించారని విమర్శించారు. గురుకులాల పాఠశాలల్లో టీచర్ల నియామకం జరగలేదన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర రాకపోవడం వల్లే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోగా ఉన్న వాటిని రద్దు చేస్తున్నారని, అందువల్ల దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలందరికీ కార్డులు మంజూరు చేయాలన్నారు. టూరిజం అభివృద్ధిలో రాష్ట్రం వెనుకబడి ఉందని కేరళను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో కొత్తగా హరిత హెూటళ్లను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.



నవచిత్రం



వెండితెరపై అద్భుత సృష్టి


'మహానటి' చిత్రంలో కీర్తి సురేష్

అలనాటి మేటినటి నటి సావిత్రి జీవితంపై 'మహానటి' చిత్రం రూపొందుతున్న విషయం విదితమే. సావిత్రి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తుండగా, నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా పతాకాలపై ప్రియాంకా దత్ నిర్మిస్తున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని విడుదల తేదీని ప్రకటించింది చిత్ర బృందం. ఈ సందర్భంగా నిర్మాత ప్రియాంక దత్ మాట్లాడుతూ, 'ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మే 9న సినిమాను ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం. 1990 మే 9న వైజయంతీ మూవీస్ సంస్థ నుంచి వచ్చిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' టాలీవుడ్ రికార్డుల్ని తిరగరాస్తూ కొత్త చరిత్ర సృష్టించింది. సరిగ్గా అదే రోజున ఈ చిత్రం విడుదలవుతుండటం విశేషం. టాలీవుడ్‌లోని ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ సినిమా ఇదివరకు తెలుగు ప్రేక్షకులకు చూడని వినోదాన్ని పంచనుంది. సావిత్రి జీవిత కథని వెండితెరపై దర్శకుడు ఆవిష్కరించిన తీరు తెలుగు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఉంటుంది' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె.మేయర్, కళా దర్శకుడు: అవినాష్, కెమెరా: ధని, ఆర్ట్: తోట తరణి.

అలా రాకపోతే అన్యాయం జరిగినట్టే..

'రంగస్థలం' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకలో మెగాస్టార్


ఆది, రవిశంకర్, మోహన్, నవీన్, చిరంజీవి, రామ్‌చరణ్, సమంత, దేవిశ్రీప్రసాద్, సుకుమార్, చంద్రబోస్ తదితరులు

'నాకు 'ఖైదీ' ఎలాగో, రామ్‌చరణ్‌కు 'రంగస్థలం' స్టార్ స్టేటస్‌ను పెంచే చిత్రమవుతుంది, చరణ్ కెరీర్‌లో తలమానికమైన సినిమాగా నిలుస్తుంది' అని చిరంజీవి అన్నారు. రామ్‌చరణ్, సమంత జంటగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీస్ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, మోహన్(సీవీఎం) సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'రంగస్థలం'. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం వైజాగ్‌లో వైభవంగా జరిగింది.

ఈ సందర్భంగా అతిథిగా విచ్చేసిన చిరంజీవి మాట్లాడుతూ, 'నిర్మాతలు విజయవంతమైన సినిమాలు చేసి వారికంటూ ఓ బ్యానర్ వ్యాల్యూను ఏర్పర్చుకున్నారు. ప్రతి హీరో కూడా వారితో సినిమాలు చేయాలను కుంటున్నారంటే వాళ్ళు ఎంత మంచి నిర్మాతలో అర్థం చేసుకోవచ్చు. దేవిప్రసాద్, త్రివిక్రమ్ రావు, అశ్వనీదత్, అల్లు అరవింద్ వంటి స్టార్ నిర్మాతల స్థాయి నిర్మాతలు మైత్రీ మూవీ మేకర్స్. ఈ సినిమా వారికి హ్యాట్రిక్ హిట్ అవుతుందనడంలో సందేహం లేదు. దర్శకుడు సుకుమార్ అద్భుతమైన పనితనాన్ని చూపించారు. నాకు తను కథ ఎలా చెప్పాడో, అంతే ప్యూర్‌గా ఎమోషనల్‌గా తెరకెక్కించాడు. విలేజ్ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఫస్ట్‌సీన్ నుంచి లాస్ట్ సీన్ వరకు ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. సినిమా చూశా. నేను చాలా ఎంజాయ్ చేశా. ప్రేక్షకులందరినీ అలరిస్తుంది. చరణ్ నటుడిగా ఎదిగే సినిమా ఇది. చరణ్‌తో సుకుమార్ ఇంత మంచి సినిమా చేసినందుకు నటుడిగా ఈర్ష్య పడుతున్నా, తండ్రిగా గర్వపడుతున్నా. ఓ కన్విక్షన్‌తో సినిమాలోని పాటలను తెరకెక్కించారు. ఎక్కడా గ్లామర్‌కు పోకుండా అత్యంత సహజంగా రూపొందించారు. హీరో పాత్రను డీ గ్లామరైజ్ చేయించి, చరణ్ కెరీర్‌లో ఓ తలమానికమైన సినిమాను చేసిన సుకుమార్‌కు అభినందనలు. సినిమా క్రెడిట్ అంతా ఆయనదే. దేవిశ్రీ ప్రసాద్ అద్భుతమైన బాణీలను అందించారు. నాలుగు రోజుల్లో అంత మంచి సాంగ్స్ ఇచ్చాడని తెలిసి ఆశ్చర్యపోయా. చంద్రబోస్ నేటివిటికి తగ్గట్టుగా అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. రత్నవేలు ప్రతి సన్నివేశాన్ని అత్యద్భుతంగా చిత్రీకరించారు. రామకృష్ణ, మోనిక సెట్స్ బాగా వేశారు. ఆ సెట్ రియల్ లొకేషన్‌లా అనిపించింది. తనకు ఈ సినిమాతో అవార్డులు ఖాయం. ఈ సినిమా ప్రజలను ఆకట్టుకోవడమే కాదు, అన్ని విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుంటుంది. జాతీయ స్థాయిలో కూడా అవార్డు వచ్చినా ఆశ్చర్యం లేదు. జాతీయ అవార్డు రాకుంటే అన్యాయం జరిగినట్టే అవుతుంది. అలాగే ఈ ఏడాదిలో అద్భుతమైన సినిమా అవుతుందని కోరుకుంటున్నా' అని అన్నారు.

'నిర్మాతలు రాజమండ్రిలో షూటింగ్ సమయంలో దాదాపు 500 మంది ఉండటానికి కావాల్సిన వసతులన్నీ ఏర్పాటు చేసి కంఫర్ట్‌గా ఉంచారు. రత్నవేలు ఓ ఊరుని ఎంతో అందంగా చూపించాలో అంత అందంగా చూపించారు. రామ్‌లక్ష్మణ్ ఎమోషన్స్‌తో ఫైట్స్ కంపోజ్ చేశారు. నాన్నగారు నాలుగైదు సార్లు నెల్లూరికి తీసుకెళ్ళారు. 'ఆపద్బాంధవుడు' సినిమా జరుగుతున్నప్పుడు పూడిపల్లి గ్రామానికి తీసుకెళ్ళారు. ఆ తర్వాత నేనెప్పుడూ అక్కడికి వెళ్ళలేదు. ఈ సినిమాతో సుకుమార్ నా కోరిక తీర్చాడు. సమంతతో నటించేటప్పుడు ఎనర్జీ వస్తుంది. దేవిశ్రీప్రసాద్ అద్భుతమైన సంగీతాన్ని ఇచ్చాడు. ఆయనతో చేసిన రెండో చిత్రమిది. చంద్రబోస్ అందరికీ అర్థమయ్యే రీతిలో సాహిత్యాన్ని అందించారు. ఇంత మంచి సినిమాకు కారణమైన సుకుమార్‌కు హ్యాట్సాఫ్. నాకే ఓ కొత్త చరణ్‌ని చూపించాడు. సుకుమార్ వల్ల నాపై నాకే గౌరవం పెరిగింది. గడ్డం లుక్, లుంగీని బాగా ఎంజాయ్ చేశాను. మా అమ్మానాన్నలతోపాటు ఫ్యాన్స్ గర్వపడే సినిమా ఇది' అని రామ్‌చరణ్ తెలిపారు.

సుకుమార్ మాట్లాడుతూ, 'చిరంజీవి ఈ సినిమా చూసి ఎంతో బాగా ప్రశంసించారు. నిర్మాతలు మా టీమ్‌ను బాగా చూసుకున్నారు. రత్నవేలు సినిమాటోగ్రఫీ కారణంగా నేను మంచి దర్శకుడిని కాగలిగాను. దేవిశ్రీ ప్రసాద్ సిచ్యువేషన్ విని, కేవలం మూడున్నర రోజుల్లోనే గొప్ప మ్యూజిక్ అందించారు. నా ఎమోషన్స్‌ను చక్కగా క్యారీ చేశాడు. సమంతతో లైఫ్‌లాంగ్ సినిమాలు చేయాలని ఉంది. రామకృష్ణ వేసిన సెట్ మనకు కనపడదు. అంత బాగా వేశాడు. తనకు నేనే ఓ అవార్డును క్రియేట్ చేసి ఇవ్వాలనుకుంటున్నాను. చిట్టిబాబు పాత్రలో ఒదిగిపోయేందుకు చరణ్ ఎక్కువ టైమ్ తీసుకోలేదు. చరణ్ నటన చూసి మేమేకాదు, ప్రకాష్ రాజ్ లాంటి నటుడు కూడా క్లాప్స్ కొట్టాడంటే తను ఎలా ఒదిగిపోయాడో అర్థం చేసుకోవచ్చు' అని అన్నారు. 'సినిమా బాగా రావడానికి సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికి థ్యాంక్స్. ఈ నెల 30న సినిమాను గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం' అని నిర్మాతలు తెలిపారు.

ఆప్లా మనుస్ రీమేక్‌లో..!


కరీనా కపూర్

అందం, అద్భుతమైన అభినయంతో బాలీవుడ్ ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసిన కథానాయికల్లో కరీనా కపూర్‌ది ఓ ప్రత్యేక స్థానం. ఓ పక్క కమర్షియల్ చిత్రాల్లో నటిస్తూనే, స్టార్ డమ్‌ని లెక్క చేయకుండా ప్రయోగాత్మక చిత్రాల్లోనూ నటించింది. తల్లిగా మారిన తర్వాత చాలా సెలెక్టీవ్‌గా సినిమాలను ఎంపిక చేసుకుంటోంది. ప్రస్తుతం 'వీర్ ది వెడ్డింగ్' చిత్రంలో నటిస్తున్న కరీనా తాజాగా ఓ మరాఠి రీమేక్ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. అజయ్‌దేవగన్, నానాపటేకర్ సంయుక్తంగా మరాఠిలో నిర్మించిన చిత్రం 'ఆప్లా మనుస్'. ఈ చిత్రాన్ని హిందీలో నిర్మించేందుకు అశుతోష్ గోవారికర్ సన్నాహాలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతంలో నివసించే ఓ జంట మానవ సంబంధాలను అర్థం చేసుకోవడానికి పడే వేదనతోపాటు అనుకోకుండా జరిగిన ఓ సంఘటన ఈ జంట జీవితాన్ని ఎటువంటి మలుపు తిప్పిందనే ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రం కరీనాకు బాగా నచ్చటంతో రీమేక్‌లో నటించేందుకు పచ్చజెండా ఊపినట్టు తెలుస్తోంది.

స్ట్రాంగ్ కంటెంట్..


విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతున్న నూతన చిత్రం 'టాక్సీవాలా'. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో జీఏ2, యువి పిక్చర్స్ పతాకాలపై ఎస్.కె.ఎన్ నిర్మిస్తున్న చిత్రమిది. ప్రియాంక జవాల్కర్, మాళవికా నాయర్ కథానాయికలు. త్వరలో చిత్ర ఫస్ట్‌లుక్ విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, 'విజయ్ దేవరకొండకి ఉన్న క్రేజ్, పాపులారిటిని దృష్టిలో పెట్టుకుని ఈ కథను దర్శకుడు తయారు చేశారు. దానికి తగ్గట్టుగానే అన్ని వర్గాల్ని ఎంటర్‌టైన్ చేసే విధంగా హీరో పాత్రను డిజైన్ చేశారు. విజయ్ మ్యానరిజమ్స్, బాడీ లాంగ్వేజ్, క్యారెక్టరైజేషన్ ఆడియెన్స్‌ని మెస్మరైజ్ చేస్తాయి. దర్శకుడు రాహుల్ టేకింగ్, సుజిత్ విజువల్స్, జేక్స్ మ్యూజిక్, కృష్ణకాంత్ లిరిక్స్, జాషువా స్టంట్స్ ఈ చిత్రంలో హైలైట్‌గా నిలుస్తాయి. విజయ్ దేవరకొండ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుందీ చిత్రం. స్ట్రాంగ్ కంటెంట్, ఆర్టిస్టుల నటనను దృష్టిలో పెట్టుకుని సినిమాను గ్రాండియర్‌గా నిర్మిస్తున్నాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ నెల 23న చిత్ర ఫస్ట్‌లుక్‌ను, మే 18న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా సినిమాను విడుదల చేయనున్నాం' అని అన్నారు. కళ్యాణి, మధునందన్, సిజ్జు మీనన్, రవిప్రకాష్, రవివర్మ, ఉత్తేజ్, విష్ణు ఇతర పాత్రలు పోషిస్తున్నారు.

ఇమేజ్ కంటే భిన్న సినిమాలే ఇష్టం..


శ్రీవిష్ణు

'మాస్ హీరోగా ఎదగడం అంత ఈజీ కాదు. నాకు స్టార్ ఇమేజ్ కంటే డిఫరెంట్ చిత్రాలు చేయడమే ఇష్టం' అని అంటున్నారు శ్రీవిష్ణు. నూతన దర్శకుడు వేణు ఊడుగుల దర్శకత్వంలో శ్రీవిష్ణు నటించిన చిత్రం 'నీది నాదీ ఒకే కథ'. ఈ నెల 23న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో సోమవారం శ్రీవిష్ణు మీడియాతో ముచ్చటించారు. 'స్టూడెంట్స్ లైఫ్‌ను, చదువయ్యాక ఏం చేయాలనే సందిగ్ధాన్ని తెలిపే చిత్రమిది. కాలేజ్ చదువుల నుంచి సెటిల్ అయ్యేంత వరకు ఎలాంటి స్ట్రగుల్స్ ఉంటాయనేది చూపించాం. డిగ్రీకి, ఇంజనీరింగ్‌కు ఉన్న తేడాలను మనం చూస్తుంటాం. అవన్నీ ఈ చిత్రంలో ఉంటాయి. బిబిఏ పాస్ అయ్యేందుకు నేను నానా తంటాలుపడుతుంటాను. నచ్చిన పనిని చేయనివ్వరు. సమాజం కోసం మనకు నచ్చకపోయినా కొన్ని పనులను చేయాల్సి వస్తుంటుంది. ఈ క్రమంలో ప్రేమ, ఎమోషన్స్ ఆకట్టు కుంటాయి. గ్రామీణ వాతావరణంలో చాలా సహజంగా సినిమా సాగుతుంది. వేణు నూతన దర్శకుడైనా చాలా బాగా తెరకెక్కించారు. దర్శకుడు దేవి ప్రసాద్ నాకు తండ్రిగా నటించారు. ఇందులో యూత్ నా పాత్రకు కనెక్ట్ అయితే, పెద్దలు తండ్రి పాత్రకు కనెక్ట్ అవుతారు. ఈ సినిమాను 'డాగ్ మి 95' థియరీ ప్రకారం రూపొందించాం. తక్కువ బడ్జెట్‌లో సినిమా చేయడమే 'డాగ్ మి 95' థియరీ. ఈ సినిమా కనెక్ట్ అయితే నెక్ట్స్ అందరూ ఇలాంటి కాన్సెప్ట్‌నే ఫాలో అవుతారు. ప్రస్తుతం 'వీరభోగ వసంతరాయలు', 'తిప్పర మీసం'తోపాటు మరో పోలీస్ స్టోరీలో నటిస్తున్నాను. 'వీరభోగ వసంతరాయలు' నాలుగు పాత్రల చుట్టూ తిరుగుతుంది. నేను, నారా రోహిత్, సుధీర్‌బాబు, శ్రియా నటించాం. అందులో నా పాత్రలో విభిన్న కోణాలు, గెటప్స్ ఉంటాయి. నేను ఏ సినిమా చేసినా ప్రయోగాత్మకంగా, డిఫరెంట్‌గా ఉండేలా చూసుకుంటాను. స్టార్ స్టేటస్ కంటే భిన్నమైన సినిమాలు చేయడమంటేనే ఇష్టం. ఇమేజ్ బేస్డ్, కమర్షియల్ సినిమాలు నాకు ఎక్కువ. పైగా మావన్ని చిన్న బడ్జెట్ చిత్రాలే. పెద్ద సినిమాల ప్రమోషన్‌కు ఖర్చుపెట్టే డబ్బుతో మా సినిమా తీసేస్తాం. అందుకే ప్రమోషన్ విషయంలోనూ కాస్త తక్కువగానే ఉంటుంది' అని శ్రీవిష్ణు చెప్పారు.

హౌస్‌ఫుల్ 4లో..!


కైరా అద్వానీ

'ఫగ్లీ' చిత్రంతో బాలీవుడ్‌లోకి కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన కైరా అద్వాని 'ఎం.ఎస్.ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీ' చిత్రంతో ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ప్రస్తుతం తెలుగులో మహేష్ సరసన 'భరత్ అనే నేను'లో నటిస్తున్న కైరా తాజాగా బాలీవుడ్‌లో ఓ బంపర్ ఆఫర్ అందుకుంది. సక్సెస్‌ఫుల్ సిరీస్‌లో ఒకటైన 'హౌస్‌ఫుల్ 4'లో ఒక కథానాయికగా ఎంపికైంది. అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, రితేష్ దేశ్‌ముఖ్, బాబీ డియోల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో కైరా నటించనుంది. ఇతర నాయికలుగా జాక్వెలిన్ ఫెర్నాండేజ్, కృతి సనన్ నటిస్తున్న విషయం విదితమే. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్ళనున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది దీపావళి కానుకగా విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. కైరా ప్రస్తుతం 'భరత్ అనే నేను'తోపాటు 'బాంబే టాకీస్ 2' చిత్రంలోనూ నటిస్తుంది. దీంతోపాటు బోయపాటి శ్రీను, రామ్ చరణ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రంలోనూ కైరా కథానాయికగా ఎంపికైందని సమాచారం.

ఎడిటర్ అనిల్ మల్నాడ్ కన్నుమూత


అనిల్ మల్నాడ్

ప్రముఖ సీనియర్ ఎడిటర్ అనిల్ మల్నాడ్ కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. పెద్ద వంశీ దర్శకత్వం వహించిన చాలా చిత్రాలను ఎడిట్ చేసిన మల్నాడ్ 9 భాషల్లో దాదాపు 200 చిత్రాలకు పని చేశారు. అంతేకాదు మ్యూజికల్ హిట్ 'సితార' చిత్రానికి 1984లో జాతీయ ఉత్తమ ఎడిటర్‌గా అవార్డునందుకున్నారు. 'మంత్రిగారి వియ్యంకుడు', 'అన్వేషణ', 'లేడీస్ టైలర్', 'సంకీర్తన', 'మహర్షి', 'స్వరకల్పన', 'పెళ్ళిపుస్తకం', 'షో', 'ఆలాపన', 'పుతుక్కోటైలెరెంతు సరవనన్', 'దేవతయి కండెన్', 'కిజక్కు కడర్కారై సాలై, 'పెరరసు' వంటి భిన్న భాషా చిత్రాలకు ఎడిటర్‌గా పని చేసిన మల్నాడ్‌కు భార్య, కూతురు, కుమారుడున్నారు.

అలరించే కమర్షియల్ ఎంటర్‌టైనర్


జె.డి.చక్రవర్తి, అక్షిత

'అమ్మ' రాజశేఖర్ దర్శకత్వంలో జె.డి.చక్రవర్తి నటిస్తున్న సినిమా 'ఉగ్రం'. నక్షత్ర మీడియా పతాకంపై ఖాసి సమర్పణలో 'నక్షత్ర' రాజశేఖర్ నిర్మిస్తున్న ఈ చిత్ర ఫస్ట్‌లుక్ ఉగాది పండుగని పురస్కరించుకుని ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జె.డి.చక్రవర్తి మాట్లాడుతూ, 'నిర్మాతలు కష్టపడి, ఇష్టపడి సినిమాను నిర్మిస్తున్నారు. వారికి, నాకు మంచి పేరు తీసుకొచ్చే చిత్రమవుతుందని ఆశిస్తున్నాం. ఆర్.పి, చమ్మక్ చంద్ర పాత్రలు సూపర్బ్‌గా వచ్చాయి. సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'ఉగాది షడ్రుచుల సమ్మేళనం. అలాగే మా సినిమాలో కూడా నవరసాలుంటాయి. మేం అనుకున్న దానికంటే సినిమా చాలా బాగా వచ్చింది. అందుకు నా గురువు జె.డి.చక్రవర్తి ప్రధాన కారణం. ఆయన పాత్ర చాలా బాగా వచ్చింది. ఈ సినిమా 'రణం' తర్వాత నాకు సెకండ్ ఇన్నింగ్స్ అవుతుంది' అని దర్శకుడు 'అమ్మ' రాజశేఖర్ తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన జెడీ చక్రవర్తి మరో శక్తివంతమైన పాత్ర పోషిస్తున్న చిత్రమిది. ఆయన కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుంది. యూత్‌ను ఆకట్టుకునే విధంగా మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కించారు. యాక్షన్‌కు, నేపథ్య సంగీతానికి మంచి స్కోప్ ఉంటుంది. దర్శకుడి ఊహకి సినిమాటోగ్రాఫర్స్ అంజి, ఎస్.ముజీర్ మాలిక్ ప్రాణం పోశారు. కమర్షియల్ చిత్రాలను ఇష్టపడే ప్రేక్షకులకి మా చిత్రం ఓ ఫీస్ట్‌లా ఉండబోతోంది. షూటింగ్ పూర్తయ్యింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి వేసవిలో సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు.


హీరో జీవాతో 'ఒకటే లైఫ్' చిత్ర బృందం

ఒకటే లైఫ్ హ్యాండిల్ విత్ కేర్..

జితన్ రమేష్, శృతి యుగల్ హీరోహీరోయిన్లుగా ఎం.వెంకట్ దర్శకత్వంలో లార్డ్‌వెంకటేశ్వర ఫిల్మ్స్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మిస్తున్న చిత్రం 'ఒకటే లైఫ్'. 'హ్యాండిల్ విత్ కేర్' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను యువ హీరో జీవా సూపర్‌గుడ్ ఫిల్మ్స్ ఆఫీస్‌లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'పోస్టర్ చాలా ఆసక్తికరంగా ఉంది. సరికొత్త కథ, కథనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోవాలని కోరుకుంటున్నా. చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్' అని అన్నారు. 'టెక్నాలజీ మాయలో పడిన నేటి యువతకు హ్యూమన్ రిలేషన్స్, ఎమోషన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్న కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న చిత్రమిది. సూపర్‌గుడ్ అధినేత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా ఈ చిత్రాన్ని రూపొందించడం హ్యాపీగా ఉంది. సినిమా చాలా బాగా వస్తోంది. మంచి సినిమా చూశామన్న అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది' అని దర్శకుడు వెంకట్ తెలిపారు. నిర్మాత నారాయణ్ రామ్ మాట్లాడుతూ, 'ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేసిన జీవాకు థ్యాంక్స్. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. మంచి కథ, కథనం, సంగీతంతో రూపొందుతున్న ఈ చిత్రం మా అందరికీ మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాం. ఆదరించాలని కోరుకుంటున్నా' అని చెప్పారు.


యాక్షన్ థ్రిల్లర్..

శేఖర్ వర్మ, వివియా, విధ్య హీరోహీరోయిన్లుగా సతీష్ రేగెళ్ళ దర్శకత్వంలో దత్తాత్రేయ ఎంటర్‌టైన్‌మెంట్స్, గాయత్రి ప్రొడక్షన్స్ పతాకాలపై కె.ఎన్.రావు, టి.వి.వి. ఎస్.ఎన్.వర్మలు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'నివాసి'. ఉగాది సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, "శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట' లాంటి ఫ్యామిలీ ఎమోషనల్ చిత్రంలో, బాలకృష్ణ 'జై సింహ'తో ఓ పాత్రలో నటించి ప్రతి ప్రేక్షకుడిని ఆకట్టుకున్న శేఖర్ వర్మ హీరోగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు హ్యాపీగా ఉంది. ఫ్యామిలీ, యాక్షన్ థ్రిల్లర్‌గా నిర్మిస్తున్న చిత్రమిది. ఇప్పటికే చిత్ర షూటింగ్ 70శాతం పూర్తి చేసుకుంది. చివరి షెడ్యూల్‌ను ఏప్రిల్‌లో పూర్తి చేస్తాం' అని అన్నారు.


'నివాసి' చిత్రంలో శేఖర్ వర్మ

ఆరువారాలు ఆగండి

- హైకోర్టు మధ్యంతర ఆదేశాలు
- కోమటిరెడ్డి, సంపత్‌లకు ఊరట
- స్వామిగౌడ్‌పై దాడికి చర్యలు తీసుకోలేదు : ఏజీ
- తాము సభా గౌరవాన్ని కాపాడాం : పిటిషనర్లు
- విచారణ 27 కి వాయిదా



హైదరాబాద్,(లీగల్)

కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్ఏ సంపత్‌కుమార్‌ల శాసనసభ్యత్వాల రద్దు నిర్ణయంలో ఆరు వారాలపాటు ఏ విధమైన చర్యలు తీసుకోరాదని ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. తెలంగాణ న్యాయ, శాసనవ్యవహారాల శాఖ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం చర్యలు తీసుకోరాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తి బి.శివశంకరరావు ఆదేశించారు. సభ్యత్వాల రద్దుపై సోమవారం ఉమ్మడి హైకోర్టులో విచారణ చేపట్టింది. శాసనసభ ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తున్న సమయంలో హెడ్‌ఫోన్‌ను విసిరినప్పుడు శాసన మండలి చైర్మెన్ స్వామిగౌడ్‌కు తగిలి గాయపడ్డారని, అందుకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వారిద్దరి శాసనసభ్యత్వాలను శాసనసభ స్పీకర్ రద్దు చేశారు. ఈ నిర్ణయాన్ని కోమటిరెడ్డి, సంపత్‌లు సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన కేసులో వారికి తాత్కాలిక ఊరట లభించింది. హెడ్‌ఫోన్ విరిసినప్పుడు గాయపడ్డాననే మండలి చైర్మెన్ స్వామిగౌడ్ ఆరోపణల్లో వాస్తవం లేదని, గవర్నర్‌తో కలిసి ఉండగా స్వామిగౌడ్ మాట్లాడారని, గవర్నర్‌కు వీడ్కోలు కూడా చెప్పారని, ఆరోపణలన్నీ కుట్రపూరితంగా చేసినవేనని వారిద్దరి ఆరోపణ. ఈ ఘటన జరిగిన మార్చి 12 తేదీ నాటి అసెంబ్లీ సమావేశాల వీడియో ఫుటేజీలను సీల్డ్ కవర్‌లో ఈ నెల 22 తేదీలోగా తమ ముందుంచాలని అసెంబ్లీ కార్యదర్శిని న్యాయమూర్తి ఆదేశించారు. ప్రతివాదులందరూ తమ వాదనలతో కౌంటర్ వ్యాజ్యాలు దాఖలు చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ సెక్రటరీ, శాసన, న్యాయ వ్యవహారాల శాఖ సెక్రటరీ, కేంద్ర ఎన్నికల సంఘం సెక్రటరీలు కౌంటర్లు వేయాలని ఆదేశించారు.

మండలి చైర్మెన్ స్వామిగౌడ్‌కు గాయమైందని చెప్పి వారి శాసనసభ్యత్వాలను రద్దు చేయలేదు. గవర్నర్ సభలో ప్రసంగ సమయంలో వారిద్దరూ సభా గౌరవాన్ని మంటగలిపారు. అందుకే వారిద్దరి సభ్యత్వాలను రద్దు చేయడం జరిగింది. అది కూడా సభ తీర్మానం తర్వాతే నిర్ణయం జరిగింది. ఇది పూర్తి సభా నిర్ణయమే. అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయం కానేకాదు. సభ హుందాతనాన్ని కాపాడే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. రాజ్యాంగ పరిరక్షకుడు గవర్నర్ సభకు వచ్చినప్పుడు కూడా సభా గౌరవాన్ని మంటగలిపితే చర్యలు తీసుకునే అధికారం సభకు ఉంటుంది. హెడ్‌ఫోన్ విరిసిన తర్వాత కూడా వారిలో పొరపాటు చేశామనే పశ్చాత్తాపం వ్యక్తం కాలేదు. ఇలాంటి ఘటనల్లో చర్యలు తీసుకోవడాన్ని సుప్రీంకోర్టు ఇతర కేసుల్లో సమర్థిస్తూ తీర్పులు కూడా చెప్పిందని ప్రభుత్వ, అసెంబ్లీ కార్యదర్శుల తరపున అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి వాదించారు. శాసనసభ చేసిన తీర్మానం ప్రతి ఇంత వరకూ అందలేదని పిటిషనర్లు చెప్పడాన్ని న్యాయమూర్తి గుర్తు చేశారు. వెబ్‌సైట్‌లో ఉందని ఏజీ చెప్పిన జవాబుపై న్యాయమూర్తి స్పందిస్తూ... పిటిషనర్లకు తీర్మానం ప్రతి ఇచ్చారో? లేదో? చెప్పండి అనగానే ఏజీ కల్పించుకుని ఇప్పుడే ఇస్తామని బదులిచ్చారు. సభ్యులిద్దరినీ సభ నుంచి బహిష్కరిస్తూ చేసిన తీర్మానాన్ని పిటిషనర్లు ప్రశ్నించలేదు కాబట్టి ఈ నిర్ణయంపై స్టే ఇవ్వడానికి వీల్లేదని ఏజీ వాదించారు.

గవర్నర్ ప్రసంగ సమయంలో వీడియో ఫుటేజీని పిటిషనర్లు కోరుతున్నారని, అయితే తమ దగ్గర ఏ వీడియో ఫుటేజీ ఉంటే దానినే అందజేస్తామని ఏజీ కోర్టుకు తెలిపారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం చేసేప్పుడు రెండు కెమెరాలు ఆయన ప్రసంగ వేదికకు, మిగిలిన నాలుగు కెమెరాలు సభ్యుల వైపు పని చేయాలని, గవర్నర్ పక్కనే స్వామిగౌడ్ కూర్చున్నప్పుడు గాయపడ్డారని చెబుతున్నందున వాటి వీడియో ఫుటేజీలనే తాము హైకోర్టుకు సమర్పించాలని కోరుతున్నామని పిటిషనర్ల లాయర్ చెప్పారు. అందుబాటులో ఉన్న వీడియో ఫుటేజీలన్నింటినీ ఇస్తామని ఏజీ బదులిచ్చారు. కోమటిరెడ్డి, సంపత్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లగొండ, ఆలంపూర్ అసెంబ్లీ స్థానాలు ఖాళీ అయినట్టు గెజిట్ నోటిఫికేషన్ గురించి న్యాయమూర్తి ప్రశ్నించారు. గెజిట్ నోటిఫికేషన్ తర్వాత కేంద్ర ఎన్నికల సంఘానిదే పూర్తి బాధ్యత ఉంటుందని, తమకేమీ సంబంధం ఉండదని ఏజీ వివరణ ఇచ్చారు.

దీనిపై తమ అభిప్రాయం తెలిపేందుకు కేసు విచారణను వాయిదా వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం లాయర్ అవినాశ్ దేశాయ్ కోరారు.

దాంతో సాయంత్రం 4 గంటలకు తిరిగి కేసు విచారణ ప్రారంభమైంది. ఆరువారాల పాటు ఎన్నికల నోటిఫికేషన్‌పై ఏవిధమైన నిర్ణయాలు తీసుకోరాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. చట్ట సభ సభ్యుల అనర్హతపై ఎప్పుడు ఏవిధమైన చర్యలు తీసుకోవాలో సుప్రీంకోర్టు కేంద్ర ఎన్నికల సంఘం భజరంగ్ బహదూర్ సింగ్ కేసులో ఇచ్చిన తీర్పు ప్రతిని ఈసి లాయర్ న్యాయ మూర్తికి అందజేశారు. దాంతో ఆరు వారాలపాటు గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఏ చర్యలూ తీసుకోరాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. దీనిపై విచారణ మార్చి 27కి వాయిదా పడింది.

అవిశ్వాసానికి విపక్షాలే అడ్డు!

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాల నోటీసులను సెక్రెటరీ జనరల్‌కు అందజేశారు. అయితే లోక్‌సభ వెల్‌లో విపక్షాలు ఆందోళన చేస్తున్నారని, సభ్యులను ఎలా లెక్కించాలంటూ స్పీకర్ తీర్మానాలను సభలో ప్రవేశపెట్టేందుకు నిరాకరించారు. ఇదే సమయంలో సభను ఏకంగా మంగళవారానికి వాయిదా వేశారు. అంతకముందు ఉదయం సభ ప్రారంభమైన తరువాత ప్రశ్నోత్తరాలను చేపడుతున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అయితే వివిధ డిమాండ్లపై విపక్షాలు ఆందోళన చేయడంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు.

రాజ్యసభ నేటికి వాయిదా...

పెద్దల సభ ఎలాంటి చర్చ చేపట్టకుండానే మంగళవారానికి వాయిదా పడింది. ఉదయం సభ ప్రారంభమవగానే హోదాపై టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ఎంపీ కేవీపీతో పాటు కావేరీ నదీ నిర్వహణ బోర్డు అంశంపై డీఎంకే, అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చారు. దీంతో సభను ఏకంగా ఒక రోజంతా వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ వెంకయ్యానాయుడు తెలిపారు. అంతకుముందు ఆందోళన చేస్తున్న ఎంపీలనుద్దేశించి చైర్మెన్ పలు వ్యాఖ్యలు చేశారు. ఆందోళనలు ఇటు పార్లమెంట్, అటు దేశ ప్రయోజనాల కోసం మంచిదికాదని అన్నారు. అన్ని అంశాలపై చర్చకు తాము సిద్ధమని ప్రభుత్వం ప్రకటించిందని, తాను కూడా అనుమతినిస్తానని చెప్పారు. ఇప్పటికే ప్రజల దృష్టిలో పార్లమెంట్ మజాక్ అయిపోయిందని అన్నారు. విపక్ష ఎంపీలు ఆందోళన విరమించాలని సూచించారు.

భూములను లాక్కునేందుకే భూ ప్రక్షాళన

- పట్టా భూములు లాక్కుంటే కోర్టుకు వెళ్తాం
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్‌రెడ్డి
- కామారెడ్డి జిల్లాలో రైతుల భారీ రాస్తారోకో

నవతెలంగాణ-జుక్కల్

రైతుల భూములు లాక్కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ ప్రక్షాళన పేర పన్నాగం పన్నిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకట్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని పలు గ్రామాల్లో పట్టా భూములకు సంబంధించి రైతుల పేర్లు గల్లంతయ్యాయని తెలిపారు. రైతుల భూములను వారి పేర్లపైనే చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది రైతులు సోమవారం జుక్కల్‌లో సంగారెడ్డి-నాందేడ్-అకోలా జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హన్మంత్ షిండే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వెంకట్‌రెడ్డి, సీఐటీయూ బాన్సువాడ డివిజన్ నాయకులు రవీందర్ రైతులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బంగారుపల్లి, దోస్‌పల్లి, బస్వాపూర్, విఠల్‌వాడీ, విఠల్‌వాడీ తండా, సావర్‌గావ్, సావర్‌గావ్ తండా, పడంపల్లి, గండూర్, మైబాపూర్ గ్రామాలకు చెందిన ఐదు వేల మంది రైతులు దశాబ్దాల తరబడి పట్టాల భూముల్లో సాగు చేసుకుంటున్నారని వివరించారు. ఇప్పుడు ప్రభుత్వం భూ ప్రక్షాళన పేరుతో పట్టా భూములను అటవీ భూములంటూ స్వాధీనం చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పట్టాలు జారీ చేసిన భూములను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తే కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. రైతులకు అండగా సీఐటీయూ, రైతు సంఘం పోరాడుతుందన్నారు. అనంతరం జుక్కల్ తహసీల్దార్ ఘటనాస్థలానికి వచ్చి రైతులకు నచ్చజెప్పారు. క్లియర్‌గా ఉన్న భూములను ఏ1 లిస్ట్‌లో పెట్టామని, గ్రామాల్లో గోడలకు అతికించినవి అవేనని, సమస్యాత్మకంగా ఉన్నవి ఏ2లో పొందుపర్చామని, ఇంకా క్లిష్టమైనవి ఏ3 లిస్ట్‌లో చేర్చామని చెప్పారు. గల్లంతైన భూములకు సంబంధించి ఏ2లో ఉన్నాయని, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ప్రాణం తీస్తున్న ఈత సరదా

- మరో నలుగురు విద్యార్థులు మృతి
- శోక సంద్రంలో తల్లిదండ్రులు



నవతెలంగాణ-టేకులపల్లి

ఒంటి పూట బడులు.. ఇంటర్ పరీక్షలు అయిపోయి సెలవులు వచ్చాయి.. ఈ క్రమంలో సరదా కోసం ఈత కొట్టేందుకు చెరువుల్లో దిగుతున్న విద్యార్థులు, యువకులు ప్రాణం కోల్పోతున్నారు. వారం రోజులుగా వరుస ఘటనలు జరుగుతున్నాయి. తాజాగా సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని బొమ్మన్‌పల్లి గ్రామ సమీపంలోని సాయమ్మ చెరువులో పడి నలుగురు విద్యార్థులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

బొమ్మన్‌పల్లికి చెందిన లావుడియా శ్రీను కుమారుడు సౌజన్(13) 8వ తరగతి, భక్యా నాగేశ్వరరావు కుమారుడు సిద్ధు(11) ఆరో తరగతి, బానోత్ శంకర్ కుమారుడు సంతోష్(14) 8వ తరగతి, బానోత్ రత్న కుమారుడు దిలీప్(10) ఐదో తరగతి గ్రామంలోని పాఠశాలలోనే చదువుతున్నారు. ఒంటి పూట బడులు కావడంతో మధ్యాహ్నమే ఇంటికొచ్చారు. గుబ్బకాయలు (సీమచింతకాయలు) కోసుకుందామని గ్రామ సమీపంలోని సాయమ్మ చెరువు గట్టుకు వెళ్లారు. కాయలు కోసుకున్న తరువాత ఈత కొట్టేందుకు చెరువులోకి దిగారు. ఈత సరిగ్గా రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. దీంతో నలుగురూ ప్రాణం కోల్పోయారు. గట్టు పక్కన దుస్తులను మంగ్యా తండకు చెందిన మహిళ గుర్తించి గ్రామస్తులకు తెలిపింది. గ్రామస్తులు చెరువులో గాలించి పిల్లల మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను చూసి తల్లిదండ్రులు గుండెలు పలిగేలా ఏడ్చారు. పోలీసులు విద్యార్థుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్త కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. జెడ్పీటీసీ లక్కినేని సురేందర్‌రావు, సర్పంచ్ బానోత్ సాములునాయక్, శివ బాధిత కుటుంబాలను ఓదార్చారు. మృతులు కుంటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య దళసింగ్ ప్రభుత్వాన్ని కోరారు.

యూపీలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటన ఆజంగర్ జిల్లాలోని బచ్వల్ గ్రామంలో సోమవారం చోటుచేసు కున్నది. కాగా, గడిచిన పది రోజుల్లో ఆజంగర్ జిల్లాలో మరోసారి అంబేద్కర్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకొని దుండగులు ధ్వంసం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామంలో పోలీసులు మోహరించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుల పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే జిల్లాలో రాజ్‌పత్తి గ్రామంలో ఈ నెల 10న అంబేద్కర్ విగ్రహాన్ని దుండుగులు ధ్వంసం చేశారు. కాగా, ప్రముఖుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని అన్ని జిల్లా అధికారులకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇలాంటి ఘటనలు కొనసాగుతూనే ఉండటం గమనార్హం.



మాది ఫెడరల్ ఫ్రంట్

(మొదటిపేజీ తరువాయి)

కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుతో సహా దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, 2019 ఎన్నికల్లో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ఆవశ్యకతపై చర్చించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో భాజపా, కాంగ్రెస్ విఫలమయ్యాయన్నారు. తమ ఫ్రంట్ చాలా పెద్దదని, ప్రజల ఎజెండాతో త్వరలోనే తమ కూటమి ముందుకొస్తుందన్నారు. రాజకీయాల్లో మార్పు విషయంలో ఈ సమావేశం ఓ తొలి అడుగు మాత్రమేనన్నారు. ఇందుకోసం చాలామంది మిత్రులు తమతో కలిసి వస్తారని ఆశిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో మాదే అతిపెద్ద కూటమిగా అవతరించబోతుందని, దేశ అభివద్ధే ధ్యేయంగా ముందుకువెళ్లుతామని సీఎం కేసీఆర్ వెల్లడించారు. మమతా బెనర్జీతో జరిపిన చర్చల్లో కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందనీ, భవిష్యత్తులో మరిన్ని అంశాలపై స్పష్టత ఇస్తామన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉన్నా దేశంలో ఏం మార్పు జరిగిందని ప్రశ్నించారు. ఫ్రంట్ ఏర్పాటుకు సంబంధించి తామిద్దరమే అన్ని అంశాలను నిర్ణయించలేమని, తమతో కలిసి వచ్చే మిత్రులందరితో చర్చించి మిగతా అంశాలు వెల్లడిస్తామని విలేకరులు అడిగిన ప్రశ్నకు కెసిఆర్ బదులిచ్చారు.

దేశం మార్పు కోరుకుంటుంది - మమతా బెనర్జీ

కోల్‌కత్తా సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ.. దేశం మార్పు కోరుకుంటున్నదనీ, బలమైన ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటవుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. దేశంలో నెలకొన్న పరిస్థితులే నాయకులను సష్టిస్తాయన్నారు. ఈ భేటీలో దేశాభివద్ధి, రైతు సమస్యలపైనా చర్చించామన్నారు. భావసారూపత్య ఉన్న మిత్రులందరితోనూ చర్చలు జరుపుతామని చెప్పారు. దేశాభివద్ధిపై సమావేశంలో విస్తతంగా చర్చించామని వెల్లడించారు. ప్రాంతీయ పార్టీల నాయకులతో మాట్లాడి కూటమిలోకి ఆహ్వానిస్తామని మమత బెనర్జీ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీలు కవిత, కేశవరావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ పాల్గొన్నారు.

ఓలా, ఉబెర్ డ్రైవర్ల నిరవధిక సమ్మె షురూ

ముంబయి: యాజమాన్యాలు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఉబెర్, ఓలా క్యాబ్ డ్రైవర్లు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) ముంబయి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సమ్మెకు ముంబయి నుంచే కాక.. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, బెంగళూరుహైదరాబాద్, చెన్నై, పూణె నగరాల క్యాబ్ డ్రైవర్లు, ప్రయివేటు ట్యాక్సీ డ్రైవర్ సంఘాలు సైతం మద్దతు పలికాయి. డ్రైవర్లకు తక్కువ వేతనాలు, ఆప్ ద్వారా తక్కువ ధరకే రైడ్‌లు, సొంత వాహనం ఉన్న డ్రైవర్లనే నియమించుకోవడం, ష్యూరిటీలు అధికంగా వసూలు చేస్తోండటం వంటి పలు అంశాలతో.. డ్రైవర్లు సమ్మెను ప్రారంభించారు. యాజమాన్యాలు స్పందించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని ఎంఎన్ఎస్ అధ్యక్షుడు సంజయ్ నాయక్ తెలిపారు.

దేశానికే దిక్సూచి కేసీఆర్ నిర్ణయాలు

- వ్యవసాయ రంగానికి రూ.50 వేల కోట్లు
- 22న రైతు సమన్వయ సమితి మొదటి సమావేశం
- ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ ప్రతినిధి

వ్యవసాయ రంగంలో సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు దేశానికే దిక్సూచిలా నిలుస్తున్నాయని ఎంపీ, రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని తన నివాసంలో విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడారు. రెండు పంటలకు ఎకరానికి రూ.8 వేల పెట్టు బడి పథకం కోసం రూ.12 వేల కోట్లు, రైతులకు ఉచిత బీమాకు రూ.500 కోట్లు, వ్యవ సాయ యాంత్రీకరణకు రూ.525 కోట్లు, ఉచిత విద్యుత్, మద్దతు ధర ఇతర పథకాల్ని అమలు చేయడం కోసం వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలకు రూ.50 వేల కోట్ల మేరకు బడ్జెట్‌లో నిధుల్ని కేటాయించారన్నారు. రాష్ట్రంలోని సర్వే నెంబర్ ప్రకా రం ఉన్న భూముల్లో ఏ రకమైన పంట వేయాలనేది నిర్ధారించడం కోసం భూసార పరీక్షల్ని నిర్వహించేందుకు క్లస్టర్ వ్యవస్థను ఏర్పాటు చేశామ న్నారు. ప్రతి క్లస్టర్‌కూ వ్యవసాయ విస్తరణ అధికారి చొప్పున నియామకాలు చేసి నట్టు తెలిపారు. ఈనెల 22న రాష్ట్ర రైతు సమన్వయ సమితి మొదటి సమావేశం నిర్వహించనున్నట్టు తెలి పారు. పంట లకు మద్దతు ధర కోసం రూ.ఐదు వేల కోట్లు కేటాయించినట్టు తెలి పారు. రబీ ధాన్యా న్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా 3250 కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేసేందుకు ఆయా జిల్లాల నుంచి ప్రతిపాద నలు వచ్చాయన్నారు. రైతులెవరైనా అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నా, అప్పు ఇచ్చిన వ్యక్తులు ఒత్తిళ్లు చేస్తున్నా రైతు సమన్వయ సమితులకు ఫిర్యాదు చేయాలని కోరారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఎవరైనా రైతులు ఆర్థి కంగా ఉంటే, పెట్టుబడి పథకం డబ్బులు వద్దనుకుంటే స్వచ్ఛందంగా ప్రకటిస్తే, వారి డబ్బుల్ని రాష్ట్ర రైతు సమన్వయ సమితి ఎకౌంట్‌లో జమ చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర అటవీ సంస్థ చైర్మెన్ బండ నరేందర్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మెన్ గుత్తా జితేందర్‌రెడ్డి, ఎంపీపీల ఫోరం రాష్ట్ర నాయకులు పాసం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయం రూ. 1,00,116

- అసెంబ్లీలో సీఎం ప్రకటన
- పేదరికం అనేక రకాలుగా వేదన కావొద్దు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేదింటి ఆడపిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఇచ్చే ఆర్థిక సాయాన్ని పెంచింది. ప్రస్తుతం ఈ పథకం కింద పేదింటి ఆడపిల్లల వివాహానికి అందిస్తున్న రూ.75,116 ను రూ.1,00116కు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు సోమవారం అసెంబ్లీలో ప్రకటించారు. ఈ సంద ర్భంగా సీఎం మాట్లాడుతూ "పేదరికం మనుషుల్ని అనేక రకాలుగా వేధిస్తున్నది. పేదరికంతో బాధ పడేవారికి కొన్ని సార్లు సాంప్రదాయాలు కూడా భారంగా పరిణమిస్తాయి. మన సమాజంలో పెండ్లి అనేది చాలా ఖర్చుతో కూడుకున్న అంశం. అందులోనూ ఆడపిల్ల పెండ్లి మరింత భారంగా పరిణమించింది. ఈ భారం వల్లనే చాల మంది తల్లిదండ్రులు తమ ఇంటి మహాలక్ష్మిగా భావించే ఆడపిల్లని గుండెల మీద కుంపటిగా భావించి మానసిక స్థితికి గురవుతున్నారు. ఆడపిల్ల కడుపులో ఉండగానే, పెండ్లి కోసం చేయాల్సిన ఖర్చును ఊహించి భ్రూణ హత్యలకు పాల్పడుతున్న అమానుష సంఘటనలు చోటు చేసుకుంటు న్నాయి. కొన్ని సార్లు పేదల ఇండ్లలో ఆడపిల్లలు పెండ్లి కాకుండానే మిగిలిపోతున్నారు. ఆడపిల్ల పెండ్లి చేయడం కోసం కుటుంబాలు అప్పుల పాలై ఆర్థికంగా చితికిపోతున్నాయి. పరిపాలనలో మానవీయ విలువలు అడుగడుగునా ప్రతిబిం బించాలని భావించి రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లలు ఎందుర్కొంటున్న కష్టాన్ని, వారి తల్లిదండ్రులు అనుభవిస్తున్న ఆవేదనను తీర్చాలని భావించింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీ కాకున్న, పేదరికం ప్రభావాలను అధ్యయనం చేసే క్రమంలో పరిస్థితిలోని తీవ్రత మమ్మల్ని కదిలించింది. అందుకే పేద ఆడపిల్లల పెండ్లికి ప్రభుత్వం అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. అందుకే కళ్యాణలక్ష్మి అనే శుభప్రదమైన పేరుతో 2014 అక్టోబర్ 2న ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాం" అని చెప్పారు.

నా హృదయానికి దగ్గరైన పథకం

కళ్యాణలక్ష్మి వ్యక్తిగతంగా నా హృదయానికి ఎంతో దగ్గరైన పథకం. అంతకంటే ఎక్కువగా రాష్ట్ర ప్రజలు ఈ పథకాన్ని ఎంతగానో మెచ్చారన్నారు. ఈ పథకం ద్వారా ఆడపిల్లల కండ్లలో ఆనందం నింపిన పథకమని చెప్పారు. ఈ పథకంగా ద్వారా లబ్ది పొందడానికి కనీస వయో పరిమితి 18 సంవత్సరాలుగా నిర్ణయించామని, దీంతో పథకం ప్రయోజనాలు పొందడం కోసం బాల్య వివాహాలు చేయకుండా ఆడపిల్లలకు 18 ఏండ్లు నిండేవరకు వారి తల్లిదండ్రులు వేచి ఉండటం వల్ల బాల్య వివాహాలను కూడా నిరోధించడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామీణాభివద్ధి శాఖ ద్వారా రాష్ట్రంలో చేపడుతున్న అభివద్ధి కార్యక్రమాలను అందరికీ అర్థమయ్యేలా క్యాలెండర్‌ను రూపొందించడం అభినం దనీయమని పంచా యతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు అన్నారు. గ్రామీణాభివ ద్ధి శాఖ రూపొందించిన విళంబినామ సంవత్సరం తెలుగు ఉగాది క్యాలెండర్‌తో పాటు డైరీని కమిషనర్ కార్యాలయంలో సోమవారం మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది సందర్భంగా క్యాలెండర్‌ను రూపొందించడం ప్రశంసనీయమన్నారు. ప్రతి ఒక్క కార్యక్రమం ప్రజలకు అర్థమయ్యేలా క్యాలెండర్‌లో ఆయా అంశాలపై పూర్తి సమాచారం ఉంచడం మంచి పరిణామమని వ్యాఖ్యానించారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఉద్యోగులు కషి చేయాలని కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో కమిషనర్ నీతూ ప్రసాద్, సంయుక్త సంచాలకులు వెస్లీ, బి. సైదులు, మంత్రి ఓఎస్డీ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆవాసానికి తాగునీరు

భగీరథ వైస్‌చైర్మెన్ ప్రశాంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతీ ఆవాసానికి త్వరలోనే బల్క్‌గా భగీరథ నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ వైస్ ఛైర్మెన్ వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ ఎండాకాలం రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మిషన్ భగీరథ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్యను ఎదుర్కోవడానికి తగిన ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని దాదాపు 7 వేల ఆవాసాలతో పాటు 18 యూఎల్‌బీలకు బల్క్ గా భగీరథ నీళ్లు సరఫరా అవడంపై ప్రశాంత్‌రెడ్డి సంత ప్తి వ్యక్తం చేశారు. అలాగే ఓహెచ్‌బీఆర్‌ల వారీగా ప్రతీ రోజు ఆయా దశల్లో మిగిలిన ఆవాసాలకు కూడా తాగునీటిని అందించాలని చెప్పారు. ఇంట్రా పనులతో గ్రామాల్లో ఉన్న రహదారులు ఏమైనా చెడిపోతే, వెంటనే సరిచేయాలని ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. సురేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు కపాకర్ రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్, ఓఎస్డీ సత్యపాల్ రెడ్డి, ఈఈలు విజయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.


టెన్త్ ఇంగ్లీష్ పేపర్ లీక్

- జిరాక్స్ తీసి సెంటర్లోకి పంపిన వైనం
- మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు ప్రయివేటు స్కూళ్ల నిర్వాహకులపై కేసు
- ఆదిలాబాద్ జిల్లాలో వాట్సాప్‌లో పేపర్ పంపిన ఇన్విజిలేటర్
- ఆర్డీఓ విచారణ..నలుగురిపై చర్యలకు కలెక్టర్ ఆదేశం

నవతెలంగాణ-మహబూబ్‌నగర్/ఉట్నూర్ రూరల్

మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలు సెంటర్లలో సోమవారం టెన్త్ ఇంగ్లీష్ పేపర్-1 లీకైంది. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సమా ధానాలు చెప్పేందుకు ప్రశ్నపత్రాన్ని బయటకు తీసుకెళ్లారు. జీరాక్స్ తీసి సెంటర్‌కు పంపారు. ఈ క్రమంలోనే మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘట నకు సంబంధించి ఐదు స్కూళ్ల నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూ రు ఏజెన్సీలోని నార్నూర్ మండలం తడిహత్నూర్ పరీక్ష కేంద్రంలో ఓ ఇన్విజిలేటర్ ప్రశ్నపత్రాన్ని వాట్సాప్‌లో పెట్టింది. ఘటనపై కేసు నమోదైంది.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఘటనా వివరాలను ఎస్పీ అను రాధ, జేసీ వెంకట్రావు వెల్లడించారు. మరికల్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేపర్ లీక్ అయినట్టు, జవాబులను విద్యార్థులకు చిట్టీల ద్వారా అందజేస్తున్నట్టు హైదరాబాద్‌లోని స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్క్వాడ్ రవిందర్, జిల్లా పరిశీలకుడు రషీద్, మక్తల్ సీఐ వెంకటేశ్వర్లు సెంటర్‌ను పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్ప డుతున్న విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక మణికంఠ జూనియర్ కళాశాల పీఈటీ ప్రవీణ్, అదే కాలేజీలో చదువుతున్న నవీన్, ప్రగతి హైస్కూల్ పీఈటీ మోహన్, గౌతమి మోడల్ స్కూల్(లాల్‌కొండ) యజమాని రాజేందర్ ఈ లీకేజీకి సహకరించారు. పరీక్ష ప్రారంభం కాగానే ప్రశ్నపత్రాన్ని బయటకు తీసుకువెళ్లి జీరాక్స్ తీసి మళ్లీ లోపలికి పంపినట్టు, ఈ వ్యవహారంలో ఐదు స్కూళ్లకు చెందినవారు ఉన్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ ఘటనకు కారకులైనవారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు చెప్పారు.



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీలోని నార్నూర్ మండలం తడిహత్నూర్ సెంటర్‌లోని రూమ్ నెంబర్-1 నుంచి ఇన్విజిలేటర్ కృష్ణవేణి సెల్‌ఫోన్ ద్వారా ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసి పలు వురికి వాట్సాప్ ద్వారా పంపింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. వెంటనే ఉట్నూర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డిని విచారణ చేపట్టాల్సిందిగా ఆదే శించగా..ఆయన వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదించారు. ప్రశ్నపత్రం లీక్ వాస్తవమేనని, జవాబులు మాత్రం కేంద్రానికి రాలేదని ఎంఈఓ చెప్పారు. ఈ ఘటనపై సాయంత్రం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ దివ్య మాట్లాడుతూ.. ప్రశ్నపత్రం లీక్ కాదని, పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చిందని తెలిపారు. బాధ్యులుగా తేలిన చీఫ్ సూపరింటెండెంట్ భరత్ చౌహాన్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ జగన్మోహన్, కస్టోడియల్ నాగోరావు, ఇన్విజిలేటర్ కృష్ణవేణిపై చర్యలు తీసుకుం టున్నామన్నారు. నార్నూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. సమావేశంలో ఏఎస్పీ మోహన్, డీఈఓ జనార్ధన్‌రావు, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▼ 253	నిఫ్టీ ▼ 101	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు	
32,923	10,094	65.18	రూ. 30,408	రూ. 40,200	హైదరాబాద్ 368	విజయవాడ 374
					ఒక్కగుడ్డుకు 4.30	చెన్నై 397
					వరంగల్ 370	ముంబయి 410






ఆ బ్యాంక్ గ్యారెంటీలను స్వీకరించం

న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్ జారీ చేసే బ్యాంక్ గ్యారెంటీలను ఇకపై తాము స్వీకరించబోమని టెలికాం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశంలో మూడో అతిపెద్ద ప్రయివేటు బ్యాంక్ అయిన యాక్సిస్ బ్యాంక్‌పై టెలికాం శాఖ ఈ ఆదేశాలు జారీ చేయడంతో మార్గెట్ వర్గాలు ఒక్క సారిగా కంగుతున్నాయి. గతంలో ఈ బ్యాంకు జారీ చేసిన పలు బ్యాంక్ గ్యారెంటీలకు సంబంధించిన విధివిధానాలకు యాక్సిస్ బ్యాంక్ కట్టుబడకపోవడం వల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా టెలికాం శాఖ వెల్లడించింది. ఈ నెల 16 టెలికాం శాఖ విడుదల చేసిన ఆఫీస్ మెమోరాండంలో దీనికి సంబంధించి టెలికాం శాఖ ఆదేశాలను జారీ చేసింది. ఎయిర్‌సెల్ గ్రూపునకు బ్యాంక్ గతంలో జారీ చేసిన బ్యాంక్ గ్యారెంటీని నిలుపుకోవడంతో యాక్సిస్ బ్యాంక్ విఫలమైందని పేర్కొంది.

భారత్‌కు బైబై!!



- విదేశాలకు జై కొడుతున్న సంపన్నులు
- మూడేండ్లలో 23,000 మంది వలస
- గతేడాదే దాదాపు 7,000 మంది 'జెట్'
- 'స్వర్గసీమ' దేశాలపై బడాబాబుల ఆసక్తి
- వ్యాపారాలిక్కడ.. మకాం మాత్రం అక్కడ
- కఠిన చట్టాలు, పన్నులే కారణం!

న్యూఢిల్లీ: నల్లధన నియంత్రణలో భాగంగా కఠినమైన చట్టాలు, సంస్కరణలను అమలులోకి వస్తున్న నేపథ్యంలో దేశం నుంచి పెద్ద సంఖ్యలో సంపన్నులు తమ మకాం మార్చేస్తున్నారు. గడిచిన మూడేండ్ల కాలంలో దేశం నుంచి అధిక సంఖ్యలో సంపన్నులు విదేశాలకు వలసపోయారని ఒక అధ్యయనంలో తేలింది. 2014 నుంచి ఇప్పటి వరకు రూ.65 లక్షలు అంతకంటే ఎక్కువ సంపద కలిగిన సంపన్నులు దాదాపు 23,000 మంది దేశం వదిలి సంపన్నుల స్వర్గసీమగా నిలిచే దేశాలకు మకాం మార్చినట్టుగా మోర్గాన్ స్టాన్లీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ చీఫ్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ రుచిర్ శర్మ నేతృత్వంలోని బృందం లెక్క తేల్చింది. ఒక్క 2017లోనే దాదాపు 7000 మంది సంపన్నులు దేశం దాటేసినట్టుగా ఈ అధ్యయనం తెలిపింది. 23,000 మంది బడా బాబులు దేశం దాటేయడం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ వివిధ రూపాల్లో నష్టపోతోందని బృందం వివరించింది. మొత్తం దేశంలో ఉన్న సంపన్నుల్లో వలస పోయిన వారి సంఖ్య 2.1 శాతానికి సమానమని ఈ అద్యయనం తెలిపింది. దీంతో ప్రపంచంలోనే మరే ఇతర దేశాల్లోనూ వలసపోనంతంగా బడా బాబులు భారత్‌ను వదిలేస్తున్నట్ట గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 1,50,000 మంది సంపన్నుల కదలికలను అధ్యయనం చేసి ఈ మోర్గాన్ స్టాన్లీ ఈ వివరాలను తెలిపింది. దేశం వదిలి ఆరు నెలలు అంతకంటే ఎక్కువ కాలం తిరిగి స్వదేశానికి రాకుండా.. అక్కడి నుంచి తమతమ దేశాల్లో వ్యాపారాలను చక్కబెడుతున్న వారి వివరాలను, కదలికలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాక శర్మా బృందం ఈ వివరాలను వెల్లడించింది. పన్నులు కఠినతరం చేయడం, నల్లధన నియంత్రణ చర్యలకు పదను, మోసాల వెలికితీత పెరగడం, నిరర్థ ఆస్తులు, ఆర్థిక మోసాలపై నిఘా పెరగడంతో చాలా మంది సంపన్నులు భారత్ వదిలి విదేశాలకు వలస వెలుతున్నట్టుగా తెలుస్తోందని అధ్యయనం వెల్లడించింది.

బ్రిటన్, దుబాయ్, సింగపూర్ హాట్ గురు..

భారత్‌కు బైబై చెబుతున్న బడాబాబులు ఎక్కువగా బ్రిటన్, దుబాయ్, సింగపూర్‌లకు తమ మకాం ఏర్పాటు చేసుకుంటున్నట్టుగా అధ్యయనం తెలిపింది. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే ఇతర దేశాల వారు ఎక్కువగా ఆక్లాండ్, దుబాయ్, మోట్రియల్, టెల్ అవైవ్, టొరంటోలలో తమ నివాసాలను మార్చు తున్నట్టుగా తెలుస్తోంది. భారత్‌తో పాటుగా అధిక పన్నుల మూలంగా ఫ్రాన్స్‌లో కూడా సంపన్నుల వలసలు అధికంగా ఉన్నట్టుగా ఈ అధ్యయనం వెల్లడించింది. బ్రెగ్జిట్ నేపథ్యంలో గత ఏడాది బ్రిటన్ నుంచి కూడా అత్యధికంగా సంపన్నులు ఇతర ఐరోపా దేశాకు తరలి పోయినట్టుగా ఈ అధ్యయనంలో వెల్లడైంది. 2014 నుంచి ఇప్పటి వరకు చైనా నుంచి దాదాపు 38,000 మంది సంపన్నులు దేశం దాటేసినట్టుగా అధ్యయనం లెక్క తేల్చింది.



బంధన్‌కు స్పందన భేష్!

న్యూఢిల్లీ: బంధన్ బ్యాంక్ పబ్లిక్ ఇష్యూ కు ప్రాథమిక మార్కెట్లో చక్కటి స్పందన లభించింది. సోమవారంతో ముగిసిన ఈ ఐపీవోకు మదుపరుల నుంచి దాదాపు 14.62 రెట్లమేర అద్భుత స్పందన లభించింది. బ్యాంక్ ఆఫర్‌కు ఉంచిన 8,34,96,347 షేర్లకు దాదాపు 1,22,10,47,920 బిడ్లు దాఖలు అయినట్టుగా స్టాక్ మార్కెట్ డేటా చెబుతోంది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును సంస్థ రూ.370-375 ధరల శ్రేణితో ఐపీవోకు ఉంచింది. అర్హత కలిగిన సంస్థాగత కొనుగోలుదారుల కోటాకు అత్యధికంగా దాదాపు 38.68 రెట్ల స్పందన లభించింది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 1.19 రెట్ల స్పందన వచ్చిందని మార్కెట్ డేటా ప్రకారం తెలుస్తోంది.

'డిన్'కూ పాస్‌పోర్టు..

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) స్కామ్ నేపథ్యంలో కార్పొరేట్ వ్యవహారాల శాఖ కంపెనీ వ్యవస్థను వీలైనంత కఠినతరం చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఇకపై కంపెనీ బోర్డుల్లో డైరెక్టర్లుగా సేవలు అందించేందుకు అనుమతులు పొందిన వారి పాస్‌పోర్టు వివరాలను స్వీకరించాలని భావిస్తోంది. డైరెక్టర్లుగా సేవలందించేందుకు గుర్తింపు పొందిన వారికి కార్పొరేట్ శాఖ డైరెక్టర్ ఐడెంటిఫికేషన్ నంబరును (డిన్) జారీ చేయనుంది. ఈ ఎనిమిది అంకెల డిన్‌ను పొందేందుకుగాను డైరెక్టర్లు పాస్‌పోర్టుతో వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

4000 కోట్ల స్కామ్ @ పీఏఎల్!

- చిన్న దర్యాప్తులో పెద్ద విషయం
- ఫిర్యాదు చేసిన యాక్సిస్ బ్యాంక్



ముంబయి: బూటకపు కంపెనీల పేర్లతో మోసపూరితమైన నకిలీ ఇన్‌వాయిస్లు, బిల్లులను సృష్టించి బ్యాంకులకు దాదాపు రూ.4000 కోట్ల మేర టోపీ పెట్టిన మరో భారీ స్కామ్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముంబయికి చెందిన పరేఖ్ అల్యూమినిక్స్ లిమిటెట్ (పీఏఎల్) సంస్థ యాజమాన్యం, ప్రమోటర్లు ఈ స్కామ్‌కు పాల్పడ్డట్టుగా తెలుస్తోంది. గతంలో నమోదైన రూ.250 కోట్ల బ్యాంకింగ్ కుంభకోణం ఆరోపణలపై పరేఖ్ అల్యూమినిక్స్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ స్కామ్ దర్యాప్తులో భాగంగా సంస్థకు చెందిన ముగ్గురు డైరెక్టర్లను ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్ట్ చేసి విచారణ జరపుతుండగా.. స్కామ్‌లో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. రూ.250 కోట్ల స్కామ్ విలువ మరింతగా విస్తరించి దాదాపు రూ.4000 కోట్లకు చేరువలో ఉన్నట్టుగా దర్యాప్తు సంస్థల అధికారులు గుర్తించారు. ఈ స్కామ్ మొత్తం విలువ రూ.4,000 కోట్ల వరకు ఉంటుందంటూ యాక్సిస్ బ్యాంకు తన తాజా ఫిర్యాదులో పేర్కొనడం విశేషం. ఇరవైకి పైగా బ్యాంకుల కన్సార్టియంను పీఏఎల్ మోసం చేసినట్టుగా సమాచారం. బూటకపు కంపెనీల పేరుతో మోసపూరితమైన నకిలీ ఇన్‌వాయిస్లు, బిల్లులతో కుంభకోణానికి పాల్పడ్డారని బ్యాంకు ఆరోపించింది. దీంతో ఫోర్జరీ, నిబంధనల ఉల్లంఘన, నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భవార్‌లాల్ భండారి, ప్రేమల్ గోరఖ్‌నాథ్, కమేలష్ కనుగోలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కుంభకోణంలో బ్యాంకు అధికారుల పాత్రపై అధికారులు ఆరా తీస్తున్నప్పటికీ ఈ విషయంలో పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. పరేఖ్ అల్యూమినిక్స్ ఎస్‌బీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సహా ప్రభుత్వ బ్యాంకులనుంచి ఆరోపణల నెదుర్కొంటోంది. ఇప్పటికే ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోంది.


ప్రతికూలతతో పతనం..

ముంబయి: ప్రతికూల పవనాల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు నూతన ట్రేడింగ్ వారాన్ని నష్టాలతో ప్రారంభించాయి. గ్యాస్ ఆథారిటీ ఆఫ్ ఇండియాలో (గెయిల్) తాము వాటా కొంటున్నట్టుగా వచ్చిన వార్తలను చమురు మార్కెటింగ్ దిగ్గజాలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్) సంస్థలు ఖండించిన నేపథ్యంలో ఈ రెండు సంస్థల షేర్లు సోమవారం భారీగా పతనమైయ్యాయి. దాదాపు ఈ రెండు స్టాక్స్ 4 శాతం మేర కుంగాయి. దీంతో ఐవోసీ స్టాక్ గత ఏడాది జనవరి నాటి కనిష్ట స్థాయికి పడిపోయింది. దీనికి తోడు తెలుగు దేశం పార్టీ కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపై సంధించిన అవిశ్వాస తీర్మాన అంశం మార్కెట్లను ఆలోచింపజేసింది. అవిశ్వాస నేపథ్యానికి తోడు ఫ్రంట్ ఏర్పాటు దిశగా తెలంగాణ సీఎం కేసీఆర్ కార్యాచరణను మొదలు పెట్టి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని కలవడం, కాంగ్రెస్ ప్లీనరీల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో మదుపరులు ధర్యం చేసి పొజిషన్ తీసుకోలేకపోయారు. ఫలితంగా ప్రారంభంలో కొంత లాభాల్లో నడయాడిన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. ఆ తరువాత ఏ స్థాయిలోనూ పుంజుకోలేకపోయాయి. మార్కెట్లు ముగిసే సమయాకినికి బీఎస్ఈ సెన్సెక్స్ 253 పాయింట్ల మేర కుంగి 32,923 పాయింట్లకు చేరింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 101 పాయింట్ల మేర పడిపోయి 10,094 వద్ద స్థిరపడింది. దేశంలోని అవిశ్వాస పరిస్థితులకు తోడు ప్రపంచ మార్కెట్లు నష్టాల్లో నడవడం కూడా మార్కెట్ వర్గాలను కలవరపెట్టింది.

బీఎల్‌ఎఫ్ దేశానికే ఆదర్శం


(మొదటిపేజీ తరువాయి)

జెండాలను ఏకం చేయటం సంతోషదాయకమని చెప్పారు. ఒకవైపు ఆరెస్సెస్ కనుసన్నల్లో నడుస్తున్న బీజేపీని రోజురోజుకూ బలోపేతం చేసేందుకు మోడీ, అమిత్‌షా, యోగి ఆదిత్యనాథ్‌లాంటి వాళ్లు తీవ్రంగా ప్రయత్నిస్తుండగా.. మరోవైపు ఆయా శక్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వామపక్షాలు, సామాజిక శక్తులు, అభ్యుదయ వాదులు ఏకమవుతున్నారని వివరించారు. ఫలితంగా దేశంలో కొనసాగుతున్న భావజాల ఘర్షణ ప్రజల మెదళ్లలో కదలికలను తీసుకొస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణలో ఏర్పడిన బీఎల్‌ఎఫ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఇక్కడ మొదలైన ఈ ప్రక్రియ యావత్ దేశానికి దిశా, నిర్దేశం చేయాలని అభిలషించారు. అనేకాంశాల్లో కేరళ.. మిగతా అన్ని రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తున్నదని తెలిపారు. అక్కడి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ప్రాతిపదికన బీఎల్‌ఎఫ్ తన కార్యక్రమాన్ని రూపొందించుకోవటం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగించాలని జిగ్నేశ్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి, పాదయాత్ర సారధి తమ్మినేని వీరభద్రం స్వాగతోపన్యాసం చేశారు. సభలో జిగ్నేశ్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పాదయాత్ర బృంద సభ్యులు జాన్‌వెస్లీ, ఎమ్‌వీ రమణ, ఎమ్‌డీ అబ్బాస్, ఎస్.రమ, పైళ్ల ఆశయ్య, శోభన్ నాయక్, బీఎల్‌ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్, నాయకులు అమ్జదుల్లాఖాన్, టీ మాస్ చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రజా గాయకుడు గద్దర్, సామాజికవేత్త ఉ.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



తమ్మినేని మాట్లాడుతూ.. పాదయాత్రలో నడిచింది తమ పార్టీ నాయకులైనా.. నడిపించింది మాత్రం తెలంగాణ ప్రజలేనని వ్యాఖ్యానించారు. తమ యాత్ర రాష్ట్ర రాజకీయాలను ఒక మలుపు తిప్పిందని అన్నారు. తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు టీఆర్ఎస్ సర్కారు అనేక పథకాలను ప్రకటించాల్సి వచ్చిందని చెప్పారు. ఇది తాము సాధించిన గొప్ప విజయమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌లలో ఏ పార్టీతోనూ తమ పార్టీకి పొత్తులుండబోవని స్పష్టం చేశారు.

ఏ ఒక్క విగ్రహాన్ని ధ్వంసం కానివ్వం..:కంచ ఐలయ్య



'త్రిపురలో అధికారంలోకి రాగానే ఫాసిస్టు శక్తులు లెనిన్ విగ్రహాలను పగులగొట్టారు. ఇతర రాష్ట్రాల్లో అంబేద్కర్, పెరియార్ విగ్రహాలను ధ్వంసం చేశారు. వామపక్షాలు, సామాజిక శక్తులు ఏకమైన నేపథ్యంలో.. ఇక ముందు ఒక్క విగ్రహాన్ని కూడా పగలగొట్టకుండా మనం అడ్డుపడాలి. బీఎల్‌ఎఫ్ ముందుండి ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించాలి..."

వంతెన నిర్మాణం ప్రారంభమైంది: కాకి మాధవరావు



'దేశాన్ని సమున్నత ఆశయాల తీరానికి చేర్చేందుకు వీలుగా కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు కలిసి ఒక వంతెన నిర్మిస్తున్నారు. దాని నిర్మాణం ఇప్పుడే ప్రారంభమైంది. ఒక్కో ఇటుకా పేర్చుకుంటూ దాని నిర్మాణాన్ని పూర్తి చేద్దాం..."

ఆ స్ఫూర్తే.. వేల కిలోమీటర్లు నడిపించింది...:ఎస్.రమ




"మా పాదయాత్ర సారధి తమ్మినేని ఇచ్చిన స్ఫూర్తి ఎన్నటికీ మరువలేనిది. యాత్రను అడ్డుకోవాలంటూ సీఎం కేసీఆర్ పిలుపునిచ్చినా లెక్కచేయని ప్రజలు అడుగడుగునా మాకు నీరాజనాలు పలికారు. ఆ స్ఫూర్తే నన్ను వేల కిలోమీటర్లు నడిపించింది. అందువల్ల నా మిగతా జీవితమంతా ప్రజా ఉద్యమాలకే అంకితం..."

జన జీవితమే.. లాల్, నీల్ కలయిక...:గద్దర్



"లాల్, నీల్ కలయిక అనేది కొందరికి ఆశయం, ఇంకొందరికి అభ్యుదయం, మరికొందరికి విప్లవం కావొచ్చు.. కానీ జనాలకు మాత్రం అది వారి జీవితం. జీవితాలను నిలబెట్టే గొప్ప నినాదం. అందువల్ల మార్క్స్ వర్గ సిద్ధాంతం, అంబేద్కర్, పూలే జ్ఞాన సిద్ధాంతాలే దానికి పునాది కావాలి. తద్వారా దేశంలో ఒక భావ విప్లవాన్ని తీసుకురావాలె..."

ఆ రెండు పార్టీలూ ఒకే తాను ముక్కలు: అమ్జదుల్లా ఖాన్



"కాంగ్రెస్, బీజేపీ అనేకాంశాల్లో ఒకే విధానాలను అనుసరిస్తున్నాయి. ఈ రెండింటి వల్ల దేశానికి ఎలాంటి ఉపయోగమూ లేదు. నిజమైన సెక్యులరిస్టులు కమ్యూనిస్టులే. అందువల్ల సీపీఐ (ఎం) చొరవతో ఏర్పడిన బీఎల్‌ఎఫ్‌లో మేం భాగస్వాములమయ్యాం..."

సమయం ఆసన్నమైంది: జాన్‌వెస్లీ



"వామపక్షాలు, సామాజిక శక్తులు కలిసి పాలక వర్గాలపై రణభేరీ మోగించటానికి సమయం ఆసన్నమైంది. దేశంలో ఆదివాసీల హక్కులు హరించి వేయబడుతున్నాయి. దళితులు, అణగారిన వర్గాల వారు వివక్షకు, అణచివేతకు గురవుతున్నారు."

టీఆర్ఎస్ పతనానికి నాంది కావాలి

రాష్ట్ర కార్యాలయం ప్రారంభ సభలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఎల్‌ఎఫ్ రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి నాంది కావాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అభిప్రాయపడ్డారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో సామాజిక ఉద్యమం నడిచిందంటూ అభినందించారు. అందరికి, అన్ని పార్టీలకు బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ ఆదర్శం కావాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభసభలో మాట్లాడారు. ఈ సభకు బీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్య ప్రకాశ్ అధ్యక్షత వహించగా, బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిగ్నేశ్ మేవాని, ఎంబీటీ రాష్ట్ర అధ్యక్షులు మజీదుల్లాఖాన్, సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకు ఏం తేడా లేదని రాఘవులు చెప్పారు. అన్ని పార్టీల విధానాలు ఒకటేనని వివరించారు. ఎలాంటి మార్పూ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం ఆ పార్టీలు పనిచేయడం లేదని చెప్పారు. ఆత్మగౌరవం, సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఫ్రంట్ పాలన రావాలని, అయితే అది అంత సులభం కాదన్నారు. ఛానళ్లు, పత్రికలు అన్ని వాళ్ల చేతుల్లో ఉన్నాయని, 97 శాతాన్ని కూడగట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, ఆమేరకు కష్టపడాలని సూచించారు. అప్పుడే ప్రజావ్యతిరేక శక్తులను ఓడించగలమని అభిప్రాయపడ్డారు. సమాజంలో బహుజనులకు ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తే వాళ్లే ముందుకు పోతారని చెప్పారు. ఐక్యమత్యంతో తమ తడాఖా చూపించాలని కోరారు. బీఎల్‌ఎఫ్ దేశంలో పెనుమార్పులకు కారణం కానుందని వ్యాఖ్యానించారు. ఫ్రంట్ జయప్రదం కావాలని ఆకాంక్షించారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానత్వం కోసం పోరాడుతూనే ఆర్థికదోపిడీకి వ్యతిరేకంగా కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



బీఎల్‌ఎఫ్ దేశానికి ఆశాకిరణం: జిగ్నేశ్ మేవాని

తెలంగాణలోని బీఎల్‌ఎఫ్ దేశానికి ఆశాకిరణం కావాలని ప్రముఖ సామాజిక ఉద్యమకారులు, గుజరాత్ రాష్ట్రంలోని వడ్గం నియోజకవర్గ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని అభిప్రాయపడ్డారు. బహుజనులు, అల్పసంఖ్యాకులు, దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీల కోసం బీఎల్‌ఎఫ్ ఏర్పాటు కావడం హర్షనీయమన్నారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించినందుకు సంతోషంగా ఉన్నదని చెప్పారు. బీఎస్పీ నుంచి సీపీఐ(ఎం) వరకు బీఎల్‌ఎఫ్‌లో ఉండటం అభినందనీయమని వివరించారు. రాష్ట్రంలో ఈ ప్రయత్నం దేశానికి స్ఫూర్తినిస్తుందన్నారు. అంబేద్కర్, కారల్‌మార్క్స్, జ్యోతిభాపూలే, సావిత్రిబాయిపూలే ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని చెప్పారు. భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. రాబోయే రోజుల్లో తెలంగాణతోపాటు హైదరాబాద్‌లోనూ బీఎల్‌ఎఫ్ బ్యానర్ కిందే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రైతులు, కార్మిక సమస్యలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని చెప్పారు. రైతుల ఆత్మహత్యలు దేశంలో ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో యువతకు ఉపాధి లేకుండా పోయిందని తెలియజేశారు. ఎలాంటి పరిస్థితుల్లో మన ఎజెండాను నుంచి పక్కకు తప్పుకోరాదని చెప్పారు. మతతత్వ శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో రైతులకు కనీస మద్దతు ధర దొరకడం లేదని, ఎందుకు ఇలా జరుగుతున్నదో ఆలోచించాలని అన్నారు. 73 శాతం సంపద, ఒక శాతం ఉన్న వారి దగ్గర ఉందని గుర్తు చేశారు. తెలంగాణ, కర్నాటక, కేరళ తదితర దక్షిణాది రాష్ట్రాల్లో అంబేద్కరిస్టులు, మార్క్సిస్టులు కలిసి పనిచేస్తున్నారని, ఇది మంచి పరిణామమని చెప్పారు. బీజేపీని ఎలాంటి పరిస్థితుల్లోనూ ఎదగనీయకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎన్నికల కోసమే కాకుండా మానవ వికాసం కోసం కూడా పనిచేయాలని అభిప్రాయపడ్డారు.

పాల్గొన్న ప్రముఖులు

సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు, మహాజనపాదయాత్ర బృంద సభ్యులు జాన్‌వెస్లీ, ఎంవీ రమణ, పి.ఆశయ్య, ఎండీ అబ్బాస్, శోభన్‌నాయక్, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్, టీమాస్ నేత శ్రీరాంనాయక్, ఆర్.వెంకట్రాములు, బీఎల్‌ఎఫ్ నాయకులు డాక్టర్ అశోక్, ప్రహ్లాద్, విక్రమ్‌కుమార్, ఉ.సాంబశివరావు, పి.నాగయ్య, శ్రీరాంమూర్తి, డాక్టర్ రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చారిత్రాత్మకం...

- నల్లా సూర్యప్రకాశ్, చైర్మెన్, బీఎల్‌ఎఫ్



బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభించుకోవడం చారిత్రాత్మకం. ఫాసిస్టు శక్తులు, బీజేపీని ఎదుర్కోవడానికి ఇది అవసరం. గోసంరక్షణ పేరుతో మతవిద్వేషాలను బీజేపీ,ఆర్ఎస్ఎస్ రెచ్చగొడుతున్నాయి. కేంద్రంలో మానవత్వం లేని పాలన సాగుతున్నది. దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయి. ఈ కార్యక్రమానికి జిగ్నేశ్ మేవాని రావడం సంతోషం.

ఆర్ఎస్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా పోరాటం


- ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు



దేశంలో ఆర్ఎస్ఎస్, బీజేపీలకు, రాష్ట్రంలో కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోరాడాలి. బీఎల్‌ఎఫ్‌లో అందరూ చేరాలి. ఇది ఒక ప్రజాస్వామ్య శక్తి. దేశ రాజకీయాల్లో చారిత్రాత్మకం. నరేంద్రమోడీ, అమీత్‌షా ప్రమాదకర వ్యక్తులు. ప్రగతీభవన్ ఒక అవినీతి భవన్. అదోక కమిషన్ భవన్. బంగారు తెలంగాణ కాదు,బొందలగడ్డ తెలంగాణ.

అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలి


- బీఎల్‌ఎఫ్ నేత సునిత



రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీఎల్‌ఎఫ్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. వచ్చే ఎన్నికల్లో ఐక్యంగా ముందుకు సాగాలి. కేసీఆర్ మహిళా వ్యతిరేకి. ఓట్ల విలువను బహుజనులకు తెలియజేసి, మన ఓట్లు మనమే వేసుకునేలా పాటుపడాలి.

అసెంబ్లీని కబ్జా చేస్తాం


ఎం. నాగరాజు, తెలంగాణ లోక్‌సత్తా అధ్యక్షులు, బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్



బీఎల్‌ఎఫ్ నేతృత్వంలో వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ కబ్జా చేస్తాం. కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్‌లకు వ్యతిరేకంగా పనిచేస్తాం. బహుజనులను చైతన్యం చేస్తాం. కాంగ్రెస్‌కు బస్సుయాత్ర చేసే హక్కులేదు. కేసీఆర్.. ఎవడబ్బా సొమ్మని ఇష్టానుసారం ఖర్చు చేస్తున్నారు.

దేశంలో ముఖ్యమైన రోజు


శ్రీనివాస బహుద్దూర్, తెలంగాణ బీఎస్పీ అధ్యక్షులు, బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్



బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయం ఏర్పాటు దేశంలో ముఖ్యమైన రోజు. ఇదొక ప్రత్యేకమైన ఫ్రంట్. బహుజనులు ఏలికలు కావాలి. మా వాటాల ప్రకారం మాకు సీట్లు కావాలి. కేసీఆర్ కులం 0.4 శాతమే. ఆ లెక్క ప్రకారమే అసెంబ్లీలో ఒకరే ఎమ్మెల్యే ఉండాలే.

సీపీఎం కృషి ఎక్కువ

- జానకిరాములు, ఆర్ఎస్పీ నేత, బీఎల్‌ఎఫ్ కన్వీనర్



బీఎల్‌ఎఫ్ ఏర్పాటులో సీపీఐ(ఎం) కృషి ఎక్కువగా ఉంది. ఇందుకు తమ్మినేనికి అభినందనలు. అడ్డదారుల్లో త్రిపురలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టి అక్రమంగా ఓట్లను కొల్లగొట్టింది. కేసీఆర్ పని అయిపోయింది.

బలమైన ప్రత్యామ్నాయం

-అశోక్, ఎంసీపీఐ నాయకులు, బీఎల్‌ఎఫ్ కన్వీనర్



రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయంగా బీఎల్‌ఎఫ్ పనిచేస్తుంది. గట్టి సంకేతాలు పంపుతుంది. బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్‌లకు ఇదొక హెచ్చరిక. ప్రజాసమస్యలపై ఉద్యమిస్తాం. అణగారిన వర్గాలకు ఆసరాగా ఉంటాం.

టీఆర్ఎస్‌ది నియంతృత్వం


- గోరి రమేశ్, బీఎల్‌ఎఫ్ కన్వీనర్



టీఆర్ఎస్ ప్రభుత్వానిది నియంతృత్వ ప్రజావ్యతిరేక పాలన. కేసీఆర్ ప్రపంచ మోసగాడు. ప్రజలను తెలంగాణ ఉద్యమం పేరుతో మోసం చేశాడు. ఆయన ప్రభుత్వంలో మహిళలకు స్థానం లేదు. ఫెడరల్ ఫ్రంట్ పేరుతో దేశ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఓట్లు, సీట్లు మావే.

మహిళలెక్కడ?

- కేసీఆర్‌కు రేణుక సూటి ప్రశ్న



ప్రతియేటా బతుకమ్మ పండుగ చేస్తున్న కేసీఆర్‌కు, ఆ ఆట ఆడే మహిళలను పట్టించుకోవడం లేదు. ఆయన క్యాబినెట్‌లో మహిళలకు చోటులేదు. సామాజిక న్యాయం కోసం అందరూ ఒక పట్టుపట్టాలే. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక సమస్యలపై బీఎల్‌ఎఫ్ పనిచేస్తుంది. రాష్ట్రంలో మార్పు కోసం ప్రయత్నిద్దాం.



తెలంగాణ ఆర్థిక చత్రం, దాని భౌగోళిక, భౌతిక పరిస్థితిలో నిర్ణీతమయింది. ద్వీపకల్ప పీఠభూమిలో భాగమైన తెలంగాణ ప్రాంతం తుంగభద్ర, కృష్ణా నదులకు పశ్చిమాన ఉంది. రెండు పెద్ద నదులు- గోదావరి, కృష్ణాలు, వాటి ఉపనదులు మంజీర, ప్రాణహిత పెన్గంగ (గోదావరికి చెదినవి); తుంగభద్ర (కృష్ణా నదికి చెందినది) ఈ ప్రాంతం గుండా ప్రవహిస్తాయి. ఈ ప్రాంతంలో అధిక భాగం రాళ్ల మైదానం, పురాజంతు భౌగోళిక యుగం నాటి రాళ్లు, బండలతో నిర్మితమైన పీఠభూమి, అందులో ఎంతో ఖనిజసంపద కూడా అంతర్గర్భితమై ఉంది. మూడు భిన్నమైన నేలలు- నలుపు, ఎరుపు నేలలు, ఇసుక బంక నేలలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. తొలి మధ్యయుగపు కాలంలో ఈ ప్రాంతపు వ్యావసాయిక లక్షణాన్ని ఈ నేలల స్వభావం, జలవనరుల అందుబాటు నిర్ణయించాయి. ఈ భౌగోళిక నేపథ్యంలో మధ్యయుగ కాలం నాటి శాసనాల వెలుగులో నాటి తెలంగాణ ప్రాంత ఆర్థిక పరిస్థితులు ఎట్లా ఉన్నాయో చూద్దాం.

అలనాటి తెలంగాణ ఆర్థిక జీవనం

పశ్చిమ దక్కనులో పాలక వంశాలు రావటం, క్రీ.శ.7 నుండి 10 శతాబ్దాల్లో వారు క్రమంగా తెలంగాణలోకి చొచ్చుకొని పోయి దాన్ని అధీనం చేసుకోవడంతో సరిహద్దు గ్రామాల ఏకీకరణ జరిగింది. ఆ ఏకీకరణ వైయక్తిక బ్రాహ్మణులకు, బ్రాహ్మణ బృందాలకు భిన్న గ్రామాల్లో భూమిని దానం చేసిన క్రమంలో సాధ్యమయింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే అట్లా దానం ఇవ్వబడిన గ్రామాలు అగ్రహారాలుగా పేర్కొనబడలేదు. అంటే అర్థం- ఈ బ్రాహ్మణులు కొంత ఆదాయాన్ని రాజ్యానికి చెల్లించాలి. అయితే క్రీ.శ.613 నాటి రెండవ పులకేశి హైదరాబాదు శాసనం... ఒక బ్రాహ్మణుడు గ్రామంలోని నిధి, ఉపనిధి వంటి వాటినన్నింటిని అనుభవించాలని చెప్పటం వల్ల అది పన్ను మినహాయింపు దానం అని అర్థమవుతుంది. ఆపైన ఈ దానాలన్నీ సేద్యం చేయని భూముల్లో ఇవ్వటం జరిగింది. ఎందుకంటే భూమి దానం సాక్షుల ముందు చేసిన ప్రసక్తి కనిపించదు. అట్లా తెలంగాణలో మారు మూలల గ్రామాలు ఆకాలపు వ్యావసాయిక ఆర్థిక వ్యవస్థకు చెందిన ప్రధాన ప్రవాహంలో ఏకీకరణం చెందాయి.

పెద్ద పెద్ద గ్రామాలే కాక, భూమిని చిన్న పరిమాణాలలో మర్తులు లేక మత్తర్‌లతో కొలిచి దానమిచ్చేవారు. ఆ కొలతలు నివర్తనాలు, ఖండుగలు, రాజమాన లేక రాచమాన లకు సమానం. ఇది ముఖ్యంగా క్రీ.శ.9వ శతాబ్దం నుండి జరిగింది. ఇవి సామాన్యంగా స్థానిక నాయకులు దేవాలయాలకు ఇచ్చిన దానాలు కనుక ఆ భూములు చిన్న పరిమాణంలో ఉండేవి.

భూమి రకాలు

ఈ కాలపు శాసనాల్లో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, దానం చేసిన భూమి ఏ రకానికి చెందినదో చెప్పాలి. అట్లా మనకు కరియనేల (నల్లభూమి), నీరు నేల లేక పనియ క్షేత్రం, పన్నస లేక మాగాణి, రాజ్యభూమి, పూదోంట, పూవిన తోంట లేక పూలతోట, భూ (భూమి) లాంటి నేలలు దర్శనమిస్తాయి. కరియనేల సారవంతమైనది. పత్తి, నూనెగింజలు, చెరకు, వరి పంటలకు తగినటువంటిది. ఈ నేల ఎక్కువ కాలం నీటిని నిల్వ ఉంచుకోగలదు. శాసనాల్లో దాన్నే నీరు నేల, పనియ క్షేత్రం, పన్నస భూమి అనీ పేర్కొన్నారు. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ ఖమ్మం జిల్లాల్లోని కృష్ణా, గోదావరీ పరివాహక ప్రాంతాల్లో సామాన్యంగా ఇట్లాంటి భూమి కనిపిస్తుంది. పూదోంట లేక తోట భూములు, ఎర్రమట్టి భూములు అంత సారవంతమైనవి కావు. అయితే వాటికి క్రమంగా నీటి సరఫరా జరిగితే అవీ సారవంతమైన భూములు అవుతాయి. అయితే మొదటి విక్రమాదిత్యుని గద్వాల్ శాసనంలో తప్ప మరెక్కడా ఆకాలపు శాసనాల్లో పండించే పంటల సమాచారం మనకు లభించదు. ఆ శాసనం 50 నివర్తనాల భూమిని ముగ్గురు బ్రాహణులకు వడ్లు పండించుకోవడానికి దానమిచ్చినట్లు చెబుతుంది.

నీటి పారుదల

తగినంత వర్షపాతం, జలాధారం లేకపోవడం వల్ల అంతగా ఉత్పాదనకు సరిపోని నలుపు, ఎర్ర నేలలు ఉండటం వల్ల ఈకాలంలో వ్యావసాయిక అభివృద్ధి కృత్రిమ నీటి పారుదల ఏర్పాట్ల వల్ల సాధ్యపడింది. ఈ ఏర్పాట్లు తరువాతి కాలంలో, ఈ ప్రాంతంలో మరింత ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. జీవనదులు తక్కువవ్వటం, పెద్ద నీటి పారుదల, కాల్వల విధానాలు అరుదవ్వటం వల్ల అనుకూలమైన ప్రదేశాల్లో చెరువులు నిర్మించి నీటిని నిల్వ ఉంచుకునేవారు. చిన్న సెలయేళ్లను అడ్డగించి కృత్రిమ జలాధారాలను నిర్మించారు. నీరు బయటికి పోయే మార్గాలను నిరోధించి సరస్సులను విస్తృత పరిచారు. ఈ జలాశయాలను శాసనాలు కెరె, తటాకం, సముద్రం, కుంట (చెరువు) అని పేర్కొన్నాయి. ఉదాహరణకు మెదక్ జిల్లాలోని ఒక శాసనం పది వోజన చెరువు అని పేర్కొంది. మరోశాసనం మహబూబ్ నగర్ జిల్లాలోని భీమసముద్రంను పేర్కొంటున్నది. రాజులు, వారి సామంతులు, గవుండులు లాంటి ధనిక రైతులు ఈ కాలపు నీటిపారుదల పనులను చేపట్టారు. పుణ్యం సంతరించిపెట్టే సప్త సాధనాలలో చెరువుల నిర్మాణం ఒకటిగా నమ్మేవారు. విరాళాలు సేకరించి పెద్ద చెరువులు తవ్వించి నిర్వహించేవారు.



పన్నులు

రైతులు రకరకాలైన పన్నులు చెల్లించేవాంరు. అవి అసాధారణమైనవి కూడా. సామాన్యంగా మొత్తం పంటమీద భూమిపన్నును విధించేవారు. సాలుసరి నిశ్చిత నగదు చెల్లింపులు, రాజ్యానికి చెందిన చెరువు లేక కాలువ నీటి వినియోగంపై విధించే సుంకం, ఇంటిపన్ను, పెండ్లిపన్ను, మరెన్నో పన్నులను వసూలు చేసేవారు. క్రీ.శ.ఏడవ వతాబ్దానికి చెందిన రెండవ పులకేశి హైదరాబాదు శాసనం మరకప్పి గ్రామాన్ని నిధి, ఉపనిధి, క్లిప్త (భూమిపన్ను నిర్ధారణ), ఉపకారిక (ఇతరపన్నులు)లతో ఇచ్చినట్లు పేర్కొంటున్నది. ఇటువంటి మామూలు పన్నులు కాక, అప్పుడప్పుడు పాన్ (బంగారం పన్ను) లాంటివి ప్రతి గ్రామంపై విధించేవారు. ప్రత్యేక సందర్భాల్లో విధించిన ఆ పన్నులను వస్తు రూపేణా స్వీకరించేవారు. అట్లా వస్తురూపేణా చెల్లించే పన్నులే కాక, నాణ్ణేల రూపంలో నగదు చెల్లింపులు కూడా ఉండేవి. ఆ నాణేలను శాసనాలు ద్రమ్మలు, అరువనలు అని పేర్కొన్నాయి. నాణేల ఉనికిని గూర్చి, శ్రేష్ఠి వ్యాపార బృందాలను గురించి ఈ ప్రాంతంలో ప్రస్తావితమవ్వటం, వ్యవసాయిక ఉత్పాదనల ముఖ్య వినియోగదారుగా దేవాలయం మారటంలో వ్యాపార, వాణిజ్యాలు ఊపందుకుంటున్నందుకు సూచన. వ్యావసాయిక ఉత్పాదనల పెంపు నీటిపారుదల సౌకర్యాల పెంపునకు దారితీసింది. ఇందుకు రాజ్యం, ఇతర పౌరులు ప్రోత్సాహం కలిగించారు. పెరుగుతున్న వ్యవసాయిక కలాప క్రమం, తరువాతి కాలంలో దేవాలయ ప్రాదుర్భావం, అలంపురం, హనుమకొండ, వేములవాడ, పొలాస వంటి పట్టణ వాణిజ్య కేంద్రాలు అయ్యావోలి-500, ఉభయ నానాదేశులు, నకరముల లాంటి వ్యాపార సంఘాలు తలెత్తటానికి కారణమయ్యాయి.





ఇట్లా పాలకవర్గ నాయకులు, స్థానిక శ్రేష్ఠులు, స్థానిక ప్రాంతాల ఇతర ప్రముఖ సభ్యుల ప్రోత్సాహంతో తెలంగాణ ప్రాంతంలో వ్యావసాయిక విస్తరణ, కృత్రిమ నీటిపారుదల సౌకర్యాల అభివృద్ధి రూపంలో ఆర్థిక ఏకీకరణ క్రమం అప్పుడే ప్రారంభమైందని చెప్పవచ్చు. చిన్న భూభాగాలను దానం చేసిన ఆలయాలను కొన్నింటిని ప్రస్తావించడం వల్ల దేవాలయాలకు దానం చేసే ఆర్థిక వ్యవస్థ కూడా ప్రారంభ దశలోనే ఉందని చెప్పుకోవచ్చు.

- డా॥ పి.అరుణ

పిట్టలవారి బతకు పోరాటం

తెలంగాణలో పిట్టలోళ్లు అని పిలుస్తున్న పార్థీలు ఇక్కడికి ఉత్తరాది, మధ్య భారత దేశం నుంచి వలసవచ్చారు. తెలంగాణలో సిద్ధిపేట, ఆదిలాబాద్, హైదరాబాదు వంటి చోట్ల వీరు బతుకులు వెళ్లదీస్తున్నారు. సిద్ధిపేట ప్రాంతంలో ప్రయాణిస్తున్న 'జాతర' ప్రతినిధికి కొండ పక్కన చిన్న చిన్న గుడిసెలు వేసుకొని జీవిస్తున్న 'పిట్టల'వారు కనిపించారు. వారితో మాట కలిపినప్పుడు ఎన్నో సంగతులు మాట్లాడారు. ఆ సంగతులకు మరింత సమాచారం జోడించి ఇస్తున్న వ్యాసం ఇది.

పార్థీలు తమదైన ప్రత్యేక జీవన శైలిని కలిగి ఉంటారు.వీరిని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. మొదటి రకంవారు వేటాడటం ద్వారా జీవిస్తే రెండో రకం వారు రాళ్లపని చేసి బతుకుతారు. మొదటి రకంవారు గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ల్లో ఎక్కువగా ఉంటే; రెండో రకంవారు ప్రధానంగా రాజస్థాన్‌లో ఎక్కువగా కనిపిస్తారు. రాణాప్రతాప్ మరణించినప్పుడు ఈ ప్రజలు చాలా కష్టాలు అనుభవించినట్లు చెబుతారు. ఆ సమయంలో వారు మహారాష్ట్ర వలసవచ్చారు. పార్థీ ప్రజలు తమ చుట్టుపక్కలున్న భిల్లు తెగకన్నా భిన్నంగా ఉంటారు. వీరు కుల వ్యవవస్థను తీవ్రంగా వ్యతిరేకించారు. అందువల్లే వీరు ఎవరితోనూ కలవకుండా స్వతంత్రంగా తమ కోసం కొన్ని ఆచార, సంప్రదాయాలను ఏర్పరచుకున్నారు. వారు వేట, యాచక వృత్తుల వంటివాటినైనా ఎంచుకోవడానికి ఇష్టపడ్డారు కాని తమ





సాంఘిక మర్యాదను తగ్గించే హిందు సామాజిక వ్యవస్థలో కలిసిపోవడానికి మాత్రం ఇష్టపడలేదు.

ముంబయి ప్రాంతంలో చాలామంది పార్థీలు నివసిస్తున్నారు. సంచార జీవితం గడుపుతూ అక్కడక్కడ చిన్న చిన్న పూరి గుడిసెలు, తాత్కాలిక షెల్టర్లు నిర్మించుకుని వీరు నివసిస్తున్నారు. వీరు ముఖ్యంగా పక్షులను వేటాడుతారు. గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో ఉన్నవారు పాములు పట్టడంలో ప్రావీణ్యం గడించారు. అందువల్ల వీరు పాములను ఆడించడాన్ని వృత్తిగా బతుకుతున్నారు. చాలామంది బుట్టలు అల్లడం, నల్లరాతితో వస్తువులు తయారుచేయడం వంటి వృత్తుల్లోనూ ఉన్నారు.

చిన్న చిన్న బృందాలుగా బతుకుతూ వలలు, ఉచ్చుల ద్వారా వేటాడటం కనిపిస్తుంది. అట్లాగే రాళ్లపని చేసేవారు ఊళ్ల ల్లో ఇంటింటికి తిరుగుతూ రోళ్లు, తిరగళ్లు వంటివాటికి కక్కు కొడుతూ బతుకడం సాధారణ దృశ్యం. పార్థీలు తమ ఉపకులాల వారిని మాత్రమే వివాహం చేసుకుంటారు. ఇక వీరి నమ్మక వ్యవస్థ సంగతికి వస్తే... వందల ఏండ్లుగా వారు తమకే ప్రత్యేకించిన విశ్వాసాలు కలిగి ఉన్నా హిందు ఆచార సంప్రదాయాల ప్రభావం కూడా వారి మీద ఉంది. . వారు ఆత్మలను నమ్ముతారు. అవి ఈ భౌతిక ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయని విశ్వసిస్తారు. బహుదేవతారాధన చేస్తారు. ఎంతోమంది దేవతలు, దేవుళ్ల వారి ఆధ్యాత్మిక ప్రపంచంలో పూజలందుకుంటారు. హైదరాబాదులో ఉన్న పిట్టలవారు తమ ఆడపడుచు ఒకరిని గుర్తు చేసుకుంటూ జాతర కూడా చేస్తారు.

ఆదివాసీ జీవనమే...

సిద్ధిపేట ప్రాంతంలో ఉన్న పిట్టలవారు అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్నారు. 'జాతర' ప్రతినిధి వారి గుడిసెలను చూసినప్పుడు అవి గట్టి గాలి వచ్చినా లేచిపోయేలా కనిపించాయి. ప్లాస్టిక్ పట్టాలను పైకప్పుగా ఉన్న చిన్న చిన్న ఈ షెల్టర్లను గుడిసెలు అని కూడా అనలేం. అక్కడ ఉన్న పది పన్నెండు గుడిసెల్లో ఒకరిద్దరు తప్ప మిగతావారంతా పనుల కోసం బయటికి వెళ్లారు. అచ్చంగా అడవిలో నివసించే తెగలమాదిరిగానే వారి జీవనం ఉన్నట్లు కనిపించింది. వంట చేసుకున్న పాత్రల్లోని ఆహారం కుక్కలు, పక్షులు, చీమల పాలు కాకుండా... వారు ఒక స్తంభాన్ని గుడిసె బయట పాతి దానికి ఒక గుడ్డను జోలె (ఉట్టి)లాగా కట్టి అందులో పాత్రలు ఉంచుకున్నారు.

వారు వలను ఎట్లా పన్నుతోరో ప్రదర్శించి చూపారు. పిట్టలను పట్టుకొని అమ్ముకోవడం ద్వారా జీవిస్తున్నా... వీరు ప్రస్తుతం ఆ వృత్తిని వదిలి వేరే జీవన ఉపాధిలను అనుసరిస్తున్నారు. కొంతమంది కూలికి వెళ్లడం, పొలాలను, తోటలను గుత్తకు తీసుకోవడం, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడం ద్వారా ఇక్కడి పిట్టలవారు తమ జీవితాన్ని మెరుగుపరుచుకునే దారిలో ఉన్నారు. దుర్భర జీవితం గడుపుతున్న పిట్టలవారిని ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని ఏండ్లు గడిచిపోయినా పిట్టలవారి వంటివారు ఎందరో ఇంకా అమానవీయ పరిస్థితుల్లో జీవించడం బాధాకరం.

- శివ




సంస్కృతిని జీవితో పోల్చవచ్చా?

ప్రాచీనులు సంస్కృతిని మనం అర్థం చేసుకున్న పద్ధతిలో అర్థం చేసుకోలేదు. అసలు వారికి ఆ భావనే లేదు. అయినా వారు చరిత్ర తత్వాన్ని 'చర్విత చర్వణం'గా దర్శించారు. గ్రీకులకు, రోమన్లకు చరిత్ర ఒక చక్రం వంటిది. చరిత్ర చక్రం వలే లేదా సంవత్సరంలోని రుతువుల వలే పునరావృతం అవుతుంది. చరిత్ర గతిలో ప్రగతి, పతనం రెండూ ఉన్నాయి. మానవ జీవితం నిర్దిష్ట కాలంలో వినాశం పొంది, తిరిగి అమాయకత, సరళత, స్వచ్ఛతలనే "స్వర్ణయుగ" ప్రాతిపదికపై పునర్జీవిస్తుందని సెనెకా చెప్పాడు. కళలు, పరిశోధనలు, సమృద్ధ, విషయ సుఖం పతనానికి దారితీస్తాయన్నాడు.

ఈ సిద్ధాంతాన్నే నవీనులలో నీచే, స్పెంగ్లర్‌లు పునరుజ్జీవింపచేశారు. స్పెంగ్లర్ జర్మనీలోని మ్యూనిక్‌లో గణిత శాస్త్రజ్ఞుడు. తన సిద్ధాంతాలను 'పాశ్చాత్యుల పతనం' (ది డిక్లైన్ ఆఫ్ వెస్ట్) అనే గ్రంథంలో వివరించాడు. ఇతడు సంస్కృతిని పెరిగి విరిగే పువ్వుతోనో, జంతువుతోనో లేదా జీవితోనో పోలుస్తాడు. అందుకనే దీనిని జైవిక సిద్ధాంతం (ఆర్గానిస్మిక్ థియరీ) అనికూడా అనవచ్చు. ఇతడి సిద్ధాంతం ప్రకారం సంస్కృతి జీవి వలె పుడుతుంది, పెరుగుతుంది, గిట్టుతుంది. ఈ దశలను అది క్రమంగా అనుసరిస్తుంది. పూవు లేదా జీవి వాటి కర్మ(డెస్టిని) అనుసారం పుడతాయి, గిట్టుతాయి. అంతేకాని వాటికి తమదంటూ ఒక సొంత ఉద్దేశం' ఉండదు అంటాడాయన. స్పెంగ్లర్ మతంలో 'కర్మ' అంటే కార్యాకరణ భారం, ప్రతిదీ చతుర్దశా చక్రంలో గమించవలసిందే.

ఇతడి ప్రకారం సంస్కృతికి రుతువుల వలె లేదా మానవునికి వలె నాలుగు దశలున్నాయి. మొదటి దశ వసంతరుతువు లేదా బాల్యం. సంస్కృతి బాల్యదశలో ఉన్నప్పుడు మానవులు ఒక చోట కుదురుకొని, నేలను అంటిపెట్టుకొని ఉంటారు. రెండవ దశ వేసవి లేక కౌమారం. ఈ దశలో సాంస్కృతిక జీవితారంభం జరుగుతుంది. సంస్కృతి



చైతన్యవంతమవుతుంది. పక్వమవుతుంది. దీనిని పాశ్యాత్య దేశాల్లో వచ్చిన పునర్వికాసం (రినైజాన్స్)గా గుర్తించవచ్చు. మూడవది శరదావసానం లేదా యౌనం. ఈ దశలో సంస్కృతి పరిణతి చెందుతుంది. పండిపోతుంది. ఈ దశలో వాణిజ్యం ఎక్కువవుతుంది. నగరాలు పరిఢవిల్లుతాయి. చివరిది శీతాకాలం లేదా వృద్ధాప్యం. ఈ దశలో గుణాన్ని పరిమాణం, సౌందర్యాన్ని ప్రయోజనం ఆక్రమిస్తాయి.

సంస్కృతి ముసలిదైనప్పుడు జీవితం కృతకంగా నిస్సారంగా తయారవుతుంది. మనం సంస్కృతి అని పిలిచేదంతా లుప్తమవుతుంది. మధ్యతరగతివారు వర్తకులుగా తయారవుతారు. నగరాలు యంత్రమయాలు అవుతాయి. ధనం రాజ్యమేలుతుంది. గౌరవ మర్యాదలు ధనవంతులకే. ఐశ్వర్యమనేది తెలివితేటలు, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తుంది. మానవుడు పరిశ్రమకు బానిస అవుతాడు. సామ్రాజ్యవాదం పెరుగుతుంది. "జాతి ఆత్మహత్య"కు నాంది పలుకుతుంది. నగరవాసులలో ఎక్కువ మంది షండులై సంతానహీనులవుతారు. అజ్ఞత విజ్ఞతను జయిస్తుంది. సంచయవాదం పెచ్చుమీరుతుంది. అంటాడు స్పెంగ్లర్.

స్పెన్సర్, కూలె, ఆల్‌ఫ్రెడ్ ఫౌలీలు కూడా జైవిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. "జీవిలోని వివిధ అవయవాలు ఒకదానితో ఒకటి పొరపొచ్చాలు లేకుండా ఆ జీవి మనుగడకు అన్నీ కలిసికట్టుగా ఎట్లా పనిచేస్తాయో అట్లాగే సంస్కృతిలోని వివిధ అంశాలు " అని వీరు అన్నారు.

అయితే సంస్కృతిని జీవి అనడం అసంగతం. ఎందువల్లనంటే సంస్కృతి జీవి కాదు. జీవి వలె సంస్కృతి తినదు, తాగదు, బిడ్డల్ని కనదు. జీవికి బాల్య, కౌమార, యవ్వన, వార్థఖ్యాలు ఉంటాయి. సంస్కృతికి ఉండవు. జీవిని ఉపమానంగా గ్రహిస్తే తప్పు లేదు కాని సంస్కృతే జీవి అంటే కుదరదు అనేది పరిశోధకుల వాదం.

-ఎ.వి.రెడ్డి



ఖతర్నాక్ కార్తీక్

2004, సెప్టెంబర్ 5 లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో మూడో వన్డే. గంగూలీ (90) ఇన్నింగ్స్‌తో భారత్ 204 పరుగులు చేసింది. స్వల్ప ఛేదనలో ఇంగ్లాండ్ కెప్టెన్ మైకెల్ వాన్ (74) చెలరేగిపోతున్నాడు. మ్యాచ్ భారత్‌కు మరింత దూరమవుతున్న క్షణాలవి. అప్పుడే వికెట్ల వెనకాల తొలిసారి పెద్ద పరీక్ష ఎదుర్కొంటున్న ఆ కుర్రాడు అద్భుతం చేశాడు. హర్భజన్ సింగ్ సంధించిన బంతి వికెట్లకు ఆవలగా వెళ్లగా.. వికెట్లకు సమాంతరంగా దూసుకెళ్లి డైవ్ చేస్తూ మైకెల్ వాన్‌ను స్టంప్డ్ అవుట్ చేశాడు. ఆ మ్యాచ్‌లో భారత్ 23 పరుగులతో గెలవటమే కాదు 2-1తో వన్డే సిరీస్‌నూ సొంతం చేసుకున్నది. అరంగ్రేటంలోనే కండ్లుచెదిరే స్టంపింగ్‌తో అందరి దృష్టి ఆకర్షించిన ఆ కుర్రాడు దినేశ్ కార్తీక్.

14 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో అరంగ్రేటంలో చేసిన అద్భుతమే కార్తీక్ అత్యుత్తమం. మళ్లీ ఇన్నాండ్లకు కొలంబోలో లార్డ్స్ ప్రదర్శనను మరిపించే ఇన్నింగ్స్ ఆడాడు దినేశ్ కార్తీక్. జాతీయ జట్టులో చోటు కోల్పోయి ఎన్నో ఆటుపోట్లకు గురైనా.. కొలంబోలో ఖతర్నాక్ ఇన్నింగ్స్‌తో 'డికె ఈజ్ బ్యాక్' అనిపించాడు!.

నవతెలంగాణ క్రీడా విభాగం


- ఒక్క ఇన్నింగ్స్‌తో స్టార్‌డమ్ సొంతం
- వీరోచిత షాట్లతో మరపురాని మెరుపులు

నాలుగేండ్ల క్రితం బెంగళూర్‌లో ఐపీఎల్ ఆటగాళ్ల వేలం. వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ జాబితాలో దినేశ్ కార్తీక్ (డికె) పేరు వేలానికి వచ్చింది. అతడిని సొంతం చేసుకునేందుకు అన్ని ప్రాంఛైజీలు పోటీపడ్డాయి. ఢిల్లీ డెర్‌డెవిల్స్ రూ. 12.5 కోట్లకు డికెను దక్కించుకున్నది. తర్వాత ఏడాది రూ. 10.5 కోట్లకు రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ అతడిని కొనుగోలు చేసింది. జాతీయ జట్టులో లేడు, దేశవాళీలో మెరుగైన ప్రదర్శన చేస్తోన్నా.. మ్యాచ్ విన్నర్ కాడు. అయినా, దినేశ్ కార్తీక్‌కు వేలంలో అనూహ్య డిమాండ్. ప్రాంఛైజీలు అతడి వెనక పడటం క్రికెట్ విశ్లేషకులను సైతం విస్మయపరిచింది. ఈ ఏడాది కోల్‌కత నైట్‌రైడర్స్ దినేశ్ కార్తీక్‌ను రూ. 7.4 కోట్లను తీసుకున్నది. ఈ సీజన్‌కు అతడికి సారథిగానూ ప్రకటించింది. దేశవాళీలో రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించినా.. అటు నాయకుడిగానే కాదు ఆటగాడిగానూ కార్తీక్ నిరూపించుకోనేలేదు. అతడికి ఎందుకంత ప్రాధాన్యత, డిమాండ్ అనే విషయం కొందరి అర్థం కాలేదు!. కోల్‌కత కెప్టెన్‌గా ఎన్నికై నేరుగా ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాల్గొన్న దినేశ్ కార్తీక్.. శ్రీలంకతో రెండో లీగ్ మ్యాచ్‌లో అజేయంగా 39 పరుగులు చేశాడు. కానీ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై అతడి వీరోచిత విధ్వంసం.. కార్తీక్‌ను ఎక్కడో శిఖరాన నిలిపింది. 12 బంతుల్లో 34 పరుగులు చేయాల్సిన దశలో విజయం అసాధ్యమనే భావన అందరిలోనూ వచ్చేసింది. ఇటువంటి తీవ్ర ఒత్తిడిలోనూ డికె హీరోయిక్స్ అతడిని భారత క్రికెట్‌లో ఒక్క రోజులోనే హీరోను చేశాయి. 8 బంతుల్లోనే 29 పరుగులు కొట్టేసిన దినేశ్ కార్తీక్.. ఇప్పుడో స్టార్ క్రికెటర్!. ఐపీఎల్ 11వ సీజన్‌లో దినేశ్ కార్తీక్‌తో పాటు కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఇది ఎంతో ఉపయుక్తమైనది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ఏడాదిగా జాతీయ జట్టు ప్రణాళికల్లో : ప్రస్తుత జట్టులోని సీనియర్ ఆటగాళ్ల కంటే ముందే అరంగ్రేటం చేసినా, దినేశ్ కార్తీక్ గతేడాది నుంచి జాతీయ జట్టు ప్రణాళికల్లో రెగ్యులర్ ఆటగాడిగా మారాడు. మధ్యలో కొన్నిసార్లు జాతీయ జట్టు తలుపు తట్టినా.. ఓసారి బ్యాటింగ్, మరోసారి వికెట్ కీపింగ్ కార్తీక్‌ను వెనక్కి లాగింది. కానీ దేశవాళీలో మంచి ఫామ్ కొనసాగిస్తూనే.. బ్యాటింగ్, వికెట్ కీపింగ్ నైపుణ్యంపై కార్తీక్ శ్రద్ధ వహించాడు. అది ఇప్పుడు కొలంబో వీరోచిత ఇన్నింగ్స్ రూపంలో సత్ఫలితాన్నిచ్చింది. సీనియర్ ఆటగాళు ఉన్నప్పటికీ దినేశ్ కార్తీక్ జట్టులో చోటుచేసుకుంటున్నాడు. కానీ తుది జట్టులో అవకాశమే అతడి దాకా రావటం లేదు. ఇప్పుడు కొలంబో ఇన్నింగ్స్‌తో కార్తీక్ తనెంటో నిరూపించుకున్నాడు. ప్రత్యర్థి బంగ్లాదేశ్ కదా అని కార్తీక్ ఇన్నింగ్స్ తక్కువ చేసే ప్రయత్నానికి ఎటువంటి ఆస్కారం లేదు. బంగ్లా ఇటీవల ఎంతో పరిణతి చెందింది. అగ్రజట్లను ఓడించటం బంగ్లాకు ఇప్పుడు సాధారణ విషయంగా మారిపోయింది!. ఇక రూబెల్ హొస్సేన్ బౌలింగ్‌లో 19వ ఓవర్ ఆఖరి బంతిని స్వీప్ షాట్‌తో బౌండరీ దాటించిన కార్తీక్.. ఆధునిక క్రికెట్‌కు అవసరాల మేరకు తనెంత కష్టపడుతున్నాడో చూపించాడు. ఏబీ డివిలియర్స్, కెవిన్ పీటర్సన్‌లు మాత్రమే ఇప్పటివరకూ ఇటువంటి షాట్లను సక్సెస్‌ఫుల్‌గా ఆడారు. ఇప్పుడా జాబితాలోకి దినేశ్ కార్తీక్ చేరేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. బౌలర్ ఎక్కడ బంతి వేస్తాడో ముందుగానే ఓ అంచనాకు వచ్చిన కార్తీక్ అందుకు అనుగుణంగానే స్టాండ్స్‌ను మార్చుకుని బంతిని అలవోకగా బౌండరీ దాటించాడు. లో ఫుల్ టాస్‌ను లాంగ్ ఆన్‌లో సిక్సర్ బాదినా, ఫుల్ లెంగ్త్ బంతిని స్క్వేర్ లెగ్ మీదుగా భారీ సిక్సర్‌గా మలిచినా.. ఫుట్‌వర్క్‌లో చేసుకున్న స్వల్ప మార్పులు ఎంతగానో ఉపకరించాయి. 'వినూత్న షాట్లను కొంత కాలంగా సాధన చేస్తున్నాను. బలమైన స్టాండ్‌తో అలవోకగా బాదగలను. గత కొన్ని మాసాలుగా నాకు మద్దతుగా నిలిచిన సహాయక సిబ్బందికి కృతజ్ఞతలు' అని దినేశ్ కార్తీక్ మ్యాచ్ అనంతరం పేర్కొన్నాడు.

సినిమా చూపిస్తాడా! : ముక్కోణపు ఫైనల్లో దినేశ్ కార్తీక్ బ్యాటింగ్ భావోద్వేగం గమనిస్తే ఓ విషయం అర్థమవుతోంది. అంతటి ఒత్తిడిలోనూ కూల్‌గా కొట్టేసిన కార్తీక్.. కొలంబోలో కేవలం ట్రైలర్ మాత్రమే చూపించాడు. ఐపీఎల్ కోసం సన్నద్ధమవుతున్న కార్తీక్.. మరిన్ని వినూత్న షాట్లకు అక్కడ విశ్వరూపం చూపించే అవకాశం లేకపోలేదు. మంచి ఫుట్‌వర్క్, బంతిని అంచనా వేయటం, టైమింగ్‌కు టెక్నిక్‌ను జోడించి బంతిని బలంగా బాదటం కార్తీక్ బ్యాటింగ్ శైలిలో వచ్చిన గొప్ప మార్పు. ఐపీఎల్‌లో సక్సెస్‌ఫుల్ జట్టుగా సారథ్యం వహించబోతున్న దినేశ్ కార్తీక్.. ఇక ఐపీఎల్‌లో బ్యాటింగ్ విన్యాసాలతో పూర్తి సినిమా చూపిస్తాడేమో!

> ఈ వీరోచిత ఇన్నింగ్స్ భావన అమోఘం. ఇటువంటి ఇన్నింగ్స్ జీవితకాలం గుర్తుండిపోతుంది. నరాలు తెగే ఉత్కంఠ రేపిన ఛేదనలో ప్రతి బంతినీ బౌండరీ బాదాలనే ఆలోచనతో ఉన్నాను. బంతిని అంచనా వేసి, క్రీజులో మార్పులు చేసుకోవటం గొప్ప ఫలితాన్ని ఇచ్చింది. లీగ్ దశలో భారత్, బంగ్లా మ్యాచ్‌లకు పెద్దగా అభిమానులు రాలేదు. కానీ ఫైనల్లో శ్రీలంక అభిమానులు పెద్ద యెత్తున స్టేడియానికి రావటమే కాదు టీమ్ ఇండియా మద్దతు తెలిపారు. ఈ ఇన్నింగ్స్‌కు అభిమానుల మద్దతు తోడుగా నిలిచింది'
>
> – దినేశ్ కార్తీక్





2004లో ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ మైకెల్ వాన్‌ను స్టంప్డ్ అవుట్ చేస్తున్న యువ దినేశ్ కార్తీక్.

ఆ సిక్సర్ చూడలేదు

విన్నింగ్ షాట్‌పై రోహిత్ శర్మ



కొలంబో : ప్రస్తుతం ఏ ఇద్దరు క్రికెట్ ప్రియులు కలిసినా.. చర్చంతా దినేశ్ కార్తీక్ ఆఖరి బాల్ సిక్సర్ గురించే నడుస్తోంది. తీవ్ర ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో కార్తీక్ సొగసరి సిక్సర్ అభిమానుల మదిలో నిలిచిపోయింది. స్టేడియంలోని అభిమానులే కాదు భారత డ్రెస్సింగ్‌రూమ్ ఆటగాళ్లు సైతం ఆ షాట్‌ను విపరీతంగా ఆస్వాదించారు. కానీ భారత కెప్టెన్ రోహిత్ శర్మకు ఆ భాగ్యం దక్కలేదు. ఎందుకంటే, ఆఖరి బంతికి ఐదు పరుగులు కావాల్సిన దశలో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళుతుందని అంచనా వేసిన రోహిత్.. ప్యాడ్లు కట్టుకునేందుకు డ్రెస్సింగ్‌రూమ్ లోపలికి వెళ్లాడు. కానీ అతడు బయటకు వచ్చే లోపే క్రికెట్‌లో ఓ అద్భుత విన్యాసం చోటుచేసుకున్నది. ఈ విషయాన్ని రోహిత్ శర్మ మీడియా కాన్ఫరెన్స్‌లో వెల్లడించాడు.

కార్తీక్ అప్‌సెట్ అయ్యాడు! : ఏడో స్థానంలో యువ ఆటగాడు విజయ్ శంకర్ క్రీజులోకి రాగానే.. కార్తీక్‌ను పంపాల్సిందనే వ్యాఖ్యలు వినిపించాయి. డ్రెస్సింగ్‌రూమ్‌లో కార్తీక్ సైతం బ్యాటింగ్ ఆర్డర్ డిమోషన్‌పై అసంతృప్తిగానే ఉన్నాడట. ఈ విషయాన్ని కెప్టెన్ రోహిత్ చెప్పాడు. 'దినేశ్ కార్తీక్ ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వెళ్లాలి. కానీ ఆఖర్లో అనుభవం ఉన్న ఆటగాడు ఉండటం అవసరమని భావించాం. అందుకే కార్తీక్‌ను ఎనిమిదో స్థానంలో వెళ్లమని చెప్పాం. దీంతో కార్తీక్ నిరుత్సాహపడ్డాడు. కానీ ఇప్పుడు తుది ఫలితం తర్వాత అతడు మిక్కిలి ఆనందంతో ఉన్నాడనే భావిస్తున్నాను' అని రోహిత్ శర్మ అన్నాడు. ఆఖరి బంతిని సిక్సర్‌గా మలిచిన దినేశ్ కార్తీక్... ఇలా ఇన్నింగ్స్ ఆఖరి బంతిని స్టాండ్స్‌లోకి పంపి విజయాన్ని అందించిన తొలి భారత క్రికెటర్‌గానూ రికార్డు సృష్టించాడు.



చాహల్ నం.2

- 151 స్థానాలు ఎగబాకిన వాషింగ్టన్
- ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్

దుబాయ్ : ముక్కోణపు టీ20 సిరీస్‌లో టీమ్ ఇండియా స్పిన్ జోడీ అదరగొట్టింది. యుజ్వేంద్ర చాహల్, వాషింగ్టన్ సుందర్‌లు సిరీస్‌లో చెరో ఎనిమిది కూలగొట్టారు. దీంతో ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో వీరి స్థానాలు సైతం గణనీయంగా మెరుగయ్యాయి. మణికట్టు మాయగాడు చాహల్ కెరీర్ అత్యుత్తమ 706 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానానికి చేరుకున్నాడు. 12 స్థానాలు మెరుగైన చాహల్ ఒక్కసారిగా నం.2 స్థానాన్ని ఆక్రమించాడు. ప్రధానంగా పవర్ ప్లేలో కండ్లుచెదిరే బంతులతో ఎకానమీ రేటు 5.70 సాధించిన వాషింగ్టన్ సుందర్ ఏకంగా 151 స్థానాలు ఎగబాకాడు. ప్రస్తుతం వాషింగ్టన్ 31వ స్థానంలో నిలిచాడు. జైదేవ్ ఉనద్కత్ 26, షార్దుల్ ఠాకూర్ 76వ స్థానాల్లో నిలిచారు. బ్యాట్స్‌మెన్ జాబితాలో దినేశ్ కార్తీక్ 126వ స్థానం నుంచి 95కు రాగా.. శిఖర్ ధావన్, మనీశ్ పాండే స్థానాలు మెరుగుపర్చుకున్నారు.

నన్ను క్షమించండి!

భారత్‌తో నిదహాస్ ట్రోఫీ ఫైనల్లో 19వ ఓవర్లో దినేశ్ కార్తీక్ ధాటికి రూబెల్ హొస్సేన్ ఏకంగా 22 పరుగులు సమర్పించుకున్నాడు. మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చివేసిన ఓవర్ అది. దీంతో బంగ్లాదేశ్ అభిమానులకు రూబెల్ క్షమాపణలు చెప్పాడు. 'మ్యాచ్ ముగిసినప్పటి నుంచి ఎంతో బాధగా ఉంది. మ్యాచ్‌లో బంగ్లా విజయానికి ఇంత చేరువగా వస్తుందని, తర్వాత ఓటమిని ఊహించలేదు. అందరికీ క్షమాపణలు చెబుతున్నాను. అభిమానులు నన్ను మన్నిస్తారనే ఆశిస్తున్నాను' అని ఫేస్‌బుక్‌లో రూబెల్ పేర్కొన్నాడు.

నాగిని డ్యాన్స్ స్పెషల్!



కొలంబో : ముక్కోణపు టీ20 టోర్నీ నాగిని నృత్యానికి స్పెషల్‌గా నిలిచిపోయింది!. శ్రీలంక 70 ఏండ్ల స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా నిర్వహించిన ఈ టోర్నీలో దినేశ్ కార్తీక్ హీరోయిక్స్‌తో పాటు నాగిని డ్యాన్స్ అభిమానులకు గుర్తుండిపోతుంది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకపై విజయానంతరం బంగ్లాదేశ్ ఆటగాడు ముష్ఫికర్ రహీం నాగిని డ్యాన్స్ చేశాడు. ఆ జట్టు మొత్తం అతడిని అనుకరిస్తూ నాగిని నృత్యంతో మైదానంలో సందడి చేశారు. ఇక ఫైనల్లో బంగ్లాదేశ్‌పై టీమ్ ఇండియా విజయంతో శ్రీలంక అభిమానులు నాగిని నృత్యాలతో అలరించారు. కామెంటరీ బాక్స్‌లో భారత వ్యాఖ్యాత సునీల్ గవాస్కర్ సైతం నాగిని నృత్యం స్టైల్‌తో సందడి చేశాడు.

లంక జెండాతో మనోళ్లు : టోర్నీలో భారత్, బంగ్లాదేశ్ రెండు సార్లు తలపడగా.. ఆ మ్యాచులకు అభిమానుల ఆదరణ లభించలేదు. కానీ ఫైనల్లో శ్రీలంక ఆడకపోయినా.. ఆ దేశ అభిమానులు సుమారు 20000 మంది స్టేడియానికి పోటెత్తారు. సాధారణంగా సొంత దేశం కాకుండా వేరే దేశాల మ్యాచ్‌లైతే అభిమానుల్లో చీలిక ఉంటుంది. కానీ ఆదివారం నాటి ఫైనల్లో లంక అభిమానులు పూర్తిగా భారత్‌కు మద్దతుగా నిలిచారు. టీమ్ ఇండియా విజయాన్ని కాంక్షించారు. ఇందుకు శ్రీలంకతో మ్యాచ్‌లో బంగ్లా ఆటగాళ్ల వెకిలి చేష్టలు ప్రధాన కారణంగా నిలిచాయి!. లంక అభిమానుల మద్దతుకు గుర్తుగా.. విజయానంతరం టీమ్ ఇండియా ఆ దేశ జాతీయ జెండాతో ద్వీప దేశ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపింది. శ్రీలంక జట్టు వీరాభిమాని పెర్సీ అభయ్‌శేఖర భారత జట్టు బృందంతో కలిసి వారి జాతీయ జెండాతో సందడి చేశాడు.



అల్పాహారమే.. డబ్బులివ్వలేదు

షమి వివాదంపై పాకిస్థాన్ మోడల్ అలీస్బా

దుబాయ్ : మహ్మద్ షమి, అతడి భార్య హసిన్ జహాన్ వివాదానికి ప్రధాన కారణంగా భావిస్తోన్న పాకిస్థాన్ మోడల్ అలీస్బా ఈ విషయంలో తొలిసారి స్పందించింది. దుబాయ్‌లో మహ్మద్ షమిని కలిసిన మాట వాస్తవమే కానీ, అది కేవలం ఓ అభిమాని-క్రికెటర్ వ్యవహారమేనని ఆమె స్పష్టం చేసింది. బ్రిటన్‌కు చెందిన వ్యాపారవేత్త తరఫున షమికి డబ్బులు ఇవ్వటం అవాస్తవమని ఆమె తెలిపింది. 'మహ్మద్ షమితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశాను. వ్యక్తిగతంగా మహ్మద్ భాయ్ గురించి నాకు తెలియదు. ఇక మా ఇద్దరి బ్రేక్‌ఫాస్ట్ భేటీలో ఆర్థిక లావాదేవీల ప్రస్తావన ఏమాత్రం లేదు' అని అలీస్బా స్పష్టం చేసింది. పాక్ మోడల్ నుంచి షమి డబ్బులు తీసుకున్నాడని హసిన్ జహాన్ చేసిన ఆరోపణలపై బీసీసీఐ అవినీతి నిరోధన విభాగం దర్యాప్తు చేస్తోన్న తరుణంలో అలిస్బా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.